
# కావూరి కోదండ రామయ్య

# స్వీయచరిత్ర




రావివారిపాలెం, కృష్ణాజిల్లా



ఒక శతాబ్దం క్రితం కృష్ణాజిల్లాలో
ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన
శ్రీ రావూరి కోదండరామయ్య
కృష్ణా జిల్లా బోర్డు వైస్ ప్రెసిడెంటుగా,
జిల్లా ఎడ్యుకేషన్ బోర్డు ప్రెసిడెంటుగా వున్న కాలంనాటి
జ్ఞాపకాలు ఇందులో రాసుకున్నారు.
స్థానిక చరిత్రను తెలుసుకోవడానికి ఇది ఉపకరిస్తుంది.

# కావూరి కోదండ రామయ్య స్వీయచరిత్ర

*రచనా కాలం : మార్చి 1952*



*తేది. 27-11-1882 — 10-6-1966*

**కావూరి కోదండ రామయ్య స్వీయచరిత్ర**

కూర్పు : అనురాధ


***ముద్రణ***

ప్రింటెక్స్, డాబాగార్డెన్స్

విశాఖపట్నం

***ప్రచురణ***

ఆగస్టు - 2013

వెల

125/-



***ప్రతుల కొరకు :***

***కావూరి కోదండరామయ్య***
రావివారిపాలెం
అవనిగడ్డ మండలం
కృష్ణా జిల్లా - 521125
ఫోన్ :8394430062

***జి. సీతాదేవి***
నెం. 8-3-236/1,
408, విష్ణు హోం, యూసఫ్‌గూడ
హైదరాబాద్ - 500 045
ఫోన్ : 9948868144

# చరిత్ర పుటల్లోకి.....

ఇది కావూరి కోదండరామయ్యగారి స్వీయ చరిత్ర. కోదండరామయ్య గారు కృష్ణా జిల్లాలో రావివారిపాలెం అనే చిన్న గ్రామంలో పుట్టి పెరిగారు. ఆయన కృష్ణాజిల్లా బోర్డు వైసు ప్రెసిడెంటుగా, జిల్లా ఎడ్యుకేషన్ బోర్డు ప్రెసిడెంటుగా వున్న కాలం నాటి ఆయన జ్ఞాపకాలను ఇందులో రాసుకున్నారు. ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి జిల్లా బోర్డు నిర్వహణను సమర్ధవంతంగా చేపట్టారు. బ్రిటిష్ హయాంలో పాలకుల తప్పుడు నిర్ణయాలనూ అధికార్ల అలసత్వాన్ని తన రైతువారీ తెలివితేటలతో ఎంతో చాకచక్యంగా ఎదుర్కొన్నారు.

మా తాతగారైన కోదండరామయ్య గారి స్వీయచరిత్ర ద్వారా వంద సంవత్సరాల క్రితం మా ప్రాంత చరిత్రను తెలుసుకోగలం. ఆ కాలంలో అక్కడ నీలిమందు పండేదని, బ్రిటిష్‌వారు డిబి డిబి ఔషధ చెట్లను నాటించారని చదివి ఆశ్చర్యం కలిగింది. బీ–కీపింగ్ (తేనే పరిశ్రమ) కొక అధికారి ఉండేవాడని తెలిసింది. అందుకే ఈ కథనానికున్న చారిత్రక ప్రాముఖ్యత రీత్యా దీన్ని అచ్చువేస్తే కృష్ణా జిల్లా చరిత్రని అధ్యయనం చేసేవారికి ఇది ఉపయోగపడుతుందని అనిపించింది. ఇందులో ఆయన స్వీయ చరిత్రతోపాటు కావూరి వారి వంశ క్రమం, రావివారిపాలెం గ్రామ చరిత్ర కూడా వున్నాయి. అంతేకాక ఆయన నోటు పుస్తకంలో రాసుకున్న ఆనాటి ముచ్చట్లను కొన్నిటిని కూడా చేర్చాను. ముఖ్యంగా 1910లో తిరుమల యాత్ర ఎలా ఉండి వుంటుందో తెలుసుకోగలం. అలాగే కోహినూర్ చరిత్ర, పులిగడ్డ ఆక్విడక్టుకు అయిన ఖర్చు, తపాలశాఖ చరిత్ర లాంటి శతాబ్దం క్రితం జరిగిన విషయాలు ఆసక్తిని కలిగిస్తాయి. భాష కొంచెం ఇబ్బందికరంగా వున్నా చారిత్రక కారణాల రీత్యా అలాగే వుంచాము. వంద సంవత్సరాలు వెనక్కి వెళ్లి మా తాతగారు కోదండరామయ్యగారి కళ్ల నుండి ఆ కాలాన్ని పరిశీలిద్దాం రండి.

**– సీతాదేవి**

**– కోదండ రామయ్య**

# కావూరి కోదండరామయ్య గారి స్వీయ చరిత్ర

గుంటూరు జిల్లా తెనాలి తాలూకా గుడివాడ గ్రామమున హిందూ మతస్థులును శైవ సాంప్రదాయముగల కమ్మ కులజులును అయిన కావూరి వారు నివసించెడివారు. వారిలో క్రీస్తు శకము 1800 సంవత్సరము నాటికే కావూరి వేంకట రామయ్యగారును ఆయన కుమారుడు బుచ్చయ్యగారును సదరు గుడివాడ గ్రామమునుండి, దివి తాలూకా దేవరకోట పరగణాలోని మోపిదేవి గ్రామ శివారైన రావివారిపాలెమునకు కాపురము వచ్చియుండిరి. అప్పటికి బుచ్చయ్యగారికి వివాహము కాలేదు. అప్పటి ఈ యూరి మునసబుగారైన రావి నాగయ్యగారి తోబుట్టువు సుందరమ్మగారిని బుచ్చయ్యగారు వివాహమాడి, కొంత స్థల వసతి మొదలగు ఏర్పాట్లు చేసుకొని భూములు సంపాదించుకొని, వ్యవసాయం చేయుచూ ఇచటనే స్థిరనివాసమేర్పరుచుకొనిరి. సదరు బుచ్చయ్య, సుందరమ్మ గార్లకు వీరన్న, సుబ్బన్నగార్లనే యిద్దరు కుమారులు జన్మించిరి. వారిలో వీరన్న గారికి మునసబుగారి కుమార్తెనిచ్చి పెండ్లిచేసి యిల్లటము తీసుకువెళ్లిరి. కొంతకాలమునకు వీరన్నగారి భార్య మశూచి వలన మరణించినది. పిమ్మట వారింట నుండుట తనకు గౌరవప్రదము కాదని తలచి వీరన్నగారు తిరిగి స్వస్థానమునకనగా తమ్ముడు సుబ్బన్నగారి వద్దకు వచ్చి యిచటనే తల్లిగారి పోషణలోనుంటుండెను. పిమ్మట వీరన్నగారు పెదరావూరు గ్రామంలో మహాలక్ష్మమ్మ గారనే ఆమెను వివాహము చేసుకొని ఆమెతో సహా తమ్ముడైన సుబ్బన్నగారి కుటుంబముతో కలిసియుంటున్నారు. సదరు వీరన్నగారికి లక్ష్మీదేవి అనే కుమార్తెయును, కొటయ్య అనే కొమారుడును జన్మించిరి. వారిలో లక్ష్మీదేవిగారిని యీ గ్రామములో రావి జానకిరామయ్యగారికిచ్చి వివాహము చేసిరి. వారి సంతతి వారిప్పటికిని తగిన వసతి సౌకర్యములు కలిగి యీ గ్రామమునందున్నారు. వీరన్నగారి కుమారుడు కోటయ్యగారు మోపిదేవిలో గద్దే పెద వీరన్నగారి కుమార్తె కుటుంబమ్మగారిని వివాహము చేసుకొనిరి. వారికి సంతానము లేనందున సుబ్బన్నగారి రెండవ కొమారుడైన శేషయ్యగారి మూడవ కుమారుడైన శివరామయ్యను దత్త స్వీకారము చేసికొనిరి. సదరు శివరామయ్య మోపిదేవి బోర్డు స్కూలులో టీచరుగానూ, పోస్ట్ మాస్టరుగానూ పనిచేయుచు సొంత పొలములో వ్యవసాయము చేయించుకొనుచుండెను. ఈయన భార్య సీతారామమ్మ మోపిదేవిలో గద్దె నాగయ్యగారి కొమార్తె. సదరు శివరామయ్యగారికి 1. వేంకట కుటుంబరావు 2. వెంకటేశ్వరరావు 3. కోటయ్య 4. వీర రాఘవరావు అనే నలుగురు కొమాళ్లు కలిగిరి. వారిలో వెంకట కుటుంబరావు కాటూరు వాస్తవ్యులగు సూర్యదేవర పున్నయ్యగారి కుమార్తె వరలక్షమ్మను వివాహమాడెను. సదరు వెంకట కుటుంబరావు హయ్యరుగ్రేడు ట్రైనింగుని, వైద్య ప్రాధమిక చికిత్సా విధానమును చదివి కొంతకాలము పాఠశాలోపాధ్యాయుడుగ పనిచేసి పిమ్మట రాజకీయ రంగమున రైతు సంఘమునందున, కమ్యూనిస్టు పక్షమునను ప్రచారములో ప్రవేశించి పనిచేయుచుండెను. ఇతనిని కొంతకాలము డిటన్యూగా నుంచి పిమ్మట ప్రభుత్వము వారు వదిలివేసిరి. ఇతనికి వెంకటరావు అనే కుమారుడును, లక్ష్మీదేవి అనే కుమార్తెయును కలరు. శివరామయ్యగారి రెండవ కొమారుడైన వేంకటేశ్వరరావు కొక్కిలిగడ్డ శివారు కొత్తపాలెంలో యార్లగడ్డ వెంకయ్యగారి కుమార్తెను వివాహమాడెను. వీరికి సీతారామప్రసాదు అనే కుమారుడును మరి ఇద్దరు చిన్నబిడ్డలు కలిగిరి. సదరు వెంకటేశ్వరరావు కొన్నాళ్లు చల్లపల్లి సొసైటీ గుమాస్తాగా నుండి పిమ్మట గుంటూరు జిల్లాలో

వ్యవసాయ డిపార్టుమెంటులో తేనెటీగల పెంపకపు మేస్త్రీగా వుంటున్నాడు. శివరామయ్యగారి మూడవ కుమారుడు కోటయ్య ఈ గ్రామంలోనే పూర్వపు బంధుత్వముగల రావి జానకిరామయ్యగారి మనమడైన సత్యనారాయణగారి కుమార్తె నాంచారమ్మను వివాహమాడెను. ఇతను కాలేజీ చదువు పూర్తిచేసుకొనకముందే తల్లిగారు చనిపోవుట వల్లను, కొంతకాలము మిలిటరీ సర్వీసులో సివిలు గుమాస్తాగా పనిచేసి, పిమ్మట మదరాసు వెటరనరీ ట్రైనింగు పొంది, బళ్లారి జిల్లా రాయదుర్గము తాలూకాలో అసిస్టెంటు వెటరనరీ సర్జనుగా పనిచేస్తున్నాడు. శివరామయ్య నాలుగవ కుమారుడైన వీరరాఘవరావు 'బీకీపింగు'లో ట్రైనింగు పొంది యిపుడు నైజామాబాదు జిల్లా కోటగిరిలో తేనెటీగల పెంపకములో పనిచేయుచున్నాడు. ఇంకా వివాహం కాలేదు. శివరామయ్య మాత్రం యింటివద్దనే వుంటూ పోస్టుమాస్టరీ చేస్తూ పొలం పని చూసుకుంటున్నాడు. బుచ్చయ్యగారి రెండవ కుమారుడైన సుబ్బన్నగారికి సుబ్బమ్మగారనే భార్య కలదు. ఈమెకు చాలా తెలివికలదని, ప్రయోజకురాలని పేరు ప్రతిష్టలు కలవు. వీరికి 1. నాగయ్య, 2. శేషయ్య, 3. శ్రీరాములు 4. వెంకటరామయ్య అనే నలుగురు కుమారులు కలిగిరి. వారిలో నాగయ్యగారికి యీ వూరిలోనే రావి సుబ్బన్నగారి కుమార్తె రత్నమ్మగారినిచ్చి వివాహము చేసిరి. ఈయన బాగా చదువుకొని వ్యవహార దక్షత కలిగి స్వప్రయోజకత్వముతో ఆస్తిని సంపాదించి పెద్ద వాడుక పురుషుడు కాగలిగెను. వీరికి సంతతి లేనందున శేషయ్యగారి రెండవ కుమారుడైన కోదండరామయ్యను దత్తత స్వీకారము చేసుకొనిరి. సుబ్బన్నగారి రెండవ కుమారుడైన శేషయ్యగారికి జంపన గ్రామంలో గవిని కామయ్యగారి కుమార్తె సరమ్మగారినిచ్చి వివాహము చేసిరి. వారికి వెంకటకృష్ణయ్య 2. కోదండరామయ్య 3. శివరామయ్య అనే ముగ్గురు కొమార్లు కలిగిరి. వారిలో పెద్దకుమారుడైన వెంకట కృష్ణయ్య గారు మాత్రమే తల్లిదండ్రుల వద్దనున్నారు. రెండవ కుమారుడైన కోదండరామయ్యను నాగయ్యగారికిన్ని, మూడవ కుమారుడైన శివరామయ్యను కోటయ్యగారికిన్ని దత్తత యిచ్చినందున వారు ప్రత్యేక కుటుంబములుగా నేర్పడిరి. శేషయ్యగారి వద్దనున్న పెద్దకొడుకైన వెంకటక్రిష్ణయ్యగారు పమిడిమర్రు కాపురస్తులు వల్లభనేని లక్ష్మయ్యగారి కుమార్తె పున్నమ్మగారిని వివాహము చేసికొనిరి. వారికి 1. బసవయ్య, 2. సత్యనారాయణ 3. బలరామయ్య 4. రామశేషయ్య అనే నలుగురు కొమార్లు కలిగిరి. వారిలో సత్యనారాయణకు పెదలంక వాస్తవ్యులు కొల్లి బసవయ్యగారి కొమార్తె విమలాదేవినిచ్చి వివాహము చేసిరి. వారికి సీతారామయ్య, గోపాలరావు అనే యిద్దరు కొమార్లున్ను మరియు యిద్దరు కొమార్తెలున్ను కలిగిరి. బలరామయ్య పేము అల్లిక మొదలగు పనులు, వడ్రంగములో నాజూకు పనులు చేయుటలోను మిగులు నేర్పరి. యీయన బొబ్బర్లంక బాలపుల్లయ్య గారి గుమాస్తా. బలరామయ్యకు లక్ష్మీ తులసమ్మ అనే భార్యయును, రవీంద్ర బాబు అనే కొమారుడును కలరు. రామశేషయ్యకు యీవూరిలోనే వెంకటకృష్ణయ్యగారి కుమార్తె బిడ్డయును రావి సత్యనారాయణ కొమార్తెయును అయిన వెంకటరామమ్మనిచ్చి వివాహము చేసిరి. వారికి సీతానాగేశ్వరరావు అనే కొమారుడు కలదు. వెంకటకృష్ణయ్యగారికి భ్రమరాంబ అనే కుమార్తె కలదు. ఆమెను యీ యూరిలోనే రావి రత్తయ్యగారి కొమారుడు సత్యనారాయణ గారికిచ్చి వివాహము చేసిరి. (వారి కుమార్తెయే తన నాల్గవ కుమారుని భార్య వెంకటరామమ్మ) వెంకట కృష్ణయ్య గారి కుమార్తె, అల్లుడు వారి సంతానముతో తగు వసతి సౌకర్యములు కలిగి ఆ యూరిలోనే ఉంటున్నారు. బసవయ్య మాత్రం అవివాహితుడగుటచేత తల్లిదండ్రులతోనే ఉంటున్నాడు.

కావూరి సుబ్బన్నగారి మూడవ కొమారుడైన శ్రీరాములు గారికి పాపవినాశనం కాపురస్తులు కొల్లి బుచ్చయ్యగారి కుమార్తె రత్నమ్మగారినిచ్చి వివాహం చేసిరి. ఆమె చాలా పతిభక్తిగల యిల్లాలు. ఆమెకు 1. రామకృష్ణయ్య 2.

సూర్యనారాయణ అనే యిద్దరు కొమాళ్ళు కలిగిన తర్వాత కొంతకాలమునకు చనిపోయినది. అనంతరం శ్రీరాములుగారు మరల నాగాయతిప్ప వాస్తవ్యులైన పరుచూరి రామన్నగారి కొమార్తె సౌభాగ్యమ్మను వివాహము చేసుకొనిరి. వీరికి 1. సుబ్బయ్య 2. వెంకటరత్నం 3. సత్యనారాయణ అనే ముగ్గురు కొమాళ్ళున్ను, సీతారామమ్మ అనే కొమార్తెయును జన్మించిరి. వారిలో రామకృష్ణయ్యగారికి ఘంటసాలలో వేమూరి పిచ్చయ్యగారి కుమార్తె సీతారత్నమ్మను ఇచ్చి వివాహం చేసిరి. వారికి చిదంబరరావు అనే ఒక కొమార్డును, 1. గిరిజాదేవి 2.మనోహరమ్మ అనే ఇద్దరు కుమార్తెలున్ను కలిగిరి. వారిలో చిదంబరరావుకు తన పినతాత అయిన వెంకటరామయ్యగారి కొమార్తె (రాఘవమ్మ) బిడ్డ అయిన నరసమ్మనిచ్చి వివాహము చేసిరి. సదరు చిదంబరరావు సెకండరీ గ్రేడు ట్రయినెంగు అయి మోపిదేవిలో బోర్డు హైస్కూలులో టీచరుగా పనిచేస్తున్నారు. రామకృష్ణయ్యగారి పెద్ద కుమార్తె గిరిజాదేవిని ఆమె రెండవ మేనమామ రాధాకృష్ణయ్యగారికిచ్చి వివాహము చేసిరి. వారికి బాబురావనే ఒక కొమార్డు కలిగెను. గిరిజా దేవి పరలోక ప్రాప్తి చెందినది. మరల ఆమె స్థానే రామకృష్ణయ్యగారి రెండవ కుమార్తెనిచ్చి వివాహము చేసిరి. ఆమె (మనోహరమ్మ) రావివారిపాలెంలో బోర్డు గర్ల్సు హైస్కూలులో హెడ్ మిస్ట్రెసుగానుంటున్నది. వారందరు తగు వసతి సౌకర్యములు కలిగి ఈ యూరిలో ఉంటున్నారు.

శ్రీరాములుగారి రెండవ కుమారుడైన సూర్యనారాయణకు ఈ గ్రామంలోనే రావి పిచ్చయ్యగారి కుమార్తె లక్ష్మమ్మనిచ్చి వివాహం చేయగా 1. వీరరాఘవయ్య, 2. శ్రీరామకృష్ణయ్య, 3. రామలింగయ్య అనే ముగ్గురు కొమాళు ్లను, 1. వెంకటరత్నం, 2. లక్ష్మీకాంతమ్మ, 3. శేషారత్నమ్మ 4. వెంకటనారాయణమ్మ అనే నలుగురు కుమార్తెలున్ను కలిగిరి. వారిలో వీరరాఘవయ్యకు మైనేనివారిపాలెలో ఎనిగళ్ల సుబ్బయ్యగారి కుమార్తె వెంకటరత్నమ్మనిచ్చి వివాహం చేసిరి. వారికి సూర్యనారాయణ అనే ఒక కుమార్డు కలిగెను. సూర్యనారాయణ గారి రెండవ కుమారుడైన శ్రీరామకృష్ణయ్యకు గుండుపాలెం కాపురస్తులగు తూమాటి వెంకయ్యగారి కుమార్తె లక్ష్మీకాంతమునిచ్చి వివాహము చేసిరి. సూర్యనారాయణ గారి పెద్ద కుమార్తెను నల్లూరు కాపురస్తులు సజ్జా అంజయ్యగారికిచ్చి వివాహము చేసిరి. వీరికొక కుమార్డు, కుమార్తె కలిగిరి. రెండవ కుమార్తె లక్ష్మీకాంతమ్మను ఎడ్లలంక కాపురస్తులు యలమంచిలి వీరరాఘవయ్యకిచ్చి వివాహము చేసిరి. వీరికి ఒక కొమార్డు, కొమార్తె కలిగిరి. సూర్యనారాయణగారి మూడవకుమార్తె శేషారత్నమ్మను గుండుపాలెం కాపురస్తులు తూమాటి వెంకయ్యగారి కుమార్డు సత్యనారాయణకిచ్చి వివాహం చేసిరి. వారందరు వారి స్థానములలోనే తగు వసతి కలిగి యుంటున్నారు. శ్రీరాములుగారి మూడవ కుమారుడైన సుబ్బయ్యకు ఈ గ్రామంలోనే రావి లక్ష్మయ్య గారి దత్తత కుమార్తె సత్య జ్ఞానప్రసూనాంబనిచ్చి వివాహం చేసిరి. వారికి బాలచంద్రశేఖర ప్రసాద్ అనే కొమారుడున్ను 1. సరస్వతి. 2. రమణమ్మ 3. ద్రౌపది 4. నిర్మల అనే నలుగురు కుమార్తెలున్ను కలిగిరి. వారిలో సరస్వతిని గుండుపాలెం వాస్తవ్యులు వీరమాచనేని నరసింహరావుగారికిచ్చి వివాహము చేసిరి. రమణమ్మను కోడూరు వాస్తవ్యులు పరుచూరి నరసింహరావుగారికిచ్చి వివాహము చేసిరి. పరచూరి నరసింహరావు-రమణమ్మ గారిద్దరు బోర్డు స్కూళ్లలో ఉపాధ్యాయులుగా ఉండెను. తక్కినవారు వారి స్వస్థానంలలో భూవసతి మొదలగు వృత్తులలోనుంటున్నారు. శ్రీరాములు గారి నాలుగవ కుమారుడైన వెంకటరత్నంకు అయోధ్య వాస్తవ్యులు కోనేరు ఆకాశరామయ్యగారి కుమార్తె చెల్లమ్మనిచ్చి వివాహం చేసిరి. వారికి దేవకీనందన ప్రసాదనే కుమార్డున్ను - హేమవతి, ఇందిరాదేవి అనే ఇద్దరు కుమార్తెలున్ను కలిగిరి. శ్రీరాములుగారి అయిదవ కుమారుడైన

సత్యనారాయణకు ఆకులమన్నాడు వాస్తవ్యులు పరుచూరి లక్ష్మీనారాయణగారి కుమార్తె సీతారామమ్మనిచ్చి వివాహము చేసిరి. వారందరు తగు వసతి సౌకర్యములతోనుంటున్నారు. శ్రీరాములుగారి కుమార్తె సీతారామమ్మగారిని మూరతోట కాపురస్తులు వుప్పల బుచ్చి కోటయ్యగారికిచ్చి వివాహం చేసిరి. వారికి 1. వెంకటేశ్వర రావు, 2. ఉమామహేశ్వరరావు అనే ఇద్దరు కుమార్లు, కామేశ్వరమ్మ అనే కుమార్తె కలిగిరి. వారందరు తగు వసతి సౌకర్యములతో మూరతోటలోనూ, రేపల్లెలోనూ ఉంటూ ఉన్నారు.

కావూరి సుబ్బన్నగారి నాల్గవ కుమారుడైన వెంకటరామయ్యగారికి ఆయన పెత్తండ్రి కుమార్తె అగు రావి లక్ష్మమ్మదేవి గారి కుమార్తె శేషమ్మగారినిచ్చి వివాహం చేసిరి. వారికి 1. సీతారామయ్య 2. రామచంద్రయ్య అనే ఇద్దరు కుమాళ్లున్ను 1. సుబ్బమ్మ 2. పార్వతమ్మ 3. రాఘవమ్మ 4. నాంచారమ్మ అనే నలుగురు కుమార్తెలున్ను కలిగిరి. వారిలో సీతారామయ్యకు సింగుపాలెం కాపురస్తులగు కొల్లి అమ్మయ్య గారి కుమార్తె రామాంజమ్మనిచ్చి వివాహము చేసిరి. వారికి రామకృష్ణయ్య అనే కుమారుడు జన్మించెను. పిమ్మట కొంతకాలమునకు సీతారామయ్య ఆన 1916 సం॥న చనిపోయెను. సదరు సీతారామయ్య కుమారుడు రామకృష్ణయ్యకు ఆయన మూడవ మేనత్తయగు రాఘవమ్మ కుమార్తె సీతారామమ్మనిచ్చి ఆన 1936లో వివాహము చేసిరి. ఈ రామకృష్ణయ్య సెకండరీ గ్రేడు ట్రయినింగు పొంది, స్వభాషలో పాండిత్యంనకు చదివి ఓరియంటల్ పరీక్షలో గెలుపొంది మోపిదేవిలో బోర్డు హైస్కూలులో పండితుడగును, ఉపాధ్యాయుడుగనుంటూ తన విరామసమయంలో తన వ్యవసాయాదికమును సరిజేసుకొనుచూ నుంటున్నాడు. వెంకటరామయ్యగారి రెండవ కుమారుడైన రామచంద్రయ్యగారికి వెలువోలు గ్రామస్తులు చలసాని బ్రహ్మయ్యగారి కుమార్తె కుటుంబమ్మనిచ్చి వివాహము చేసిరి. వీరికి 1 సీతామహాలక్ష్మి 2. లక్ష్మీదేవమ్మ 3. విమలాదేవి 4. కృష్ణకుమారి 5. సుగుణాదేవి 6. రాఘవమ్మ అనే కుమార్తెలు కల్గిరి. వీరిలో సీతామహాలక్ష్మిని ముంజులూరు వాస్తవ్యులు మండవ బ్రహ్మానందరావుగారికిచ్చి పెండ్లి చేసిరి. రామచంద్రయ్యగారి రెండవ కుమార్తె లక్ష్మీదేవమ్మను శివరామపురం గ్రామస్తులు రావి రామచంద్రయ్యగారి మూడవ కుమారుడైన వెంకటేశ్వరావుగారికిచ్చి వివాహము చేసిరి. ఈ దంపలిద్దరును హైస్కూలు చదువుతున్నారు. వెంకటరామయ్యగారి కుమార్తెలలో 1, 4 కుమార్తెలను వుప్పల వెంకటకృష్ణమ్మగారికిని, ఆయన కొమారుడైన అచ్చయ్యగారి కుమారునికిని యిచ్చి వివాహం చేయగా అనతి కాలంలోనే వైధవ్యప్రాప్తి కలిగినది. వెంకటరామయ్యగారి రెండవ కుమార్తె పార్వతమ్మను సింగుపాలెం కాపురస్తులు యార్లగడ్డ సుబ్బయ్యగారి కుమార్డు రంగయ్యగారికిచ్చి వివాహం చేసిరి. వారికి 1. సీతారామయ్య 2. సాంబశివరావు అనే ఇద్దరు కుమారులున్నూ, అన్నపూర్ణమ్మ అనే కుమార్తెయున్ను కలిగిరి. వారందరూ వారి కుటుంబాలతో తగు వసతి సౌకర్యాలు కలిగియుంటున్నారు. వెంకటరామయ్యగారి మూడవ కుమార్తెయగు రాఘవమ్మను మూరుతోటలో వుప్పల లక్ష్మయ్యగారి కుమార్డు వెంకటరామయ్యగారి కిచ్చి వివాహం చేసిరి. వారికి 1. ప్రసాదరావు 2. కృష్ణమూర్తి 3. సత్యనారాయణ అనే ముగ్గరు కుమార్లున్నూ 1. సీతారామమ్మ 2. నరసమ్మ అనే యిద్దరు కుమార్తెలున్నూ కలిగిరి. పిమ్మట కొంత కాలమునకు రాఘవమ్మ చనిపోయినది. వీరిలో సీతారామమ్మను ఆమె పెద్దమేనమామ అయిన సీతారామయ్యగారి కుమార్డు రామకృష్ణయ్యగారికిని, నరసమ్మను ఆమె పెద తాతగారి మనమడైన చిదంబరరావునకు యిచ్చి వివాహములు చేయబడెను. ఈ విధముగా వీరిద్దరు కావూరి వారి కోడండ్లుగనున్నారు. కోమాళ్లు ముగ్గరికి కనగాలవారిపాలెం -మైనేనివారిపాలెం -పెసర్లంకలలో తగిన వధువులను కుదిర్చి వివాహము చేసిరి. (వారు సోదరులు ముగ్గురు)

ఇంగ్లీషులో కాలేజి క్లాసులు చదివి యిద్దరు ఉద్యోగములోను ఒకరు యింటివద్ద వ్యవసాయ వ్యవహారములు చేయుచు తండ్రివద్దనుంటున్నారు.

## కావూరి కోదండరామయ్య పుట్టుక - విద్యాభ్యాసం

కావూరి సుబ్బన్నగారి పెద్ద కొమారుడు నాగయ్యగారున్ను ఆయన భార్య రత్నమ్మ గారున్ను సంతతి లేక నాగయ్యగారి తమ్ముడైన శేషయ్య గారి ద్వితీయ కొమారుడైన కోదండరామయ్యను దత్త పుత్రుడుగా కోరి హైందవ శాస్త్రీయ పద్ధతిని 1893 సం॥ ఏప్రిల్‌లో దత్త స్వీకారము చేసుకొన్నారు. కోదండరామయ్య జననం 1882 సం॥ నవంబరు 27వ తేదీ చిత్రభాను నామ సంవత్సర కార్తీక బహుళ తదియ సోమవారం రాత్రి 9 గం॥ల వేళలో ఆర్ద్రా నక్షత్ర తృతీయ చరణం కర్కాటక లగ్నమని చెప్పబడినది. విద్యాభ్యాసం ఆరంభం కొక్కిలిగడ్డ నరసింహంగారి వద్ద 1889 సం॥ అక్టోబరు నెలలోననగా విరోధి నామ ఆశ్వీయుజ శుక్రవారం ఇప్పటి 1వ తరగతినే అప్పుడు ఇన్‌ఫెంటు స్టాండర్డు అనేవారు. ప్రారంభించిన మూడు మాసములకు ఆ తరగతిని పూర్తిచేసి 1వ తరగతిలోననగా యిప్పటి రెండవ తరగతిలో ప్రవేశించెను. పిమ్మట అప్పటి రెండవ తరగతిలో "ఓ మిత్రుడా! దక్షిణపు చాయనున్న మామిడిచెట్టును చూచివత్తమురా!" అనే పాఠమును బడిలో చెప్పించుకొని 1891 సం॥ము జనవరి నాటి సాయంత్రం యింటికి రాగానే జ్వరము ప్రారంభించి, అది మశూచిగా పరిణమించింది. అప్పుడు నందన సంవత్సరం చైత్ర బ॥ వరకు బడి మానవలసివచ్చినది.

తర్వాత 1892 ప్రాంతమున మోపిదేవిలో 'బోర్డుశాలరీ రిజల్టు స్కూలు' నెలకొల్పబడినది. అప్పుడు ఆ స్కూలు మాస్టారుకు కొద్దిపాటి జీతమనగా నెలకు 8 రూ॥లు షుమారు జీతము ఇచ్చేవారు. అదిగాక చదువులో పరీక్షయందుర్తీర్ణులైన పిల్లల సంఖ్యను బట్టి కొంత గ్రాంటుగా యిచ్చేవారు. అందువల్లనే ఆ స్కూళ్లు శాలరీ రిజల్టు స్కూళ్లని పిలువబడేవి. ఆ స్కూలు మోపిదేవిలో స్థాపించిన ప్రథమములో చింతల చెరువు కృష్ణయ్యగారు, ప్రభల జోగయ్యగారు అనే యిద్దరు టీచర్లు అయిన తర్వాత నాదెళ్ల సుబ్రహ్మణ్యంగారు మాస్టారుగా వచ్చినారు. అప్పటినుండి స్కూలు అభివృద్ధికి రాసాగినది. సుబ్రహ్మణ్యంగారి వద్ద స్కూలులో అప్పటి నాల్గవ తరగతిని చదివి 17 మంది విద్యార్థులము చల్లపల్లి సెంటరులో గవర్నమెంటుచే నేర్పరుపబడిన బోర్డు ఆఫ్ ఎగ్జామినర్స్ వద్ద పరీక్షకు హాజరై ప్రయిమరీ పరీక్షలో, గెలుపొంది సర్టిఫికెట్లు సంపాదించితిమి. ఆ పరీక్షలకు బందరు హిందూ హైస్కూలు హెడ్మాస్టరుగారైన కుంభకోణం కృష్ణమాచార్యులుగారు చైర్మను. వారణాసి బలరామయ్యగారు చెన్నాప్రగడ భానుమూర్తిగారు మొదలగు ప్రొఫెసర్లు దశిగ కృష్ణమూర్తిగారును అయియున్నారు. ఈ పరీక్ష 1894 డిసెంబరు నెలలో చల్లపల్లి సెంటరులో జరిగినది. అప్పటి పద్ధతులననుసరించి మాస్టార్లకు తగినంత గ్రాంటున్ను ముట్టినది. అట్టిపద్ధతి అమలులోనున్న కాలములో ఎక్కువ మంది విద్యార్థులను పరీక్షలలో నెగ్గించవలెననే పూనికతో మాస్టార్లువారు స్వయముగా చెప్పుటకు పిల్లల సంఖ్య హెచ్చుగానున్నపుడు వారే స్వంతముగా ఎవరినైనా తగిన ఉపాధ్యాయులను తమకు సహాయముగా తెచ్చుకొని వారుభయులు శ్రద్ధతో చదివించెడివారు. ఆ కాలపు విద్యార్థులును ఎక్కువ దీక్షతో శ్రద్ధగా చదివి మంచి ఫలితములనే చూడగలిగేవారు.

1894 సం॥ముతో నా ప్రయమరీ పరీక్ష పూర్తిఅయినది. పిమ్మట అంతకు పై క్లాసులు చదువుటకు మోపిదేవిలోగాని సమీపమున చల్లపల్లి అవనిగడ్డ మొదలగు పెద్ద యూళ్లలోగాని ఫస్టుఫారం క్లాసు లేదు. బందరు

పోవలసిందే. అందువలన మూడేండ్ల వరకు పై క్లాసుకు వీలు దొరకక ఆగవలసివచ్చింది. ఆ కాలము వ్యర్థము చేయక హైజీను, అగ్రికల్చర్ టెస్టు, మెన్సురేషన్, ఇంగ్లీషు మొదలగునవి స్పెషల్ టెక్స్టులుగా చదివి పరీక్షలలో గెలుపొందితిని. పిమ్మట 1898 సం॥ జనవరు 24వ తేదీని బందరు వెళ్లి హిందూ హైస్కూలులో ఫస్టుఫారములో ప్రవేశించి ఇంగ్లీషు చదువనారంభించితిని. ప్రతి క్లాసులోను ఫస్టున మానిటరుగానుంటూ మూడేండ్లు అచట చదివి 1900 సం॥ డిసెంబరు నెలలో "లోవర్ సెకండరీ", గవర్నమెంటు పరీక్షలో మొదటి తరగతి మార్కులు సంపాదించి ఫస్టుప్లేసుతో సర్టిఫికెటు పొందితిని. గవర్నమెంటు స్కాలర్‌షిప్ శాంక్షన్ అయినది. గాని అప్పటికిలాగా 1900 సం॥ సెప్టెంబరు 7వ తేదీ శార్వరి సంవత్సరము భాద్రపద శుద్ధ 13 శుక్రవారం మా దత్తత తండ్రిగారైన కావూరి నాగయ్యగారు తన 64వ ఏట విరోచనముల వ్యాధివలన మరణించిరి. అందువల్ల యింటివద్ద నుండి భూముల వ్యవసాయమును, వడ్డీ వ్యాపారమును చూచుకొనవలసిన అవసరము తటస్థించినది. ఆ పనులు నెరవేర్చుటకు జనకతండ్రి కావూరి శేషయ్యగారుగాని మేనమామ రావి రామయ్యగారుగాని బాధ్యత వహించనందున చదువుమానివేసి మా దత్త తల్లి రత్నమ్మగారితో మా యింటివద్దనే వుండవలసివచ్చినది.

అప్పటికి మా సంసారమునకు 25 ఎకరములు మెట్ట పంటల భూవసతిన్ని, పన్నెండుంబాతిక మండువా పెంకుటి భవంతిలో సగభాగమున్ను, యింటి వెనుక ముందు స్థలమున్ను గ॥ 10+30 వాముల దొడ్డిన్ని, సుమారు ఏడువేల రూపాయల వడ్డీ వ్యాపారమున్ను, 2000 నగదున్ను, మరికొన్ని వస్తు వాహనములు, పశువులు మొదలగు చరాస్తిన్ని కలదు. వాటితో కాలక్షేపము చేయుచూ మధ్య వీలున్నపుడు కొన్ని సంవత్సరములలో ధాన్యం మొదలైన బేరమువల్ల కొద్దిపాటి లాభములు సంపాదిస్తూ విద్యను మరచిపోకుండా ఏదో కొంత కృషి దానిలో చేస్తూ వుండగా మా దత్తత తల్లి వైపు దత్తత మేనమామ అయిన రావి రామయ్య గారి కుమార్తె సీతారామమ్మనిచ్చి 1903 సం॥ ఏప్రిల్ 22వ తేదీని వివాహము చేసిరి. 1906-1907 సంవత్సరములలో ఓగిరాల జనార్ధనరావుగారి వద్ద సంగీత విద్యనభ్యసించి హార్మోనియం మీదను, గాత్రమునను పాడడమేగాక సంగీత సాంప్రదాయమును గురించి కొంత పరిశ్రమ చేసి వారి వలన తెలుసుకోగలిగితిని. 1907 సం॥ము ఫిబ్రవరి నెలలో మా దంపతులిద్దరము గృహస్థాశ్రమమున ప్రవేశించితిమి.

మా దంపతుల సంతానము : ఆన 1912 సం॥ మే నెల 3వ తేదీ రాత్రి 3 గం॥ల వేళ అనూరాధ నక్షత్రమున ఒక కమార్తెయును. ఆన 1916 సం॥ డిసెంబరు నెల 2వ తేదీ రాత్రి 11-30 గంటల వేళ శతభిష నక్షత్రమున ప్రధమ పుత్రుడును, ఆన 1925 సం॥న నవంబరు నెల 26వ తేది పగలు 10 గం॥ల వేళ రేవతీ నక్షత్రమున ద్వితీయ పుత్రుడు జన్మించిరి. వీరి నామకరణము చేసిన విధానము ఏమనగా కొమార్తెకు దత్తత తండ్రిగారైన నాగయ్యగారి యొక్కయు, దత్తత తల్లిగారైన రత్నమ్మగారి యొక్క పేర్లు కలిసి వచ్చేలాగున్ను జన్మనక్షత్ర నామ నక్షత్రములకు మొదటి అక్షరము సరిపోవునటులను ఆలోచించి 'నాగరత్నమ్మ' అని పేరు పెట్టితిమి. ప్రధమ పుత్రుడు అదేవిధముగా జన్మ నామ నక్షత్రములకు సరిపోవునటులను శివపరముగా నుండునటులను సోమశేఖరప్రసాద్ అని పేరు పెట్టితిమి. రెండవ కుమారునికి జన్మ నామ నక్షత్రములకు సరిపోవు మొదటి అక్షరములతోను మార్గశిర మాసము నందు జననమగుటను బట్టి శ్రీకృష్ణ పరముగా నుండునటులను 'దేవకీ నందన ప్రసాద్' అని పేరుంచబడెను. వీరిలో నాగరత్నమ్మను వెల్లటూరు వాస్తవ్యులు పమిడిముక్కల కోటయ్యగారి కోమారుడు శివరామయ్యకిచ్చి 1925 సం॥ము మార్చి 12వ తేదీని వివాహము చేయబడెను. వారికి మోహన కృష్ణప్రసాద్, యజ్ఞనారాయణ అను కోమాళ్లున్ను, పద్మావతి, విమలాదేవి అనే

యిద్దరు కొమార్తెలును కలిగిరి. కుమారులిద్దరు కాలేజీలోను, పద్మావతి హైస్కూలులోను చిన్న కుమార్తె మిడ్డిల్ స్కూలులోను చదువుతున్నారు. శివరామయ్య వివాహానంతరం కొంతకాలమైన పిమ్మట వ్యవహారానుభవం సంపాదించి, వర్జీనియా పొగాకు వల్లను, రైసుమిల్లు, సరుగు తోటలు వేసి పెంచి అమ్ముట, సినిమా మొదలగు వంటి వల్లను ద్రవ్యార్జన చేసి వారి కుటుంబ పరిస్థితిని పూర్వమున కంటే చాలా హెచ్చు దశకు తేగలిగెను.

నాగరత్నమ్మకు పుట్టింటి వారి వైపు నుండి అరణముగా కొంత సొమ్మున్ను, భూవసతిన్ని మొదలగునవి లభించినవి. ఆమె పేర పదకొండున్నర ఎకరముల మాగాణి భూమి పెదప్రోలు గ్రామమునందున్నది. దాని ఆదాయము ఆమెకే చేరుతున్నది. ఈ విధంగా వారి సంసారస్థితి మంచి వసతి సౌకర్యములతో హెచ్చుదశయందున్నది. కోదండరామయ్యగారి పెద్ద కుమారుడు సోమశేఖర ప్రసాదరావు విద్యాభ్యాసము నందు ప్రారంభము నుండి అనగా చిన్న తరగతుల నుండి ఇంగ్లీషులో బి.ఎ వరకు ఎన్నడూ ఏ తరగతిలోనూ పరీక్ష తప్పకుండా చదువుచుండెను. బి.ఎ. చదివిన చివరి సం॥ము పరీక్షకు ముందు టైఫాయిడు జ్వరము వచ్చి నెలరోజులు మిగులు బాధనొంది ఆ పరీక్షలో ఒక సబ్జెక్టులో మాత్రము కోల్పోయెను. ఎకనమిక్సు, పాలిటిక్సుతో మిగతా బి.ఎ. పరీక్ష నెగ్గెను. ఆ కొరత సబ్జెక్టును పూర్తిచేయనేలేదు. చిన్న చిన్న నాటికలు, వచన శైలిలో వ్రాయుచుండెడివాడు. ఇతనికి వ్యవసాయము నందే ఎక్కువ శ్రద్ధాభిలాషలు కలవు. ప్రభుత్వ ఉద్యోగమునాశించెడివాడు కాదు. ఈయనకు మేనమామయగు రావి వెంకటరత్నం గారి కొమార్తె దుర్గాంబనిచ్చి ఆన 1937 సం॥లో వివాహము చేసిరి. ఈ దంపతులకు 'రమేష్‌బాబు' అనే కుమారుడు రామసీతారామమ్మ అనే కొమార్తెయును, విజయలక్ష్మి అనేపేరుగల చిన్న బిడ్డయును కలిగిరి. వీరిలో రమేష్‌బాబు చదువులో అయిదవ తరగతి పూర్తిచేసినాడు. రామసీతారామమ్మ ఒకటవతరగతి చదువుతున్నది.

కోదండరామయ్యగారి రెండవ కుమారుడైన దేవకీ నందన ప్రసాదు ఇంగ్లీషు విద్యలో ఇంటర్మీడియట్ తరగతి చదివి కొద్ది కొరతగా పరీక్షనిచ్చినాడు. ఆ కొరత పూర్తిచేయనేలేదు. ఇతనికి లక్షణయుక్తమగు భావ కవిత్వం కొంతవరకలవడినది. పద్యములలోనొక పుస్తకమచ్చొత్తించి రెండవది వ్రాసి దానిని బయుపుచ్చకముందే, ఇతర చదువుల ధ్యాసలో ఎక్కువ వ్యాపకము కలుగచేసుకొని దానినంతటితోనే ఆపివేసెను. ఇతనికి వ్యవసాయమునందలి అపేక్షకన్న వ్యాపారమునందెక్కువ అపేక్ష కలదు. మెకానిజమునందు ఎక్కువ ఆసక్తి. ఇతనికి ఘంటశాలపాలెం వాస్తవ్యులగు చింతల చలమయ్యగారి కుమార్తె సుభద్రాదేవినిచ్చి ఆన 1944 సంవత్సరమున వివాహము చేసిరి. ఈ దంపతులకు 1. ఝాన్సీలక్ష్మి సీతారామమ్మ, 2. స్వతంత్రభారతి అనే యిద్దరు కొమార్తెలును, వెంకట కోదండరామయ్య, నాగేశ్వర ప్రసాదు అనే కొమార్లు కలిగిరి. వీరిలో ఝాన్సీ ఈ సంవత్సరమే మొదటి తరగతిలో ప్రవేశించి చదువుతున్నది. ఈమె తల్లి సుభద్రాదేవి తెలుగు-హిందీ భాషలు చదువుకొన్నది. సంగీతము తెలుసును.

కోదండరామయ్యగారి భార్యయగు సీతారామమ్మ, ఆమె జీవితకాలంలో ఎన్నడూ ఏ వ్యాధినెరుగక మిగులనారోగ్యవంతురాలుగనుండి తుదకు ఆకస్మాత్తుగా 'సెరిబ్రల్ మలేరియా' అనే వ్యాధి సోకి అయిదు రోజులు ప్రమాదస్థితికి వచ్చి 1945 సంవత్సరం అక్టోబరు నెలలో 16వ తేదీన విజయదశమి పండుగరోజున మరణించినది. ఆమెకు కొమాళ్ళిద్దరు మిగులు భక్తితో శ్రాద్ధాదికములు నెరవేర్చి తమ నివాస గృహమునకు సుమారొక ఫర్లాంగు దూరమున గల చేలో ఇటుకలతో సిమెంటు సున్నముతోనూ ఒక సమాధి చిహ్నమగు తులసికోటను కట్టించిరి. ప్రతి సంవత్సరము ఆరోజున ఆమెను స్మరించి, ఆచార ధర్మములు నెరవేర్చి, బీదలకు అన్నదానము మొదలగునవి

చేయుచుండిరి. కావూరి నాగయ్యగారు తన బావమరిది కొమార్తెయగు సీతారామమ్మను ఆమె బాల్యమునుండి తమ దత్తత కొమారునితోపాటుగా ఎక్కువ ప్రేమాదరములతో చూచెడివారు. ఆమె బాల్యమునందు వారింటికి నిత్యము ప్రాత:కాలమునందు దంతవధానవేళ నాగయ్యగారు వెళ్లి దంతధావనంతరము తన వెంట ఆమెను తమ యింటికి తీసుకువచ్చేవారు. చదువుకొనే రోజులలో ఆమెకు బాలరామాయణము మొదలగునవి తాను స్వయముగా చెప్పి చదివించి అర్థము ఆమెకు తెలిసేలాగున విపులీకరించి చెప్పేవారు. కాబోవు దంపతులమగు మేమిద్దరము ఈ విధముగా మా దత్తత తలిదండ్రుల పోషణలోనే వృద్ధికి వచ్చితిమి. పిమ్మట దంపతులమగుటయును అనుకూలముగనే తటస్థించినది. సీతారామ విసుగుదలనెఱుగని కష్టజీవి. మితత్రయమునే సదా ఆచరించెడిది. మిగుల సుగుణవతియని చెప్పదగినది. వయసులో నాకంటె 10 ఏండ్లు చిన్నది. ఆరోగ్యవతియైయుండి నా కండ్లయెదుటనే చనిపోవుట అనే గొప్ప కష్టమును చూపెట్టినది.

మా తాతగారి వరకు పైవారెవరును విద్యావంతులు కారని చెప్పవచ్చును. మా దత్తత తండ్రిగారునూ జనక తండ్రిగారునూ మా పినతండ్రి వెంకట్రామయ్యగారునూ ముగ్గురు చదువుకొనినవారే. ఆ తరమువారిలో కోటయ్య శ్రీరాములుగార్లు చదువురానివారే. మాతండ్రిగారు రాత్రిళ్లు పురాణమేదైనా చదువుతూ ఒకరు చదివితే మరియొకరు అర్థము వివరించెడివారు. వెంకట్రామయ్యగారికి సంగీత ప్రవేశము కలదు. రాగధోరణి నెఱిగిన పాటకుడు. ఆయన నాటక శైలిలోను భజనలలోను పాడేవారు. మా దత్తత తండ్రి నాగయ్యగారు ఆధ్యాత్మిక విచారణలో పాల్గొని కొంత సాంప్రదాయము తెలిసికొనినవారు. తెల్లవారుఝూమున నిద్రలేచి తంబుర శృతితో రామదాసు కీర్తనలు మొదలగు భక్తి రసముగల కీర్తనలను, సీతారామాంజనేయ సంవాదమునందలివి, భాగవతమునందలివి, కొన్ని భక్తిభావముగల పద్యములను, శ్రావ్యముగ పాడుచుండెడివారు. మేము వినేవాళ్లమూ. నాగయ్యగారికి అప్పటి దేవరకోట ఎస్టేటు జమీందారుగారైన శ్రీమంతు రాజా యార్లగడ్డ మల్లికార్జున ప్రసాదనాయుడు బహద్దుర్‌గారితో బాల్య ప్రభృతి స్నేహము కలదు. రాజాగారి కంతం భూములలో మోపిదేవి గ్రామంలోని కొన్ని లంక భూములను నాగయ్యగారికి కొద్ది రేటుకు కౌలుకు ఇచ్చెడివారు. ఆ భూములను గ్రామములోని బీదలు సమేతు రైతులందరికి తగు రీతిని విభజించి తాను తిరిగి సాగుకు యిచ్చెడివాడు. సదరు భూముల అమరకం శిస్తు రైతుల వద్ద తాను వసూలు చేసి కౌలు పైకమును రాజాగారికి చెల్లించి మిగిలే కొద్ది లాభముతో తాను తృప్తిచెందేవాడు. ఆ విధముగా చేయుటలో రైతులందరు తగినంత భూమి సేద్యం చేసుకొని పంటలు పండించి ఎక్కువగా లాభమును పొందుతూ నాగయ్యగారి యడల మిగుల గౌరవ సద్భావము కలిగి మెలగుచుండెడివారు. మరిన్ని రాజాగారి వద్ద స్వల్ప వడ్డీకి కొంత సొమ్ము తాను అప్పుగా తెచ్చి, కొద్ది లాభము చూచుకొని తిరిగితాను, రైతులకు నీలిమందు వగైరాల ఉత్పత్తి వ్యాపారములకును, వర్తకాలకు అపర ధాన్యములనగా కాయ ధాన్యములు, మిర్చి వగైరాల క్రయ విక్రయ వ్యాపారములకు అనువుగా అప్పులిచ్చేడివారు.

ఈ విధముగా నాగయ్యగారు న్యాయార్జితముగ విత్తమును గడించి న్యాయముగను ధర్మముగను సక్రమ పద్ధతులతో వ్యవహరించుచుండెడివాడు. తనకు తోచిన దానధర్మములు చేయుచూ సత్కాలక్షేపము చేయుచుండెడివాడు. అప్పట్లో రైతులందరు సమృద్ధిగా వ్యవసాయం చేసి పుష్కలముగ పంటలు పండించి, పశు సంపదతోను ధనధాన్యాలతోను మంచి దశకు వచ్చినందున గ్రామము చాలా అభివృద్ధికరముగా బాగుపడినదని చెప్పవచ్చును. సొమ్మును గురించి తనకు రావాలసిన చోటను, తానీయవలసిన చోటను నాగయ్యగారు చాలా ఖచ్చితమైన రీతిగా

వ్యవహరించెడివారు. వ్యవసాయం తన తమ్ములతో కలిసి చేసినపుడు తనకు బదులుగా పనిచేయుటకొక పాలేరును తాను నియమించి ఆ పాలేరు జీతమును తన స్వంత ఆదాయము నుండి ఇచ్చెడివారు. తనకు వ్యవహారముల వత్తిడి లేని తీరిక సమయములలో తాను కూడా వ్యవసాయ పనులలో వెళ్లెడివారు. తన స్వ సంపాదన భూములు ఉమ్మడి వ్యవసాయమున్నంత వరకు లంక భూములు యకరం తొమ్మిదిరూపాయలు, రేవడి భూములు యకరం అయిదురూపాయలు అమరకం నిర్ణయించి ఉమ్మడి వ్యవసాయమునకే తమ్ములపరముగా నుంచెడివారు.

ఈ విధముగా తమ్ములు తాను కలిసియున్నపుడే యిప్పటి భవనములన్ని కట్టుటకు తగిన ప్రోత్సాహమిచ్చి కుటుంబమునకు రుణములు లేకుండా తగిన సౌకర్యములందరికి అమర్చుకొని సుఖజీవనము చేయుచుండిరి. నాగయ్యగారు చనిపోయిన పిమ్మట యిప్పటికి 51 అబ్దికములు ఆయనను స్మరించి చేసినను తృప్తి నెందజాలక, ఆయన పేరు దంపద్యుక్తముగా చిరస్థాయిగ నుంచగోరి ఒక స్మారక భవనమును 'శ్రీనాగరత్న వైజ్ఞానికసేవా సదనము' అనుపేర రావి వారి పాలెమునందు ఆన 1950 సం॥న నిర్మించబడి, దానియందొక ప్రాథమిక పాఠశాలయును గ్రంథాలయమును స్థాపించబడి నిర్వహించబడుతున్నవి. బాల్య ప్రభృతి వారి పోషణలోనేయుండి వృద్ధికి రాబడిన మా దంపతుల కృతజ్ఞతనీవిధముగా సమర్పించుకొంటిమి. నా భార్య 1945 సం॥ములోనే భౌతిక దేహమును విడిచినను నా తో భాగరిగా ఆమె పేరును కూడా యిపుడు దీనిలో చేర్చితిని

### రావివారి పాలెం చరిత్ర - విద్యకు ప్రాధాన్యత

ఇపుడు రావివారిపాలెము గ్రామమనే ప్రదేశము ఆన 1700 సంవత్సరమునకు పూర్వమొక అరణ్యప్రదేశముగ నచ్చటచ్చట కొన్ని చెరువులతోను వృక్షసముదాయముతోను నిండివుండెడిదని చెప్పెడివారు. ఆన 1700 సంవత్సర ప్రాంతమున ముందుగా 'చాకలిదానాయ' అనునొక చాకలియును ఇప్పటి రావి వారి వంశమునకు మూలపురుషుడైన రావి సింగరప్పయను ఒక కమ్మ సంసారియును, రెండిండ్లతో ఈ యూరు నిర్మాణమును ప్రారంభించిరి. కొంచెము వృద్ధికాగానే దీనిని రావివారిపాలెమనే పేరుతో పిలువసాగిరి. ఇది మోపిదేవి గ్రామమునకు శివారుగా చేర్చబడినది. ఇపుడు రావివారిపాలెము నందున్నవారిలో 6 బ్రాహ్మణ, 1 కోమటి, 10 చాకలి, 5 గౌడ కుటుంబములును సుమారు 110 కమ్మవారి కుటుంబములును కలవు.

కమ్మవారందరు దాదాపు సన్నిహితులే. రావివారనే యింటిపేరుగల వారందరు ఈ గ్రామమునకు మొదటగా వచ్చియున్న మూలపురుషుని పుత్రుల సంతతివారును, తక్కిన యింటిపేర్లుగల కమ్మవారిలో పెక్కుమంది ఆ మూలపురుషుని పుత్రికల సంతతివారును. కొలదిమంది మాత్రము పరాయి గ్రామముల నుండి భూవసతి సంపాదన రీత్యా వచ్చిన వారు కలరు. ఆ రీతిగా వచ్చినవారు కూడా దరిమిలా సంబంధ బాంధవ్యములలో ఇచ్చట వారితో కలిసి మొత్తము మీద ఈ గ్రామములో వున్న కమ్మవారందరు దాదాపు ఒకే కుటుంబమునకు చెందినవారని చెప్పదగును. వీరందరు భూములు దున్ని పండించే వ్యవసాయమే ప్రధాన వృత్తిగాను పశుపోషణ మొదలగునవి ఉప వృత్తులుగాను ఏర్పరచుకొని తగిన వసతి సౌకర్యములేర్పరచుకొని జీవించుచున్నారు. అప్పటి కాలపువారి స్వవృత్తులయందుండి శరీర పరిశ్రమల వల్ల కష్టించి పనిచేయుటనిన మిగులప్రీతి.

విద్యార్జన విషయమైన అభిలాష అప్పటివారికి చాలా తక్కువ. చదువుకో తగిన యీడుగల పిల్లలను కూడా పశు వుల కాపరులుగానో వ్యవసాయ పనులలో సహాయముగానో, నియమించెడివారు. మా తండ్రిగారి యుక్తవయసు నాటికి

కొద్దికొద్దిగా విద్యాభిరుచి కలిగినది. అచ్చటచ్చట అరుదుగా బడి చదువులారంభమైనవి. కాని ఏ కొద్దిమందియో చదివేవారు. నేను చదువు చాలించి యింటివద్దనుంటుండగా, పల్లెటూళ్లయందున్న ప్రజా సామాన్యమునకు విజ్ఞానాభివృద్ధి కలుగజేయదగినది విద్యయేనని తలంపుకలిగి, విద్యార్థులకు పని చెరుపు లేకుండునటుల ఒక రాత్రి పాఠశాలను, 1916 సంవత్సరమున మా యింటిముందున్న ఒక భవనమున 60 మంది విద్యార్థులతోను ముగ్గురు ఉపాధ్యాయులతోను ప్రారంభించి కొంతకాలము దానికయ్యే ఖర్చులన్ని భరించి సాగించితిని. పిమ్మట ప్రభుత్వము వారిచ్చిన గ్రాంటు చాలవరకు సహాయమైనది. ఆవిధముగా సుమారు 6 సంవత్సరములు జరిగిన పిమ్మట ఉపాధ్యాయులు కొందరు రాజకీయరంగంనందు ప్రవేశించిరి. విదేశి (బ్రిటిష్) ప్రభుత్వమునుండి నన్ను గ్రాంటు పుచ్చుకోవద్దని టీచర్లు జీతము లేకుండానే పనిచేయుదుమని నాకు వారు సలహాయిచ్చినారు. ఏ విదేశీ ప్రభుత్వమైనా దానిని ప్రభుత్వమని మనమంగీకరిస్తూ పన్నులు చెల్లిస్తూ, పన్నులు వసూలైన సొమ్మునుండి ప్రభుత్వము వల్లమనకు విధిగా రావలసిన సొమ్మును ఏల తిరస్కరించవలెనని, జీతమీయకనే పనిచేయించుటనేది సాగనేరని పనియని ఎన్ని సంగతులు నచ్చచెప్పినను వారు నా మాటలు వినక బడినుండి చాలించుకొనిరి.

ఉపాధ్యాయుల లేని కారణమున రాత్రి పాఠశాల మూసివేయబడినది. దానితో 1916 సం॥ నెలకొల్పిన 'శ్రీరామ ధర్మ గ్రంథాలయము' మాత్రము నిలిచివున్నది. పిమ్మట 1926 సంవత్సరమున తిరిగి ఒక పగటి పాఠశాలను నెలకొల్పి దానితో మళ్లి పని ప్రారంభించితిని. పిల్లల వల్ల వసూలు చేసే జీతములు యేమీలేకుండా కొంత కాలము ఖర్చంతా స్వయముగా భరించినంతలో గవర్నమెంటు గ్రాంటువల్ల కొంత సహాయము దొరికినది. అంతటినుండి నిరంత రాయముగ పాఠశాలను, గ్రంథాలయమును నడుపుతునేయుంటిని. ఇదిగాక ఈ యూరిలోననగా రావివారిపాలెమున బాలికలకొక బోర్డు పాఠశాల కలదు. ఇపుడీయూరిలో 60 బాలురును, 60 మంది బాలికలును చదువుతున్నారు. నిర్భంద విద్యా విధానము వస్తే ఇంకను మరికొందరు చేర్చబడుదురు. ఈ యూరి పాఠశాలలు రెండింటిలోను 5 తరగతులు మాత్రమే కలవు. అటు పైన విద్యకు మోపిదేవిలో గల బోర్డు ఉన్నత పాఠశాలకు వెళ్లుచుందురు. మోపిదేవి చాలా సమీపముననే కలదు.

### బ్రిటిష్ పాలన

నేను చదువుమానే నాటికనగా 1901 సంవత్సరం నాటికి మన ఇండియా దేశము విక్టోరియారాణిగారి పరిపాలనలోనుంటుండెను. రాజ్యాంగరీత్యా ఇంగ్లీషువారు ఇండియాలో జరిగించిన అన్యాయములను శ్రీ రమేశచంద్ర దత్తుగారు. 1. India in Victorian Age, 2. Economical History of British India మొదలగు తమ గ్రంథములలో వివరించియుండిరి. అప్పటికీదేశపు ఆర్థిక పరిస్థితులెంతో అధోగతికి తేబడినవి. అప్పటి బ్రిటిష్ రాజకీయవేత్తల పరిపాలనాపథకములు (Schemes) బహు చిత్రముగనుండెడివి. ఈ దేశపు చేనేత పరిశ్రమలన్నింటిని పూర్తిగ నశింపజేసి యీ దేశమునందుత్పత్తి చేయబడిన ప్రత్తి మొదలగు ముడిపదార్థములును చౌక ధరలకు కొని వారి దేశమునకు తీసుకువెళ్లి బ్రిటిష్ దీవులలోని పరిశ్రమాగారములలో నూలుగానూ, బట్టలుగానూ తయారుచేసి తిరిగి ఆ సరుకును మన ఇండియాకు తెచ్చి హెచ్చు ధరలకు మనకు అమ్మి సాలీనా యీ దేశమునుండి అరవైకోట్ల రూపాయలు నికర లాభమును సంపాదించుకొనుచుండిరి. పంచదార దిగుమతి వలన మనదేశ ద్రవ్యమును మరి ఇరువది కోట్లు సంపాదించికొనుచుండిరి. ఈ దేశపు రాజ్యాంగ వ్యవహారములలో పెద్ద అధికార హోదాలన్నింటికి వారి దేశస్తులనే

రప్పించి నియమించి వారికి విపరీతముగా పెద్ద వేతనము నేర్పరచి, అ వేతనములకు, పెన్షనులకు పారితోషికములకు మరి కొంత పెద్ద మొత్తముగల ద్రవ్యమును స్వీకరించుచుండిరి. ఈ దేశ ద్రవ్యమునేదో ఒక రూపేణా నానా విధములగు మార్గములతో లాగివేసి ఈ దేశ ఆర్థిక స్థితినంతను మిగుల శోషింపచేసి దారిద్ర్యస్థితికి తెచ్చిరి. అప్పటి కాలపు మన పెద్దలు మహాదేవ గోవిందరానడే, దాదాభాయి నౌరోజి, గోపాలకృష్ణ గోఖలే, సురేంద్రనాథ బెనర్జీ మొదలగు మహనీయులెంతో విచారించి దేశ క్షేమాభిలాషతో ఎంతెంతో కృషి చేసినను ఈ దేశపు ధన శోషణను మాత్రము నిలుపజాలరైరి. ఈ దేశమునందలి Paper Currency కి ప్రతిపద్ధాగా నిలవయుంచి గోల్డ్ రిజర్వు ఫండ్‌ను ఎక్కువ భద్రతగా కాపాడుటకనే మిషతో బ్రిటిష్ దీవులకు తరలించుకొని పోయి అచట ఆ సొమ్ము యీ దేశపు రూపాయల నుండి వార్పేరచిన మారకపు రేటు ప్రకారము వారి దేశపు స్టర్లింగులలో లెక్కకట్టి ఆ మొత్తమునకొక రశీదు మాత్రము ఇండియా గవర్నమెంటుకు పంపి దానితో ఆనాటి మన దేశ పెద్దల ఆందోళనను కొంతవరకు ఉపశమింపచేసిరి. ఆ సొమ్ముకు మనకు వడ్డీ ఇవ్వరు. వారు మాత్రము ఇండియా మంత్రి (సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఫర్ ఇండియా) యొక్క ఇష్టముతో వారి స్వదేశమునందలి ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీస్‌లో భాగస్వాములుగా చేరి మన దేశమున రైల్వేలు మొదలగు సంస్థలేర్పరచిన కొందరికి చౌక వడ్డికి అనగా నూటికి సాలుకు 1.5 లేక 2 పై॥ చొప్పున వడ్డీకి అప్పు ఇచ్చి ఆ వడ్డిని బ్రిటిష్ ఖజానాకే చేర్చుచుండిరి.

ఆ విధముగా తెచ్చిన పెట్టుబడి సొమ్ముతో మన ఇండియాలో రైల్వేలు నిర్మాణము చేయుటలో రోడ్లు వగైరాలకు కావలసిన భూమి యీ దేశ ప్రభుత్వమువారు (ఎక్వయిర్) సంపాదించియిచ్చేలాగున్ను, అందుకుగాను కొంత కాల పరిమితికి అనగా నలుబది సంవత్సరముల అనంతరము ఆ రైల్వేలను ప్రభుత్వమునకిచ్చి వేయుటకును, ఈలోగా ప్రతి సంవత్సరము వచ్చే నష్టమునకు రైలు వేయబడే ప్రదేశమునందుగల ప్రభుత్వమువారు పూచీపడుటకును, వచ్చే లాభము మాత్రము రైలు వేసిన కంపెనీవారికే చెందేలాగున్ను షరతులుండేవి. అటువంటి షరతులతో యీ దేశపు రైళ్ల వలన అపరిమిత లాభములను గడించిరి. చిన్న నౌకరీలు, కూలి పనులు మొదలుగునవి మాత్రమే యిచటవారికి దక్కేవి. మొదట జర్మనీ యుద్ధ సమయములో మననెవరిని సొమ్ముకు వత్తిడి చేయవలసిన ప్రసక్తి లేకుండా వారి స్వాధీనమునందున్న మన దేశపు నిలవసొమ్ములో నుండి నూటయాభై కోట్ల రూపాయిలను యుద్ధ విరాళముగా మిగుల ఉదార భావముతో మన దేశమునుండి యివ్వబడినటులవారే ఖర్చు వ్రాసి తీసికొనిరి. అపుడు కూడా స్టర్లింగు మారకపు రేటును వారిచిత్తానుసారమేర్పరచుటతో మరికొంత అదనముగానే చేర్చుకొనిరి.

ఇటువంటి నానావిధ పరిస్థితుల వలన మన దేశము నానాటికి చదగిలి పోయి ఆర్థికదుస్థితి దిగజారినందున ప్రభుత్వ ఋణములు చాలా పెచ్చుపెరిగినవి. ఇట్టి వివరములన్ని ప్రజాసామాన్యము తెలిసికొనగలిగియుండినచో అప్పుడే ఏదో గొప్ప విప్లవ స్థితి సంభవించియుండెడిది. విజ్ఞానవంతులగు దేశ ప్రముఖులకు కొందరికి మాత్రమే తెలియును. ఇట్టి పరిస్థితులలో అప్పటి ప్రభుత్వము నిరంకుశ పరిపాలన బాగా సాగించి దారుణ చర్యలకు పూనుకొనడమూ, ప్రజాభిప్రాయములను నిర్లక్ష్యముగా త్రోసివేయడము పరిపాటిగా జరుగుచుండెను. ప్రజలలో కలిగిన ఆందోళనతోను ప్రజానాయకుల ఉద్బోధనలతోను రాజకీయ వాతావరణమునకు కొత్తమార్పు ప్రారంభమైనది. ఆన 1906 సంవత్సరం (బెంగాల్) బంగాళా రాష్ట్రమును రెండుగా విభజించిన సందర్భములో 'బాబు బిపిన్ చంద్రపాల్' మచిలీపట్నము మొదలగు ప్రదేశములకు వచ్చినపుడిచ్చిన ఉపన్యాసములు యీ ప్రాంతమునందలి రాజకీయ చైతన్యమునకు

పునాదియని చెప్పవచ్చును. దానితో స్వదేశి వస్తుప్రోత్సాహము-విదేశీ వస్తు బహిష్కారము మొదలగునవి ప్రారంభమైనవి. అప్పటినుండి క్రమముగా రాజకీయాభిలాష ప్రజలలో వృద్ధి చెందినది.

1920 సంవత్సరమున పెదకళ్లేపల్లియందు జరిగిన కృష్ణా మండల గ్రంథాలయ సభకు ఆహ్వాన సంఘాధ్యక్షుడుగ ఉపన్యసింపగోరబడితిని. అదే నా మొదటి ఉపన్యాసము-పిమ్మట అనతికాలముననే ఘంటశాల గ్రామమున ఒక గొప్ప రాజకీయ సభనేర్పరచిరి. దానికి అధ్యక్షుడుగా రావలసిన బొబ్బా పద్మనాభయ్యగారెందువల్లనో రాలేదు. తన యుపన్యాసమైనా పంపలేదు. అపుడా సభా నిర్మాతలగు పెద్దలు కానూరి వెంకటాచలమయ్య చెరుకువాడ నరసింహం మొదలగు వారందరు ఆలోచించి, ఆ సభా నిర్వహణకు అధ్యక్షత వహించి యుపన్యసింపవలసిందిగా అప్పటికప్పుడు అవ్యవధిగా నన్ను కోరి సమ్మతింపజేసిరి. ఆనాటి నాయుపన్యాసమును ఖిలాఫత్ సమస్య, పంజాబు దురంతములు, రౌలటు ఆక్టు మొదలగు సంగతులుతో సవిమర్శకముగా నారంభించి, స్వరాజ్యావశ్యకతను గురించి దాదాభాయి నౌరోజి మొదలగు ప్రముఖుల వాక్యములను గుర్తింపజేయుచు, గాంధీ మహాత్మునిచే దక్షిణాఫ్రికాయందవలంభింపబడిన సహాయ నిరాకరణ పద్ధతిని గురించి ప్రసంగించి విపులమగు దీర్ఘ ఉపన్యాసమునిచ్చితిని. ఆ సభకు దాదాపు 3000 జనమునకు పైగా వచ్చియుండిరని జ్ఞాపకము. లోకల్ పోలీసులు, రహస్యశాఖవారు, పత్రికా ప్రతినిధులు నా యుపన్యాసమును వ్రాసికొనుచుండిరి. రాజకీయానుభవములప్పటికి పెద్దగా గడించకపోయినను నాకు తెలిసినంతవరకు ఆ సమయమునకు జ్ఞప్తికి వచ్చిన అగత్య విషయములన్నింటిని గురించి ఎత్తుకొని సభలో నిర్భయముగా చెప్పినందుకు ఆ సభకు వచ్చిన ప్రేక్షకులు చాలామంది తమ సంతుష్టిని వెల్లడించిరి. అప్పటినుండి చాలా సభలకు ఆహుతుడనై వెళ్లుటతో పెక్కుమందికి పరిచయుడనైతిని.

# కృష్ణాజిల్లా బోర్డులో పరిపాలనా అనుభవాలు

1920 సంవత్సరమునందు రాజ్యాంగ సంస్కరణలరీత్యా లోకల్ బోర్డు ఆక్టు మూడువంతుల మంది సభ్యులు ఎన్నుకోబడుటకును నాలుగువంతు సభ్యులు (నామినేషను) నియమింతులగుటకును ఏర్పాటుగా సవరింపబడెను. ఆ ఎన్నికల పద్ధతి మొదటగా అమలులోకి వచ్చిన 1922 సంవత్సరమున బందరు తాలూకా బోర్డునకు చల్లపల్లి సర్కిలులో నిలిచి గెలుపొందితిని. అప్పటి పద్ధతి ప్రకారం తాలూకా బోర్డు సభ్యుల నుండి జిల్లా బోర్డుకు కొంతమందిని ప్రతినిధులుగా నెన్నుకొనుట జరిగెను. దానిలో జిల్లా బోర్డుకు సభ్యుడనుగా ఎన్నుకోబడితిని. పిమ్మట అప్పటికి ఆ బోర్డులో వైసు ప్రెసిడెంటుగనున్న తిక్కాని బాలాజిరావు నాయుడుగారిని కృష్ణా జిల్లా బోర్డు ప్రెసిడెంటుగా ప్రభుత్వం వారు నియమించినందున, ఆ ఖాళీలో వైసుప్రెసిడెంటుగా మరియొకరిని బోర్డు సభ్యుల నుండి ఎన్నుకోవలసివచ్చినది. అప్పటి బోర్డు సభ్యుల సంఖ్య 52. వారి నుండి ముగ్గురు అభ్యర్థులము ఆ పదవికి నిలచితిమి. వారిలో ఒకరు ఇమ్మనేని సీతారామారావు నాయుడుగారు బి.ఎ., రిటైర్డు జె.డి.సి. రెండవ వారు కొల్లిపర వెంకటరమణయ్య నాయుడుగారు, బి.ఎ. బి.ఎల్ వకీలు. మూడవ అభ్యర్థిని నేను. ఈ ముగ్గురికి పోలింగులో మొదటిసారి మొదటివారికి 1 ఓటు, రెండవవారికి 3 ఓట్లు, తక్కిన ఓట్లన్ని మూడవవారికి వచ్చినవి. అపుడు మొదటివారిని తగ్గించి తక్కిన ఇద్దరు అభ్యర్థులకు మళ్లి ఎన్నిక జరిపిరి. ఈ సారి వెంకటరమణయ్య నాయుడుగారికి 4 ఓట్లును తక్కినవి నాకును వేసిరి. ఆ విధముగా ఆ ఎన్నికలో జిల్లా బోర్డు వైసు ప్రెసిడెంటుగా రాగలిగితిని.

అప్పటి కృష్ణాజిల్లా బోర్డు అధికార సరిహద్దులు : తూర్పున గోదావరి నది. పడమర కృష్ణానది. దక్షిణమున బంగాళాఖాతము. ఉత్తరమున నైజాం రాష్ట్రం. ఈ మధ్యనున్న ప్రదేశము (14 రివెన్యూ తాలూకాలు), 8 తాలూకా బోర్డులు 50 యూనియన్ బోర్డులు 32 ట్రావెలర్స్ బంగళాలు కొన్ని హైస్కూళ్లు, మిడిల్ స్కూళ్లు జిల్లామొత్తమున సుమారు 1700 మంది సిబ్బందితో కృష్ణా జిల్లా బోర్డుండెడిది. ఇంజనీరింగు బ్రాంచిలో 25 మంది ఓవరుసియర్లు, 6 గురు అసిస్టెంటు ఇంజనీయర్లు, ఒక డిస్ట్రిక్టు ఇంజనీరుండెడివారు. జిల్లా బోర్డు హుజూరు ఆఫీసులో 35 మంది గుమాస్తాలుండేవారు. బోర్డు సిబ్బంది యొక్క అప్పాయింటుమెంట్లు, ట్రాన్స్‌ఫర్లు - పనిష్‌మెంట్లు-గవర్నమెంటు కరస్పాండెన్సు, మీటింగు సబ్జెక్టులు, రోడ్లు, స్కూళ్లు తనిఖీలు మొదలగు పనులు ప్రెసిడెంటుగారు చూచేవారు. తక్కిన యావత్తు కరస్పాండెన్సు. ఆఫీసు తనిఖీ, స్టోర్సు తనిఖీ, అన్ని ట్రెజరీ పనులు, ప్రావిడెంటు ఫండు వగైరా పనులు వైసు ప్రెసిడెంటు చూచేవారు.

ప్రెసిడెంటు, వైసు ప్రెసిడెంట్లు యిద్దరిలో ఎవరుగాని జిల్లా వెలుపలికి వెళ్లియున్నపుడు ఆఫీసు నందున్న వారొకరే యావత్తు వ్యవహారములు చూడవలసిన చట్ట సమ్మతమైన బాధ్యతయుండేది. అందువలన అప్పట్లో తరచు తటస్థించుచుండిన ప్రెసిడెంటు గారి Absency మూలమున మేముభయులము చూడవలసిన పనులన్నీ నేనొకడనే చూడవలసివచ్చినపుడు చాలా కష్టతరమనిపించెడిది. తిక్కాని బాలాజీరావు నాయుడుగారు ప్రెసిడెంటుగా ఉన్నపుడు ఆయన చట్ట నిర్మాణ సభ్యుడుగానున్నందున తరచు మదరాసు వెళ్లవలసియుండెడిది. మీర్జాపురం రాజాగారు ప్రెసిడెంటుగానున్నపుడు ఆయనకుగల ఎస్టేటు పనులు, స్వకుటుంబ పనులతో తరచు మదరాసు వెళ్లియుండేవారు. అందువల్ల ఆ సమయమంతా నేనే ప్రెసిడెంటు-వైసు ప్రెసిడెంటుగా నెరవేర్చవలసిన యావత్తు పనులను శ్రద్ధతోను, ఓర్మితోను విలాపము రాకుండా జాగ్రత్తగా నెరవేర్చేవాడను.

## ప్రెసిడెంటుతో భిన్నాభిప్రాయాలు

ప్రెసిడెంటు – వైసు ప్రెసిడెంట్లు, రాజకీయంగా భిన్నాభిప్రాయులగుటను వ్యవహారపు నడకలలో కొన్ని విభేదాలు పొడచూపెడివి. నేను ఆఫీసుకు వెళ్లిన కొత్తలో మూడు మాసముల వరకు బంట్రోతులనెవరిని నావద్దనుండనీయలేదు. నేను ప్రెసిడెంటును కోరితేనే యివ్వవలెననే ధీమాతో ఆ విధముగా జరగినది. ఆ సంవత్సరపు డిసెంబరు నెల మూడవ వారములో ఆఫీసునందలి రెండవ గుమాస్తా బెంగుళూరి హరినమశ్శివయ్యను ప్రెసిడెంటు బాలాజీరావు నాయుడుగారు మదరాసు వెళుతూ (టైప్ మిషన్‌తో సహా) తనతో తీసుకువెళ్లి ఆ నెలాఖరు వరకు ఆచటనే వున్నారు.

నెలాఖరున ఆఫీసు గుమాస్తాల జీతాల బిల్లు నాకు యధాప్రకారమే వచ్చినది. ఆ బిల్లు నాయొద్దనే నిలిపియుంచి, ఆఫీసు రెండవ గుమాస్తా డిసెంబరు మూడవ వారమునందెచట పనిచేసినది తెలుపవలసినదిగా ఆఫీసును ప్రశ్నించుతూ, ఒక చీటి వ్రాసి పంపితిని. దానికి ఆఫీసునందెవరును సమాధానమివ్వక మదరాసు నుండి ప్రెసిడెంటుగారు తిరిగి బందరుకు రాగానే వారికి పంపిరి. ఆయన ఆ చీటి మీద బిల్లు ఎచటనున్నదని ప్రశ్నవేసి తిరిగి ఆఫీసుకు పంపిరి. బిల్లు వైసు ప్రెసిడెంటుగారి వద్దనే నిలిపియుంచబడినదని వ్రాసిరి. అందుమీదట నా చీటికి జవాబుగా ప్రెసిడెంటుగారే సదరు రెండవ గుమాస్తాకు డిసెంబరు మూడవ వారములో క్యాజువల్ లీవు మంజూరు చేసితినని క్రిస్టిమస్ రోజులు వాడుకొనుటకు అనుమతినిచ్చితినని జీతము బిల్లు ప్యాసు చేయవచ్చునని వ్రాసిరి. క్యాజువల్ లీవు రిజిస్టరులో ఇది నమోదు చేయబడియుండనందున ఏమి చర్య తీసుకొందురని ప్రశ్నించుతూ చీటి తిరిగి పంపితిని. పని తొందరలో అట్లా జరిగినదని, అది క్షమించ తగినదేకాని శిక్షించతగినది కాదని మళ్లీ జవాబు వచ్చినది. క్యాజువల్ లీవు అనంతరం ఆఫీసులో చేరకుండానే క్రిస్టమస్ రోజులు వాడుకొనుట వలన వరుసగా పదిరోజులు మించినందున అది క్యాజువల్ లీవుగా పరిగణించుటకు రూల్సు ప్రకారం వీలుండదు గనుక ప్రివిలేజీ లీవుకు దరఖాస్తు చేసుకోవలసియుంటుందని తెలుపుతూ మళ్లీ జవాబు వ్రాస్తిని. దానిమీదట ప్రెసిడెంటు గారు ఆఫీసు హెడ్డు గుమాస్తాని పిలిపించుకొని, వైసు ప్రెసిడెంటుగారికేదో కోప కారణముయుండి ఇలా ప్రత్యుత్తరములతో కాలయాపన చేయుచున్నారేమో, మీలో ఎవరినైనా ఆయన వద్దకు చనువుగా వెళ్లగలిగిన గుమాస్తాను పంపి, ఎలాగైనా వారిని సమాధాన పరచి బిల్లు ప్యాసు చేయించుకొనవలసినదిగా సలహానిచ్చిరి.

మా అమ్మగారికి జబ్బు చేసినందున నేనపుడు రావివారిపాలెముననే యుంటిని. అది సంక్రాంతి నెలలో పండుగ రోజులుగనుక ఆఫీసు కందరికి యిబ్బంది చేసినట్లగునని ఎంచి, నా యొద్దకు గుమాస్తా వచ్చి అడుగగానే, సదరు రెండవ గుమాస్తా జీతములో నాగా రోజులకు సరిపోయే మొత్తమును మినహాయింపులోనుంచి బిల్లు ప్యాసు చేసియిచ్చియుంటిని.

పిమ్మట నేను బందరు వెళ్లగానే ప్రెసిడెంటుగారు నన్ను చూచి మాట్లాడుటలో, ఆఫీసు గుమాస్తాలు చాలా దుండగులని, నా వద్ద ఒక జవాను కూడా లేకపోవడమనే సంగతి తనకు అంతవరకు తెలియనేలేదని, రెండవ గుమాస్తాను తనతో మదరాసు తీసుకువెళ్లుటను ఆఫీసుకు పద్ధతి ప్రకారము తెలిపియుండినచో ఇంతటి రాద్ధాంతము జరిగేది కాదని చెప్పి తనంతట తానే రివాజు ప్రకారము నాకు కావలసిన జవానులను పంపెను.

బాలాజీరావు నాయుడు గారు బాగా అధికార ధీమా కలిగియుండే రిటైర్డు డిప్యూటి కలెక్టరు – తాలూకా బోర్డు నందలి నామినేషను మెంబర్లను జిల్లా బోర్డు ప్రెసిడెంటుగారును, యూనియన్ బోర్డు నామినేషన్ మెంబర్లను తాలూకా బోర్డు ప్రెసిడెంటుగారును పేర్కొనవలసియుండెను. అప్పట్లో బందరు తాలూకా బోర్డులో ఒక నామినేషను సీటు ఖాళీ

వచ్చినది. ఆ సమయమున ప్రెసిడెంటుగారు మదరాసునందున్నందున ఆ రికార్డు నావద్దకు వచ్చినది. దానిమీద కొన్ని రోజులు వరకు బాగా యోచించి కంతేటి రామకృష్ణయ్యగారిని పేర్కొంటిని. ఆ విధంగా గెజెటు నోటిఫికేషను జరిగినది.

ప్రెసిడెంటుగారు మదరాసు నుండి ఆఫీసుకు రాగానే గుమాస్తాల వల్ల యీ సంగతి విని, తాను లేనపుడు తాత్కాలికముగానున్న నేను నామినేషను చేయట కూడదని అవి రద్దు చేయుటకు మాత్రమేగాక నాకు యివ్వబడిన పవర్స్ కూడా రద్దు చేయుటకు తనకు అధికారము కలదని, అయినను తాను తొందరపడడం ఆఫీసు మర్యాదకు భంగమని తలచియూరకొంటినని, నేనట్లా స్వతంత్రించినందుకు కారణమును తనకు తెలుపవలసినదని అఫిషియల్ లెటర్ పంపినాడు. ఆ లెటరుకు నేను జవాబు వ్రాయుటలో ప్రెసిడెంటు లేనపుడు ఆయన వచ్చేవరకు నిలవయుంచవలసినదని ప్రత్యేకింపబడిన (Reserved Power) అధికారములేవీ Actలో కనపడలేదని, తాను డెలిగేట్ చేసిన పవర్స్ మాత్రమే రద్దు చేయుటకు ప్రెసిడెంటుకు అధికారముండునేకాని, డిసాల్వింగ్ పవర్స్ ఎన్నడూ రద్దుకానేరవని, ఒకరు అధికారరీత్యా చేసిన పనిని మరియెకరు రద్దు చేయడమనేది సంభవమే అయితే, మరల దానిని రద్దు చేయుటకు అధికారము సంక్రమించినపుడు వీరికి మాత్రము ఎందుకు వీలుండదు? నేను చేసిన అపాయింట్‌మెంట్‌లో ఏదైనా లోపమున్నదని చూపగలిగినచో నేనే సరిచేసుకొందును. చేసినపని సరియైనదైతే మనలో ఎవరు చేసినను ఒకటే. ఇందుకు భిన్నముగా ఏక్ట్‌లో ఏమైనా వుంటే చూపినచో గ్రహింతును. మీరు అఫిషియల్‌గా వ్రాసినందున నేను కూడా అదే మార్గమున జవాబీయవలసివచ్చినది. ఈ విధంగా మనయిద్దరి సంగతులు ఆఫీసుకంతకు తెలియడము యొక్క ఆవశ్యకత రిటైరింగ్ గవర్నమెంటు ఆఫీసరులైన మీకే నా కంటే ఎక్కువ బాగుగ తెలియును. ఈ నా జవాబునంతను చూసుకొని ప్రెసిడెంటుగారు పశ్చాత్తాపముతో మరియొక లెటరు వ్రాసి ముగించెను. దానిలో మన ఆఫీసు గుమాస్తాలు చాలా అసాధ్యులని వారు మిమ్మును సరికొత్తలో ఏ సమయములోనైనా మోసగింతురేమోనని ముందుజాగ్రత్త కొరకు వ్రాసితిననెను.

## గుమాస్తాల మోసాలు

గుమాస్తాలు మోసగింతురనేది సాధారణముగా (క్యాష్) సొమ్ముతో సంబంధించిన చోట్ల జరగవచ్చునని నా మనసులోనొక అనుమానమేర్పడినది. లక్షలమీద బడ్జెటులో వివిధ రకముల బిల్లులకు చెక్కులివ్వాలి. అకౌంటెన్సీ పరీక్షలో బాగా నెగ్గి గడితేరిన గొప్ప విద్యావంతులైన వారకే ఈ పని సక్రమముగా నిర్వహించుట కష్టతరము. పూర్వానుభవమేమీ లేని నావంటి సామాన్య విద్యావంతునకు సమర్ధనీయమగుట చాలా దుస్తరము. ఇట్టి సందర్భమునందొక సంఘటన వివరించెదను. రిజల్యూషన్ కాపీని జతపరచి దాని ప్రకారం తయారు చేసిన బిల్లు పాస్ ఆర్డర్ సంతకానికి నాకు మొదటగా ఒకసారి పంపేవారు. అది పూర్తి అయివెళ్లిన తర్వాత, అట్టి బిల్లులు కొన్నిటిని చేర్చి చెక్కులిస్టు వ్రాసి ఆఫీసులో Scrutiny చేయించి హెడ్డుగుమాస్తా ఇనిషియల్ దాని సంబంధమైన బిల్లులు జతపరచి రెండవసారి నావద్దకు పంపేవారు. ఆ లిస్టు ప్రకారం బిల్లులు సరిచూసి నా వద్దనుండె చెక్కు పుస్తకముల నుండి చెక్కులు వ్రాసి సంతకము చేసి, చెక్కుబుక్కునందు కౌంటర్‌ఫాయిల్‌లో నేను గుర్తు వ్రాసుకొని ఆ చెక్కులను బిల్లులను తిరిగి ఆఫీసుకు పంపేవాణ్ణి. అవి హెడ్డు అకౌంటెంటు వద్దకు వెళ్లేవి. ఆ చెక్కుల దాఖలా పైకమును క్యాష్‌బుక్‌లో ఖర్చు వ్రాసి ఆ పద్దుల వరస నెంబర్లను బిల్లుమీద ఓచరు నెంబర్లుగా నమోదు చేసి ఆ ఓచర్ (బిల్లును) తానుంచుకొని చెక్కును, చెక్కుల నెంబరు, ఓచర్ల నెంబరు గల చెక్కు లిస్టును హెడ్‌గుమాస్తా వద్దకు పంపగా ఆయన సరిచూసి డిస్పాచ్

గుమాస్తాకు పంపేవాడు.

ఈ పద్ధతిగా నిత్యము వచ్చెడి అమిత సంఖ్యగల కాగితములన్నింటిని గుర్తుంచుకొనుటకు చాలా కష్టతరమగుటవల్ల ఏదైన పొరపాటు రావచ్చుననే సందేహంతోచి, నేను చెక్కుయిచ్చేటప్పుడు దానికి సంబంధించిన బిల్లుఫారంమీద నాకు మాత్రమే (గుర్తు) తెలియగల ఒక సాంకేతిక గుర్తు వేసి యిచ్చేవాణ్ణి. ఆ రీత్యా ఒకసారి చెక్కుయిచ్చిన బిల్లును మరియొక్కసారి గుమాస్తాలు మధ్యపెట్టి నావద్దకు చెక్కులిస్టులో చేర్చి పంపినను దానిని కనుగొనుట చాలా సులువుగా నుండును. నేను ప్రవేశించిన మొదట దశలోనే ఒకనాడు రూ॥ 200 అచ్చుపనుల బిల్లొకటి రెండవసారి చెక్కులిస్టులో చేర్చి నావద్దకు చెక్కు కొరకు పంపబడెను. దానిని వెంటనే గుర్తించి దానికి సంబంధించిన గుమాస్తాను, హెడ్డు గుమాస్తాను, హెడ్ అకౌటెంటును రప్పించి గట్టిగానే నిగ్గదీసి అడిగితిని. నా సాంకేతికము సంగతి వారెరుగనందున, ఇన్ని కాగితముల సమూహములో ఈ కాగితమునెట్లా పట్టుకొనగలిగితినో వారికి గ్రహింపు రాలేదు. ఓచరుగా తన కస్టడీలో వుండవలసిన బిల్ యిచటకెలావచ్చినదీ హెడ్ అకౌంటెంట్ జవాబు చెప్పలేకపోయినాడు. ఓచరు నంబర్లు చెక్కు నెంబర్లు వేసిన క్రిందటి చెక్కులిస్టు తన వద్ద ఉండగా రెండవసారి లిస్టులో చేర్చిన దానిని ఎట్లా ఆమోదించి తాను Scrutiny చేసినట్లు తన ఇనిషియల్ పెట్టి పంపినదీ హెడ్డు గుమాస్తా చెప్పలేకపోయాడు. రెండవసారి యీ చెక్కులిస్టులో దీనిని చేర్చుటకు యీ బిల్లు నీకెవరిదగ్గరనుండి వచ్చినదని ప్రశ్నించగా కన్సర్న్ గుమాస్తా (కంభంపాటి ఉదయరత్నం) జవాబు చెప్పలేకపోయెను. ఇందుగురించి మీ అందరి మీద నేరస్థాపననెందుకు చేయకూడదో తగిన సంజాయిషీనిచ్చుకొమ్మంటిని. వారందరూ చాలా గాభరాతో ఆదుర్దాగా వచ్చి మిగుల ప్రాధేయపడి, తమ తప్పిదమునొప్పుకొని, ఇక ముందెన్నడూ వారి జీవితములో ఇటువంటి పనులు చేయకుండునటుల పూచీ పడి క్షమార్పణ వేడుకొనిరి. వారినందరిని బాగా మందలించి, మొదటి తప్పుగా కనికరించి చర్య తీసుకొనుట మానితిని. ఆఫీసు గుమాస్తాలందరికి తెలిసి అంతటినుండి చాలా భయభక్తులతో మిగుల శ్రద్ధగా పనిచేయుచుండిరి. అటువంటి కుట్రలెన్నడూ మళ్లి రాలేదు.

## అధికార్ల నిర్లక్ష్యం

మరియొకపుడు ప్రెసిడెంటు హోదాలోనుండగా నాకొక (ఆకాశరామన్న ద్వారా) వార్త తెలిసి దాని వాస్తవము తెలిసికొనదలచితిని. ఏలూరుకు ముప్పది మైళ్ల దూరమునందున్న చింతలపూడికి రోజునకొకసారి మాత్రమే వెళ్లివచ్చెడి, 32 సీటరు సాలిడ్‌టైర్ బస్ ఒకటి, సర్వీసునందుండెడిది. ఆ యూరికెవరైనా ప్రయాణించవలసివస్తే ఆ ఒక బస్సు మాత్రమే ఆధారము. అందువల్ల అచటనున్న ఆఫీసర్లు నిత్యము ఆ బస్సు వచ్చేవేళకు తమ బంట్రోతును పంపి అధికారరీత్యా ఎవరైనా వస్తే ఆహ్వానించే అలవాటుండేది. ఆ సర్వీసు మోటారు బస్సుమీద అట్టివారు ఎవరూ రానియెడల, ఆనాటికెవరూ రారనే గట్టినమ్మకముతో వారి యిష్టానుసారం ఆఫీసు పనులు చూడకపోవడము కూడా కలదు. చింతలపూడిలో నొక డిస్పెన్సరీ, సత్రము, ట్రావెలర్స్ బంగళాలు జిల్లా బోర్డుకు కలవు. డిస్పెన్సరీ డాక్టరు వద్ద నుండి మంచినీటి బావి కొరకు వచ్చిన దరఖాస్తు కమిటీ బోర్డు ఆఫీసులో పెండింగ్‌లో ఉన్నది. దాని గురించి చింతలపూడి వెళ్లి ఆ ప్రదేశమును చూసిరావలసిన అగత్యమున్నది.

దానిని పురస్కరించుకొని నేనొకనాడు సర్‌ప్రయిజ్ విజిట్‌గా బయలుదేరి ఏలూరు నుండి చిన్న కారులో సర్వీసు బస్సు టైముకు చింతలపూడి వెళ్లి ట్రావెలర్స్ బంగళాలో మకాముచేసి భోజనమునకు లోకల్‌ఫండ్ సత్రమునకు వెళ్లితిని.

అచటనుండే చెవిటి వంట బ్రాహ్మణుని వలన భోజన కాలమున కొంత సమాచారము తెలిసికొంటిని. నేనెవరైనది హోదాను తెలపనందున నేనోబాటసారిననుకొని ఆ బ్రాహ్మణుడు నాతో ధారాళముగా అచట వృత్తాంతమును సవిస్తరముగా చెప్పుటనారంభించెను. ఆ సత్రం బ్రాహ్మణుని కొడుకు అతని మాటలను వినక ఎదిరించి ఆ యూరి యందున్న ఉద్యోగులగు డిప్యూటి తహసిలుదారు, సబ్ రిజిస్ట్రారు, పోస్టుమాస్టరు, లోకల్‌ఫండ్ డాక్టరు మొదలగు వారితో కలిసి చీట్లపేక ఆటకు వెళ్లుతుండాడని, తాను చెప్పిన పని ఏదీ చేయనెల్లడని, అందుమూలంగా తన కొడుకు చెడిపోతున్నాడని సర్వీసు మోటారు బస్సు ఉదయంపూట వచ్చి వెళ్లినప్పటినుండి వారందరు నిత్యము ఇదే గోష్టిలో ఉందురని స్పష్టముగా చెప్పివేసినందునే  నేనిదివరకు విన్న ఆకాశరామన్న వార్త నిజమేనని నా మనసుకు తోచినది.

డిస్పెన్సరీ వద్దకు వెళ్లి చూడగా చుట్టురా పొయిలు పెట్టి బాటసారులు వంట చేసుకున్న గుర్తులున్నవి. డిస్పెన్సరీ తలుపులు మూసియున్నవి. ఎవరూ లేరని తిరిగి రాబోతుండగా ఆ చెవిటి బ్రాహ్మణుడే మరల తటస్థించి, కాంపౌండరు లోపల నిద్రపోతుంటాడని, పిలిస్తే తలుపులు తెరుస్తాడని చెప్పినందున వెళ్లి తలుపులు తెరిపించితిని. అపుడు నన్ను గురించి తెలియజెప్పి డిస్పెన్సరీ రిజిస్టర్లు, రికార్డు వగైరాలు తనిఖీ చేయగోరితిని. అపుడతడు వెంటనే డాక్టరుకు కబురుపంపి రప్పించెను. ఈ సంగతి తెలియగానే తక్కిన ఆఫీసర్లు కూడా లేచివెళ్లి వారి పనులలో నిమగ్నులైరి. డాక్టరు రాగానే ముందుగా నేను వెళ్లిన పని గురించి చెప్పి నూతి ప్రదేశమును చూసి, డిస్పెన్సరీ తనిఖీ చేసి, పిమ్మట నేను వినిన, కనిన సంగతుల గురించి సంజాయిషీ కోరితిని.

అపుడా డాక్టరుతో పాటు ఆ యూరిలోని యితని సమూహముగా వర్తించుచున్న తక్కిన ఆఫీసర్లున్ను, ట్రావెలర్సు బంగళాలోనున్న నా వద్దకు వచ్చి చాలా పశ్చాత్తాపముతో వారి తప్పిదములనొప్పుకొని ఇకముందెన్నడూ ఆఫీసు టైమును వ్యర్ధపుచ్చక సక్రమముగా పనులు చేయుచుందుమని పూచీనిచ్చి క్షమాపణలు కోరుతున్నందున వారిని చాలా మందలించి మొదటితప్పుగా అప్పటికి మాత్రమే మన్నించెదనని చెప్పి వదిలివేసితిని. అప్పటినుండి వారందరూ చాలా జాగరూకతతో తమ విధులు సక్రమముగా నెరవేర్చుచుండిరని పిమ్మట సమాచారమును బట్టి తెలిసికొంటిని. మారుమూల ప్రదేశములకు నియమింపబడేవారిలో  పెక్కుమంది బద్ధకస్తులనే పంపుతుండెదరు. వారందరు చేరి అవకాశము దొరికినపుడిట్లే చేసెదరు. దానిని గుర్తెరిగి పై అధికార్లు తరచుగా అకస్మాత్తుగా వెళ్లి చూస్తుంటే వారికి చాలా భయముంటుంది. వారుకూడా సరియైన దారిలో నడుచుటకలవాటు పడెదరు. ఇది చాలా అగత్యము.

## టోల్‌గేట్ల కథ

అప్పటి జిల్లా బోర్డు ఆదాయములో టోల్‌గేటు సుంకము వేలమువల్ల వచ్చే సొమ్ము కొంత వుండేది. ఆ సొమ్ము సుమారు లక్ష రూపాయలుండేడిది. బాలాజీరావు నాయుడుగారు  ప్రెసిడెంటుగా వచ్చిన తర్వాత పాట దార్లలో పోటీలు పెంచి తన నిపుణత వల్ల ఆ సంవత్సరము లక్షకుపైగా పదునాలుగు వేలు పెంచగలిగెను. తానుగాక మరెవరు పాడించినా చాలా తక్కువకు దిగజారునని ఆయనకు గట్టి నమ్మకముండెను. మరుసటి సంవత్సరము టోలుగేట్ల సుంకముల ఇజారా వైపు ప్రెసిడెంటుగారు వేలము వేయుదురని గెజెట్‌లో ప్రకటించినారు. వేలముల నిమిత్తము వెళ్లినపుడు ఆయా ప్రదేశములందు నాకవసరములగు సహాయములేవీ సమకూర్చబడకపోగా తగిన సిబ్బందినైనా యివ్వక ఒక గుమాస్తాను ఒక జవానును మాత్రమే నాతో పంపినాడు.

ఏలూరు వేలంపాటలకు వెళ్ళవలసిన రోజున ఉదయం బెజవాడలో బడ్జెట్ మీటింగుకు హాజరై మధ్యాహ్నమునకు

ఏలూరు చేరవలసివచ్చినది. గుమాస్తాను, బంట్రోతును ముందుగా ఏలూరు వెళ్లి అచట అసిస్టెంటు యింజనీరుగారి ద్వారా వేలముకు తగిన ఏర్పాట్లన్ని సిద్ధపరచవలసినదిగా చెప్పిపంపితిని. బెజవాడలో మీటింగు పని చూసుకొని ఏలూరు వెళ్లేవరకు ఏమీ ప్రయత్నమే లేదు. నేను పంపిన యిద్దరు మినహా మరెవరూ లేరు. ఆ యిద్దరిని విచారించగా ఏలూరులోని ఇద్దరు ఓవర్సీయర్లు ఎచటికో వెళ్లినారని, అసిస్టెంటు ఇంజనీరుగారు మాత్రం పాటల వేళకు వస్తామన్నారని, బస సౌకర్యములు మొదలగునవేమీ ఏర్పాటు చేయబడలేదని చెప్పిరి. కాలాతిక్రమణ కాకుండా వెంటనే హోటలుకువెళ్లి భోజనాలు చేసి తిరిగి పాటల వేళకు అసిస్టెంటు ఇంజనీరుగారి ఆఫీసు వద్దకు వచ్చితిని. అప్పటికి అ ఇంజనీరుగారు కూడా చేరుకున్నారు. అచట నుండి యిద్దరు ఓవర్సీయర్లను వెంటనే పిలిపించకపోతే తానే (ఎ.ఇ.) నావద్ద యుండి పాట కాలమున ఓవర్సీయర్ల వల్ల నెరవేరవలసిన పనులన్ని అసిస్టెంటు యింజనీయరే స్వయంగా నెరవేర్చవలసి వుంటుందని తెలిపిన మీద కొంత శ్రద్ధ వహించుటకు పూనుకొనెను.

మోపిదేవి బోర్డు స్కూలు బిల్డింగు కట్టించినపుడు ఈ ఎ.ఇ. గారికి నేనొక పల్లెటూరి రైతుగా పరిచయస్తుడనే. అందువల్లనోయేమో ఆయన అంతటి నిర్లక్ష్యముగా మెలగుటకు కారణమైయుండుననుకొంటిని. వేలము పాటలు మాత్రం బాగా జయప్రదంగా జరిగినవి. హెచ్చు పాటలే వచ్చినవి. ధరావతు పైకమును ఏర్పాటు చేయుటకు అపుడే ఎ.ఇ.గారికిచ్చి రశీదు వ్రాయించుకొంటిని. సాయంత్రం ఏలూరులో గుత్తా వెంకయ్యగారు ఆహ్వానించగా ఆ రాత్రి వారియింటివద్ద బసచేసి తెల్లవారు జాము రైలుకు తాడేపల్లిగూడెం మకాముకు వెళ్లితిని. ఆ విధంగా ఆయా మకాములలో శ్రమలకోర్చి శ్రద్ధగా పాటదార్లను రాబట్టి పాడించగా మొత్తం లక్షా యిరువది ఎనిమిది వేల రూపాయలకు పాట పెరిగినది. ప్రెసిడెంటుగారు పాడించిన దానికంటే తరిగిపోతుందనుకొన్నందుకు, పెద్ద మొత్తము పెరుగుటను చూచి బోర్డు మెంబర్లు చాలా శ్లాఘించిరి.

**ఇంజనీరుగారికి జరిగిన శాస్తి**

బాలాజీరావు నాయుడుగారు 1924 సంగులో రిజైన్ చేసినపుడు తిరిగి ఎన్నిక జరుపువరకు నేను ప్రెసిడెంటుగానున్న కాలములో జరిగిన సంఘటనొకటి జ్ఞప్తికివచ్చినది. ఏలూరు నందుండగా కైకలూరు తాలూకా బోర్డు ప్రెసిడెంటు కాజ వెంకటరామయ్యగారు నావద్దకువచ్చి ఏలూరు నుండి శ్రీపర్రు మార్గముగా కొల్లేటి సరస్సునందున్న పెదయడ్లగాడి వరకు రోడ్డు వేయుట అగత్యమనిన్ని దానికి సంబంధించిన మార్గ ప్రదేశములను స్వయముగా చూడవలెనని కోరినందున, అందుకొరకు నిర్ణయించుకొన్న తేదీని సాయంత్రం 2 గంగలు పిమ్మట ప్రెసిడెంటుగారి రాకకై శ్రీపర్రు వద్ద వేచియుండవలసినదిగా ఏలూరు అసిస్టెంటు ఇంజనీరుగారి కొక తాఖీదు పంపబడెను. నేను 3 గంగలకు కారు మీద శ్రీపర్రు వెళ్లగా అచటకు అసిస్టెంటు యింజనీరు రానేలేదు. అపుడు నేను, కైకలూరు తాలూకా బోర్డు ప్రెసిడెంటుగారితో, అచట నుండి కాలినడకన ఆ లైను చూస్తూ పెదయడ్లగాడి వరకు వెళ్ళి తిరిగి మా కారువద్దకు శ్రీపర్రు సాయంత్రం 5 గంగలకు వచ్చితిమి.

అసిస్టెంటు యింజనీరు అపుడు తన కారులో అచటికి వచ్చి కనిపించెను. సమయములో రాని కారణమును గురించి ప్రశ్నించితిని. ఎండ తీవ్రతచే నాలస్యముగ బైలుదేరితిననెను. ఇంజనీరింగు కాలేజిలో మీకు ఎండలోనే పని నేర్పెదరుగదా! వ్యవసాయ తరుణములో నేను ఎండను లక్ష్యపెట్టక పొలమునెళ్లువాడనే గదా! మనకిద్దరకూ గాక మరెవరికీ ఎండ తీవ్రత? అని అడిగితిని. దానికి సమాధానమిచ్చుటలో "అంటే మీకు కోపమేమో? గాని మీ ఆర్డరులో

2 గంటల పిమ్మట"ననియున్నందున నేను యిపుడు 2 గంటల పిమ్మటనే వచ్చితిననెను. ఆ సమాధానము నాకెంతో చిత్రముగతోచి, 2 గంటల పిమ్మటనగా 3 గంటల పిమ్మటనికాదు. ఆర్డరుకు విపరీతార్థములు తీసి సమర్థింపబూనుట చాలా సాహసమని, అట్లా చెప్పడము తనకు క్షేమకరము కానేరదని, మందలింపుగా చెప్పితిని. మీకంత కష్టముగనుంటే శలవు పెట్టెదనని చెపుతూ, తన కారు వద్దకు త్వరితముగా వెళ్లినాడు. అంతట మా కారులో మేమును బయలుదేరి ఏలూరు చేరితిమి.

ఏలూరు నందలి నా బసలో నన్ను తిరిగి కలుసుకొనుటకు ఆయనకవకాశమాపూటకు దొరకనందున మరుసటి ఉదయమున రైలులో నేను బందరు వచ్చేటప్పుడు నాతో నూజివీడు వరకు ప్రయాణించెను. అపుడు కూడా పశ్చాత్తాపమేమీ కనపరచలేదు. చాలా ధీమాగానే వున్నాడు. ఇటువంటి పెంకెతనముగల నిర్లక్ష్యపరులతో పనులు సక్రమముగ నిర్వర్తించుటకెంత కష్టమో బాగా మనసుకు నాటినది. నెలకు రూ॥ 400ల వరకు జీతము గలిగి, 13 సంవత్సరముల సర్వీసుగల ఒక సీనియరు అసిస్టెంటు యింజనీరు యీ విధముగా అవిధేయత, నిర్లక్ష్యములతో (డ్యూటీ) విధిని సరిగా నెరవేర్చనందుకు తగిన గుణపాఠము నేర్పవలసిన అగత్యము బాగా మనసుకు తట్టినది. పిమ్మట బందరు వచ్చితిమి. నేను ఆఫీసుకు చేరుటతోనే, "ఏలూరు అసిస్టెంటు యింజనీరు జనస్వామిరంగావధాన్లు గారిని మరల ఉత్తరువు చేయువరకు సస్పెన్షనులోనుంచుటకును, ఆయన చార్జి అచటనున్న ఓవరుసీయరు వల్లభజోశ్యుల హనుమంతరావుగారి కప్పగించుటకును నా వుత్తరువు ప్రకారము శ్రీపర్రు వద్ద సకాలమునకు హాజరుకానందుకు, తానిచ్చిన వెటకారపు జవాబులకు, తగిన సంజాయిషీని, డిస్ట్రిక్టు యింజినీరుగారి ద్వారా మా ఆఫీసుకు పంపవలసినదిగా ఒక వుత్తరువును జారీ చేసితిని.

అది చూచి, అదివరకెంతో ధీమాగా నున్న ఆ పెద్దమనిషి చాలా నిర్ఘాంతపోయి, వెంటనే ఆర్డరు ప్రకారం తన చార్జిని వప్పగింతజేసి, తాను డిస్ట్రిక్టు ఇంజనీరుగారైన జె.కె.జె. వీరరాఘవాచారి గారి వద్దకు వెళ్లి ఆయనతో చెప్పుకొనగా, భయపడనక్కరలేదని ధైర్యం చెప్పి, ప్రెసిడెంటు చేసే పనిష్మెంటుకు పైన గవర్నమెంటుకు అప్పీలు చేయవచ్చునని, తానతని పక్షమున చేయదగిన సహాయమంతా చేసి తప్పించెదనని అభయహస్తమిచ్చినాడట. అందుమీదట ఏమీ తోచక పర్సనల్ అసిస్టెంటుగనున్న తంగిరాల సూర్యనారాయణగారిని సలహా కోరెను. "సస్పెన్షనుకు కాలపరిమితి కనిపించుట లేదు. ప్రెసిడెంటుగారు పనిష్మెంటు వుత్తరువునిచ్చిన తర్వాత గదా నీ అప్పీలుకు అవకాశము కలిగేది. అదెప్పుడు జరుగునది, ఎంతకాలములో జరుగునది, మనము నిర్ధారించుటెట్లా? గనుక నీకదేమీ ప్రయోజనకారికానేరదని" స్పష్టీకరించెను. పిమ్మట ఆయన నేరుగా నావద్దకు వచ్చెను. తన విచారము వెలిబుచ్చి, పశ్చాత్తాపముతో రక్షణ కోరెను. నీవిచ్చే సంజాయిషిని పరిశీలించనిది నీ రక్షణను గురించి నేనేమీ చెప్పజాలనంటిని. అందుమీదట తిరిగి వెళ్లి డిస్ట్రిక్టు ఇంజనీరుగారితో తాను బాగా ఆలోచించి, వ్యంగ్యమగు పదములుగల చక్కని యింగ్లీషులో నొక సంజాయిషిని వ్రాసి విధాయక ప్రకారముగా పంపెను.

నా జవాబు కొరకు కొన్నాళ్లు చూచి, నావద్దకు తాను మళ్లీ వచ్చి తనకేమీ ఆర్డరు రాలేదని చెప్పుకొనెను. మీరు పంపిన సంజాయిషీ చాలా వ్యంగ్యమగు, గూఢ పదములతోనున్నందున నేనేమీ చెప్పనైతిని. ఇపుడిచట ప్రశ్నోత్తర రూపములో వ్రాత మూలమున, స్పష్టమైన సంజాయిషీ నిచ్చి రక్షణ కోరవచ్చునని ఒక ప్రశ్న పత్రమును టైపు చేయించి యిచ్చితిని. ప్రతి ప్రశ్నకు ఎదురుగా జవాబు రాసి సంతకము చేసి తిరిగి నావద్ద దాఖలు చేసినాడు. అందలి వివరములు

1. ఫలాన తేదీన సాయంత్రం 2 గంటల పిమ్మట శ్రీపర్రు వద్ద ప్రెసిడెంటుగారి రాకకు వేచియుండవలసినదిగా నీకు ఆర్డరు వచ్చినదా? వచ్చినది. 2. నియమించిన టైముకు గాని నేను వచ్చిన టైముకుగాని నీవు అచటకి వచ్చినావా? రాలేదు. 3. ఎప్పుడు వచ్చినావు? సాయంత్రం 5 గంటలకు వచ్చినాను. 4. సాయంత్రం 5 గంటలు కూడా 2 గం॥టలకు పిమ్మటేనని నాకు అర్థం చెప్పినావా? లేదా? చెప్పినాను. 5. అట్లా చెప్పదగునా? కూడదు. 6. నీవు చేసినది, చెప్పినది తప్పేనందువా? తప్పే. 7. ఇపుడేమి కోరెదవు? క్షమింపగోరెదను.

ఈ విధముగా స్పష్టమైన సూటి జవాబులు వచ్చిన పిమ్మట నాలోచించి, ఓర్మితో కనికరించి ఆదఫాకు క్షమించి, సస్పెన్షను కాలము జీతముగల సెలవుగా పరిగణించుటకును, తిరిగి తన పనిలో తాను చేరుటకును, అర్ధ సంవత్సరము వరకు ఆయన చర్యలు పరిశీలనకు లోబడియుండవలెనని వుత్తరవులు చేసియుంటిని. అంతటితో తన ప్రవర్తన సరిదిద్దుకున్నందున పిమ్మట నేనొక సందర్భములో కొంతకాలము ఆక్టింగు డిస్ట్రిక్టు యింజనీరుగా ప్రమోషను చేయుటతో పూర్వనేరములు తొలిగింపు కాబడినవి. దీనితో ఆయన ప్రవర్తనెంతో కుదురుబాటుకు వచ్చినది. ఐ.సి.ఎస్. ఆఫీసర్లు యూరపియన్ ప్రెసిడెంట్లు సైతము ఇట్టి నిక్కచ్చి వుత్తరువు ఇదివరకెన్నడూ చేసియుండలేదని, పనిష్మెంటు నిజమైతే చాలా 'ప్రివిలేజెస్, నష్టంకాగలవని తలతిక్కకు తగినశాస్తి జరిగినదని, వ్యవహారముమ్మరంలో పరిపరి విధములుగా చెప్పుకున్నారు ప్రజలు.

### ఇంజనీర్ల పన్నాగానికి చుక్కెదురు

తణుకు అసిస్టెంటు యింజనీరు నరసింహ అయ్యంగారున్ను, డిస్ట్రిక్టు యింజినీయరు వీరరాఘవాచారిగారున్ను ఏకీభవించి, పెంటపాడు ఓవరుసీయరు సత్యనారాయణ రాజుమీద 23 నేరములు చార్జిచేసి అతనిని వెంటనే పని నుండి డిస్మిస్ చేయుటకు సిఫారసు చేస్తూ ఫైనల్ ఆర్డరు కొరకు నావద్దకు కాగితములు పంపినారు. ఆ నేరములన్ని అప్పుడప్పుడు వరుసగా చేయబడినవిగాని ఒకేసారి చేసినవికావు గనుక ఆ నేరము చేసిన కాలములో ఎన్నిసార్లు ఎ.ఇ. తనిఖీ చేసినదిన్ని, ఎన్నిసార్లు డి.ఇ. తనిఖీ చేసినదిన్ని, ఆ తనిఖీలలో ఆ తప్పులను గురించి ఎప్పటికప్పుడు చర్య తీసుకొనక 23 తప్పులు అతను వరుసగా చేయుటకు తగిన అవకాశమిచ్చి, అన్ని తప్పులు చేర్చి ఒకేసారి చార్జిషీటు పంపుటకు గల కారణములను తెలుపవలసిందిగా ఎ.ఇ., డి.ఇ.లను సంజాయిషీ కోరితిని.

ఓవరుసీయరు యొక్క నేరములను గురించి స్వంత విచారణలోకి తీసుకొని పాలకొల్లులో విచారించితిని. నేరములో కొన్ని యదార్థమున్ను మరికొన్ని అదనముగా చేర్చబడినవిన్ని కలవు. ఆఫీసు గుమాస్తా వల్ల జరిగిన సబ్‌మిషన్ డిలే అనే తప్పునతనికే అంటగట్టిరి. సాలాఖరు లెక్కల ఒత్తిడి సమయంలో రికార్డు చూచి సరిగా చెప్పవలసిన సంజాయిషీకి తగిన వ్యవధి దొరకక అడగగానే సంజాయిషీ యివ్వనందున అదొక నేరముగా స్థాపించిరి. ఇటులనే వారి చిత్తానుసారము వ్రాసి పంపిరి. ఇవన్ని సాకల్యముగా విచారించిన మీదట తీర్పునిచ్చితిని. ఇతను తప్పులు చేయలేదని చెప్పను. చేసిన మాట వాస్తవమే. కాని ఇవన్నీ ఒకే అసిస్టెంటు యింజనీరు చేతిక్రింద వరుసగా అప్పుడప్పుడు చేయబడియుండుటను, వాటిని గురించి ఎప్పటికప్పుడు కనిపెట్టి తగు చర్యలు పై అధికార్లు తీసుకొని యుండకపోవుటవల్లను ఇతనికిపుడీ సందర్భములో కఠినమగు శిక్ష వేయదలచలేదు. ఇతనినిచట నుండి నరసాపురం అసిస్టెంటు యింజనీరుగారి చేతిక్రిందకు ట్రాన్సుఫరు చేసి, అచట అతని చర్యను పరిశీలించి మాస వారీ రిపోర్టును ఆరుమాసములకు ఎ.ఇ.గారు పంపుచుండుటకును, ఇట్టి నేరములేవైనా అతనివల్ల మళ్లీ జరిగినటుల తెలియగానే తగిన

శిక్షను విధింతునని నిష్కర్షగా ఉత్తరువు చేసితిని. ఎ.ఇ., డి.ఎ.లు ఇద్దరూ సరియైన సంజాయిషీ ఇవ్వజాలలైరి. వారిని గట్టి మందలింపుతో వదిలితిని. (డి.ఇ.గారికి ముఖ్యుడొకని కొరకు కావలసివచ్చిన ఖాళీని ఏర్పరచుటకీ పన్నాగమంతా పన్నినారని ఆఫీసులో వదంతి మాత్రం దాగినది కాదు)

ఒకప్పుడు బాలాజీరావు నాయుడుగారి హయాంలో ఏలూరులో డిస్ట్రిక్టు బోర్డు మీటింగుకు డిస్ట్రిక్టు ఇంజనీయరు హాజరైనాడు. మీటింగు జరుగుతున్నపుడు ఒక సందర్భములో డి.ఇ. మాట్లాడుతూ, తాలూకా బోర్డు ప్రెసిడెంట్లు పరిపాలన గురించి చెప్పుటలో కొన్ని చోట్ల ఎస్టిమేషనులు శాంక్షను చేయకముందే కాంట్రాక్టర్లకు సొమ్ము యిప్పించి వేస్తున్నారని చెపుతూ, ఆ పరిపాలన మొగలాయి దర్బారు, నైజాం దర్బారులనే పోలికలతో ప్రసంగించెను. అప్పటికి ఎక్స్ అఫిషియో మెంబర్‌గా నున్న తాలూకా బోర్డు ప్రెసిడెంట్లు కల్పించుకొని, పబ్లికు సభలో అడ్మినిస్ట్రేషను ఆఫీసర్‌ను గురించి ఒక ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కొన్ని పోలికలతో హేళనగా మాట్లాడుట తమకు అవమానకరమని అట్లా మాట్లాడినందుకు క్షమాపణ చెప్పవలసినదని ఒత్తిడి చేసిరి. దానికి డి.ఇ. పశ్చాత్తాపుడై మాటల ధోరణిలో తొందరపాటున మాట్లాడితినని తన విచారమును తెలుపుతూ క్షమార్పణ చెప్పెను. అంతట సభలో నొకరిద్దరు మహమ్మదీయ సభ్యులు కల్పించుకొని మొగలాయి దర్బారు, నైజాము దర్బారు అనే పదములకు నీచార్థములనాపాదించి, ఆ మాటలనినందుకు సభలో క్షమాపణ చెప్పనందుకు డి.ఇ. గారు తిరిగి సభలో క్షమార్పణ చెప్పవలసివచ్చినది. తీవ్రమైన పట్టుదలతో మాట్లాడిరి. అపుడు తప్పనిసరిగా డి.ఇగారు సభ ఎదుట నిలిచి ఆ మాటలయందేమీ నీచార్థము తన భావమునందు లేదనీ, అట్టి వారి సంశయనివారణ కొరకు మాత్రమే తానాక్షమార్పణ చెప్పియుంటానని, దానికిపుడు ఇస్లాం సభ్యుల కోరిక ప్రకారము సభ యొదుట తాను తిరిగి క్షమార్పణ కోరుతున్నానని చెప్పి వెంటనే అచట నుండి వెడలిపోయెను.

నేను ప్రెసిడెంటుగానున్న కాలములోనే శివ లింగయ్య చౌదరి అనే యువకుడు ఇంజనీరింగు కోర్సులో ఫారెన్ డిగ్రి పొంది ఉద్యోగము కొరకు ప్రయత్నిస్తూ, ఒకనాడు జిల్లా బోర్డు ఆఫీసులో నావద్ద డిస్ట్రిక్టు బోర్డు యింజనీరుగారున్న సమయంలో డిస్ట్రిక్టు బోర్డు మెంబరైన అడుసుమల్లి గోపాలకృష్ణయ్యగారి ద్వారా మాకు పరిచయం చేయబడి ఉద్యోగపు దరఖాస్తు దాఖలు చేసెను. అపుడచటనున్న బోర్డు యింజనీరుగారు తన అభిప్రాయమును మా అందరి సమక్షమున వెల్లడించుటలో దరఖాస్తుదారుని అర్హతలను గురించి తాను బాగా పరిశీలించితినని, ఇండియన్ డిగ్రీ కంటే హెచ్చు డిగ్రీలు కలిగియున్నందున ఎ.ఇ. ఉద్యోగమునిచ్చుటకు సందేహించనక్కరలేదని స్పష్టీకరించి చెప్పివేచెను. పిమ్మట తన ఆఫీసుకు వెళ్లి ఫారెన్ డిగ్రి గలవారు ఫారెన్ సర్వీసుకే అర్హులని ఇండియన్ సర్వీసుకు పనికిరారని అతనికి ఉద్యోగమిచ్చుటకు తన అభిప్రాయము కాదని వ్యతిరేక సూచననలతో వ్రాసిపంపెను. బోర్డు సభ్యుడగు నొక పెద్దమనిషి ఎదుట తాను నాతో చెప్పిన దానిని బట్టి నేనా అభ్యర్థికి మాట యిచ్చిన సంగతి తనకు తెలిసిన్ని యీ విధముగా వ్రాయుటను చూచి చాలా ఆశ్చర్యచకితుడనైతిని. ఆయన స్వభావమును గురించి నాకు బాగా మనస్సందేహమేర్పడినది. అందుమీదట సాహసించి ఉద్యోగమీయనుద్యుక్తుడనైతిని.

అపుడు బెజవాడ అసిస్టెంటు యింజనీరు దున్నా వీరాస్వామినాయుడుగారు కొమారుని వివాహము నిమిత్తము మూడు మాసములు సెలవు కోరియుండెను. ఆ సెలవు మంజూరు చేసి, ఆ చోటుకు తణుకు ఎ.ఇ. నరసింహయ్యగారిని వేసి, తణుకులో ఎ.ఇ.గా శివలింగయ్య చౌదరిని గవర్నమెంటు అంగీకారముకు లోబడి నియమించితిని. ఈ సంగతి

డి.ఇ. తెలుసుకొని ప్రెసిడెంటు స్వకులాభిమానముతో తన మాటను లక్ష్యము చేయక పి. శివలింగయ్య చౌదరికి అప్పాయింటుమెంటు యిచ్చెనని, అది అంగీకారయోగ్యము కాదని, ప్రభుత్వమునకు తామొక రిపోర్టు పంపెను. దానిని రిమార్కు కొరకు నాకు పంపిరి. అపుడు నేను అభ్యర్థికిగల యోగ్యత, అర్హతలను ఆలోచించియుంటినని కులమును గురించి ఆలోచించలేదని అది అభ్యంతరకరముకానేరదని, మీ స్వజాతీయులెవరైనా అర్హత యోగ్యము గలవారు తటస్థించినను మీరధికారము నందున్నంతరకు వారికెవరికీ ప్రవేశమివ్వకూడదనేనా? అతని వాదము? ఇది పరిగణింపతగినది కాదని ఖచ్చితముగ రిమార్కు వ్రాసి పంపితిని. అపుడు నేను యిచ్చిన అప్పాయింటుమెంటు ఆర్డరును గవర్నమెంటు అమోదించినారు. డి.ఇ. గారంతటితో నూరుకొనక వీరాస్వామినాయుడుగారితో మాట్లాడి శెలవును వదులుకొని పనిలో చేరవలసినదని గట్టిగా ఒప్పించెను. అప్పటికిక కొద్దికాలము మాత్రమే సెలవు కలదు. అయినను శివలింగయ్య చౌదరిని Oust చేయించడం ముఖ్య ఉద్దేశ్యముగా డి.ఇ. పాటుపడసాగెను.

అప్పటికి ప్రెసిడెంటు ఎన్నిక జరిగి మీర్జాపురం రాజాగారొచ్చిరి. ఆ సందిగ్ధసమయములో ప్రెసిడెంటుగారి చేత వీరాస్వామి నాయుడుగారి శలవు రద్దు చేయించి పనిలోకి పంపిరి. అపుడు నరసింహయ్యగారు బెజవాడ నుండి రిలీవ్ అయి జాయినింగు టైమ్‌కు తణుకు వెళ్లెను. శివలింగయ్య చౌదరి తనకు ఆర్డరు రాలేదని చెప్పి చార్జి వప్పగించడాయెను. ఆ సంగతి ఏలూరు నందున్న ప్రెసిడెంటుగారితో అయ్యంగారు చెప్పుకొనగా వారు నన్ను రమ్మని వ్రాసిరి. నేను ఏలూరు వెళ్లి సంగతులన్ని తెలుసుకొని చార్జి వప్పగించవలసినదిగా శివలింగయ్య చౌదరిగారికి తెలియజేసితిని. నరసింహయ్యగారు బెజవాడ నుండి రిలీవు అయిన తర్వాత తణుకులో జాయిన్ అయ్యేవరకు డ్యూటిలో లేనందున ఆరోజుకు ఆయన జీతము నెచట బిల్లు చేసి పుచ్చుకొనుటకు వీలుకానందున జీత నష్టము కూడా సంభవించినది. దానిని గురించి స్వకులస్థుడైన డి.ఇ. గారితో సంప్రదించగా ఆయనొక ఏర్పాటు చేసినాడు. అయ్యంగారి కొరకు తాను వారం రోజులు శలవు పెట్టి, ఆ కాలములో ఆక్టింగుగా అయ్యంగారినేర్పరచి, ప్రెసిడెంటుగారి అంగీకారముకు లోబడి ఆర్డరుతో జారీ చేసెను.

శలవులో వచ్చే హెచ్చు జీతముతో పూర్వపు నష్ట జీతమును రాబట్టుకోవచ్చునని అయ్యంగారికి సలహానిచ్చి వీరరాఘవాచారి గారు తిరుపతి వెళ్లినారు. యీ కాగితము ఇంజనీరింగు ఆఫీసునుండి బోర్డు ఆఫీసుకు వచ్చేటప్పటికి ప్రెసిడెంటుగారైన మీర్జాపురం రాజా గారు స్వంత పనులమీద మదరాసు వెళ్లినందున ఇన్‌చార్జీ ప్రెసిడెంటునగు నా వద్దకా కాగితములు చేరినవి. అందును గురించిన నోటిఫికేషను ఆపించి, డిస్ట్రిక్టు యింజనీరు తన శలవును ప్రెసిడెంటు ద్వారా మంజూరు చేయించుకొవడమున్ను, ఆ స్తానే తగిన వారి నెవరినైనా ప్రెసిడెంటుగారే నియమించడమున్ను జరుగవలసిన విధాయకమైయుండగా ప్రెసిడెంటుకు గల అడ్మినిస్ట్రేటివ్ అధికారములును ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గనున్న తానెలా చెలాయించేనో డి.ఇ. నుండి తెలుసుకోవలసినదని గవర్నమెంటుకు వ్రాసితిని. మరిన్నియీ శలవు సందర్భములో అతను చేసిన ఏర్పాటును రద్దుచేసి, సీనియారిటీ ప్రకారం జనస్వామి రంగావధాన్లుగారిని ఎక్టింగ్ డిస్ట్రిక్టు ఇంజనీరుగా నియమించి వుత్తరువులను జారీ చేసితిని. దీనితో నరసింహయ్యగారికి ఆక్టింగు రద్దయినందున తణుకు నుండి బందరు వచ్చినది మొదలు తిరిగి తణుకు వెళ్లి తన పనిలో జాయిన్ అయ్యేవరకు యీ మధ్య రోజుకు జీత నష్టం మళ్లీ సంభవించింది. అపు డయ్యంగారు నా వద్దకు వచ్చి యీ సంగతులన్నీ విపులంగా మొరబెట్టుకొని డి.ఇ. గారి మూలమున తనకీనష్టము సంభవించినదని చాలా విచారమునొందెను. పి. శివలింగయ్య చౌదరి గారిపుడు విజయవాడ

నుండి మదరాసు వరకు రైల్వే ఇంజనీయరుగా ఉన్నారు.

## చిన్న ఉద్యోగుల కష్టాలు

1924 సం॥ ప్రెసిడెంటు హోదాలోనున్నపుడు జగ్గయ్యపేట మకామునందుండి ముక్త్యాల వైపు రోడ్డు తనిఖీకి వెళ్లితిని. దానిలో నున్న పాలేరునదిలో నా కారు నడుపునపుడు వెనుకనుండి ముందుకునెట్టుటకు లోకల్ ఫండ్ జవాన్లనుంచిరి. ఆ సమయమున కారులోనున్నది నేనొకడను మాత్రమే. కారు డ్రైవరు చాలా గుట్టు గలవాడగుటను, తక్కిన వారు ముందేవెళ్లి నదికి అవతలి యొడ్డున నుండుటను మధ్యలో నెట్టుటకు వచ్చిన మైలువాళ్లు అలసట తీర్చుకొనుటకు ఆగినపుడు వాళ్ల యోగక్షేమములు తెలిసికొనగోరి ప్రశ్నించితిని. వాళ్లపై అధికార్లకిది తెలిస్తే వాళ్ల కేదో కీడుమూడగలదనే భయముతో వాళ్లు నాయెదుటకు ధారాళముగ మాట్లాడుటకే భయపడిరి. అపుడు నేను వాళ్లకెంతో నమ్మకము చెప్పి, బుజ్జగింపుగా అడిగితిని. అపుడు వాళ్ల వల్ల తెలిసిన వాటిలో ముఖ్యమైన విషయమేమనగా : వాళ్ల జీతములు అప్పటికి ఆరుమాసముల క్రిందటి నుండి యివ్వడము లేదని, ఎక్కువగా అడిగితే వాళ్లను తగ్గించి వాళ్ల స్థానే కొత్తవాళ్లను వేసుకుంటామని బెదిరిస్తూ కాలము జరుపుతున్నారని యీ సంగతులు నాతో చెప్పినటుల తెలిస్తే పైవారివల్ల వారికి చాలా ఇబ్బందులు కలుగగలవని మిక్కిలి విచారముతో ప్రాధేయపడి చెప్పుకొనిరి. నా మనసుకెంత కష్టముగా తోచినను వెల్లడించక గుంభనగానే యుంచితిని.

పిమ్మట నందిగామ నుండి బెజవాడకు వెళ్లిన తర్వాత ఆఫీసు ఆర్డర్సు పుస్తకములో నేనొక వుత్తరువును వ్రాసి పంపితిని. చిన్న ఉద్యోగుల జీతముల అక్విటెన్సు మా ఆఫీసుకు చేరేవరకు, పెద్ద ఉద్యోగుల జీతములు పంపవద్దని, ఇంతకు లోగడ నిలవజీతము బాపతు యీ నెలలో ఎవరి కెంత బట్వాడా చేసినది వివరములు తెలుపగల స్టేటుమెంటు దర్యాప్తు కొరకు నాకు పంపవలసినదని, "జిల్లా కంతకు వర్తించునటుల జనరల్ ఆర్డరు జారీ చేసి, పెద్ద ఉద్యోగులందరికి సర్క్యులేటు చేయించితిని. అంతటితో జిల్లాలోని అన్ని మూలలనున్న చిన్న నౌకర్ల బాధలు తీరిపోయినవి. ఈ వుత్తరువు పుట్టుటకు గల కారణములు మాత్రము గోచరించదాయెను. ఉన్నత స్థానము నధిష్టించిన పెద్ద యుద్యోగులిట్టి విషయమును శ్రద్ధాసక్తులతో గమనించి తగురీతి నివారణ చేయనియెడల కొద్ది జీతములుగల చిన్న నౌకర్లగతి పలు కష్టముల పాలుగాక తప్పదు.

## అవనిగడ్డలో స్కూలు ఏర్పాటు

మీర్జాపురం రాజాగారు ప్రెసిడెంటుగానున్నపుడు అవనిగడ్డకు హైస్కూలు కావలెననీ ప్రజలు కోరిరి. అందుకు అప్పటి ఇ.ఓ గారైన ఎ. రామారావు ఇ.ఎస్.గారు అంగీకరించనందున ప్రెసిడెంటుగారిచ్చుటకు సమ్మతింపరైరి. ప్రజలు పెక్కుసార్లు ప్రాధేయపడగా వారిని తప్పించుకొనుటకు తాను లేనపుడు వైసు ప్రెసిడెంటుగారీయ వచ్చునని దానిని తాను మార్చనని సలహానిచ్చి వారిని సమాధానపరచి పంపెను. వారంతటినుండి నా వెనదగిలి ఒత్తిడి చేయమొదలిడిరి. అందును గురించి నేను స్వయముగా డి.ఇ.ఒ గారియొద్దకు వెళ్లి సంగతులన్ని తెలియజెప్పితిని. వారు సుతరాము అంగీకరించననిరి."It may go to the extent of surcharge" అని కూడా నన్ను హెచ్చరించిరి. ఎట్లాగైనా చేయకతప్పదని ఖండితముగా చెప్పివైచితిని.

అంతట నేను తిరిగి ఆఫీసుకు వచ్చి తణుకు హైస్కూలునందలి మాథమెటిక్సు అసిస్టెంట్సులో నొకరిని కదిపితే స్కూలు పనులకేమైనా లోటు కలుగుతుందా? యని అచట హెడ్మాస్టరుకు వ్రాసి కనుగొనగా అప్పటి విద్యార్థుల సంఖ్యను

బట్టి యిబ్బంది కలుగదనెను. అపుడచటున్న టీచర్లలో మాథమెటిక్సు బి.ఎ. బి.ఎల్.ఐ అయిన భాగవతుల రాఘవేంద్ర శాస్త్రిగారిని నెలకు రూ॥ 98 జీతమునకు రానున్న ఇంక్రిమెంటు తేదీ వరకు నెలకు 2 పర్సనల్ అలవెన్సుతో రూ॥ 100/- జీతముతోను యిన్క్రిమెంటు తేది నుండి రూ॥ 101/-లు జీతముతోను హెడ్మాస్టరుగా అవనిగడ్డకు రప్పించితిని అదివరకటి హెడ్మాస్టరు హిస్టరీ, బి.ఎ, గనుక ఫస్టు అసిస్టెంటుగా ఏర్పరచి ఫోర్త్ఫారం ఓపెన్ చేయుటలో రికగ్నైజేషన్ అయ్యేవరకు రిస్క్ విద్యార్థుల తలిదండ్రులదేనని స్పష్టీకరించి అందుకు అంగీకరించిన వారి పిల్లలతోనే హైస్కూలు ప్రారంభించవలసి వచ్చినదిగా వుత్తరువునిచ్చితిని. యీ వుత్తరువులో కాపీ నొకదానిని డి.ఇ.ఓగారికి పంపుతూ తణుకులో ఖాళీకి తగిన అభ్యర్థిని సూచించగోరితిని. ఆ ఖాళీ భర్తీచేయుటకు తగిన కాండిడేటును సూచించినచో నా ఏర్పాట్లకు డి.ఇ.ఓ. సమ్మతించినట్లే కాగలదు.లేనిచో బోర్డుకు క్రొత్త ఖర్చు లేనేలేదు. గనుక ఏ విధంగాను సర్చార్జీకి వీలు కనిపించలేదు. నేను వేసిన ఆర్డరు చూసి చాలా విస్తుపోయి, డి.ఇ.ఓ గారు మరి కొన్ని ప్రశ్నలు వేసినారు. దగ్గరలో రేపల్లెలోను చల్లపల్లిలోనూ హైస్కూలున్నందున అవనిగడ్డలో అగత్యములేదని. దీనికి జవాబు రేపల్లె గుంటూరు జిల్లాలోనిది, కృష్ణానదిని రెండు మూడు పడవల మీద దాటి పిమ్మట మూడుమైళ్లు రోడ్డు ప్రయాణం చేస్తే రేపల్లె వెళ్లగలరని గనక అది అసంభవం. చల్లపల్లి అవనిగడ్డకే 9 మైళ్లు కలదు. దీవి లోని యితర గ్రామాలకింకా హెచ్చు దూరముంటుంది. అచటి హైస్కూలు ప్రైవేటుమేనేజిమెంటు గలది గనుక అవనిగడ్డలో అవసరమున్నది. అవనిగడ్డలో హైస్కూలుకు తగిన బిల్డింగు సౌకర్యములున్నవా? స్కూలు కొరకు కావలసిన స్థలము బోర్డువారు కొన్నారు బిల్డింగు కట్టించుటకు కావలసినసొమ్మున్ను సిద్ధముగా నిలవయున్నది. గనుక తొందరలో కట్టించెదము. అని యీ విధముగా కొన్నాళ్లకి ఉత్తర ప్రత్యుత్తరములు జరిగిన మీదట ఎ. రామరావుగారు డిప్యూటి డైరెక్టరు హోదాలో మదరాసు వెళ్లిన పిమ్మట మరల నొక క్రొత్త దరఖాస్తు పుచ్చుకొని రికగ్నిషన్ శాంక్షన్ చేసినారు. ఇంగ్లండు వెళ్లి పెద్ద చదువులు నేర్చిన గొప్ప అధికార స్థానమునందున్న రామారావుగారి పట్టుదల అంతటితో సమాప్తమైనది.

## తాడంకి మంటాడ రోడ్డుపై కల్వర్టు నిర్మాణం

పూర్వము హైద్రాబాదు నుండి మచిలీపట్నం (సముద్రరేవు)కు పెద్ద రోడ్డును ప్రభుత్వఖర్చుతో నిర్మించి జిల్లా బోర్డు మేనేజిమెంటులోనుంచబడి సంరక్షింపబడుచుండెను. ఏటేటా మైలుకు రూ 500లు మెయింటినెన్సు గవర్నమెంటు యివ్వడమున్ను దానికితోడుగా మరి రూ॥ 500 బోర్డు ద్రవ్యమును చేర్చి మరమ్మతు సంరక్షణలు జరుపుతుండమున్ను విధాయకముగా వస్తున్నది. బందరు -బెజవాడల మధ్య తాడంకి మంటాడ వద్ద ఆ రోడ్డు క్రిందుగా మాగాణి భూములకు పంట నీరు సప్లయి కావలసిన అగత్యం కలిగి ఉయ్యూరు రాజాగారు చాలా ప్రయత్నము చేసినను లోగడ ప్రెసిడెంట్లెవరును రోడ్డుకు గండి పెట్టి తూములమర్చుటకు అంగీకరింపరైరి. అందునుగురించి నా హయాములో వారు నా వద్దకు వచ్చి సంగతులన్ని విపులముగా చెప్పిన మీదట నేనాలోచించి రైతులపంట వృద్ధిని, ప్రభుత్వమునకు వచ్చె శిస్తూ ఆదాయపు అభివృద్ధిని గమనించి యివ్వనిశ్చయించితిని.

ఆ రోడ్డు ప్రభుత్వ నిర్మాణమగుటను, మనమిచ్చుటకు స్వతంత్రించవచ్చునా? లేదా? అని ఆలోచించనైతిని. నేను కొన్ని షరతులను నిర్ణయించితిని. దరఖాస్తుదారు బోర్డు పేరిట నిర్ణీతమైన కొంత మొత్తము నగదుగా జమ కట్టవలసినదన్ని, ఆ సొమ్ము ముందెన్నడైనా యీ తూములవల్ల రోడ్డుకు ఏవైనా మరమ్మతులు కావలసివస్తే చేయుటకు బోర్డు స్వాధీనమునందే శాశ్వతముగా నుండవలెనన్ని. తూములమర్చే కాలములో రహదారికి అడ్డు లేకుండా ప్రక్క వెంట

నొక సెస్సు రోడ్డును ధరఖాస్తుదారు తన స్వంత ఖర్చు మీద డిస్ట్రిక్టు బోర్డు యింజనీయరుగారు చెప్పే విధముగా ఆయన తనిఖీకి లోబడి తయారుచేయించి చూపుటకున్ను, రోడ్డుకు అడ్డముగా తూముకు సరిపోవునటుల గండి కొట్టి తూములమర్చిన మీదట రోడ్డు గండిని పూడ్చి యధాప్రకారము రోడ్డును సరిచేసి 24 గం॥ల లోపల యావత్తూ పనులు పూర్తిచేసి రహదారికి వీలుగా డిస్ట్రిక్టు బోర్డు యింజనీయరుగారికి వప్పగించవలెనని, అందుకు కావలసిన అన్ని సామానులు స్తలము వద్దకు చేర్చి, తగిన సన్నాహమంతా సిద్ధపరచిన తర్వాతనే పెద్దరోడ్డుకు గండిపెట్టవలసినదని, ఏవిధముగాను రహదారికి ఎట్టి యిబ్బంది లేకుండా చేయుటకున్ను, ప్రభుత్వ నిర్ణయ పరిహారము లేవియైనను దరఖాస్తుదారే భరించులాగున్ను ఈ షరతుల ప్రకారము దరఖాస్తుదారునివల్ల ఒప్పుదలగా తగిన హామీ వ్రాయించుకొన్నమీదటనే యీ వుత్తరువునమలులోనికి తేవలసినదని ఆర్డరు నిచ్చితిని.

ఆ ప్రకారమన్ని పనులు పూర్తియైనవి. ప్రభుత్వాదాయం పెంపుదలకు రైతుల పంటల పెంపుదలకు వీలుగానే వున్నదని చాలామంది సంతోషించిరి. అయితే ఈ సంగతులన్ని సూపరింటెండు ఇంజనీయరుగారితో సంప్రదించడం గానీ ఆయన అనుమతిని తీసుకోవడంగాని జరగలేదనేది ఆయన కోపకారణమైనది. అందును గురించి నాకొక లేఖ వ్రాస్తూ జవాబు 24 గం॥లలో పంపకపోతే దీనిని గవర్నమెంటుకు తెలియజేస్తానని కూడా దానియందుదహరించినాడు. దానిని నాయెద్దనే యుంచి, నేనాయనకు మరియొక లేఖ వ్రాసిపంపితిని. ఆ లేఖ సంగతులేమనగా: – చల్లపల్లిలో సబ్ రిజిస్ట్రార్సు ఆఫీసు బిల్డింగును, పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంటువారు కట్టించినారు. ఆఫీసు బిల్డింగు నుండి రోడ్డుకు వెళ్లే మార్గమునకు వీలుగా రోడ్డు ప్రక్కన Side drain మురుగు నీటి కడ్డు లేకుండునటుల ఒక (Pipe culvert) వంతెన కట్టించినారు. వంతెన ప్రదేశములో లోకల్ ఫండ్ స్థలమని తెలిసియుండిన్ని బోర్డు అనుజ్ఞ పొందకుండా పి.డబ్ల్యు.డి.వారే స్వతంత్రించి కట్టించియున్నారు. ఆ వంతెనను వెంటనే తీసివేయించవలసినదనిన్ని, లేనిచో మేము తీసివేయించి అందుకుఅయ్యే ఖర్చును పి.డబ్ల్యు.డి నుండి వసూలు చేయుదుననిన్ని అంతేకాక వారి నిరంకుశత్వమునకు కారణము తెలుపుతూ దీనికి జవాబు వ్రాసి 24 గంటలలోగా మాకు పంపని యెడల పి.డబ్ల్యు.డివారి నిరంకుశత్వమును గురించి గవర్నమెంటుకు తెలియజేయుదునని వ్రాసిపంపితిని. నా లేఖ చూసిన మీదట రాజీకి అభిప్రాయుడై ఎస్.ఇ గారు ఇంటర్వ్యూ కోరగా వుభయులము సమావేశమై సంభాషణములు జరుపుకొని ఎవరి కాగితమును వారు రద్దు చేసుకొని సభ్యతగా సర్దుకొని వెళ్లితిమి. అంతట నుండి మేమిద్దరము పరస్పర గౌరవముతోనె మెలిగితిమి.

**బెజవాడ బందరు మధ్య రైలు**

బెజవాడ నుండి బందరుకు రైలు మార్గము నిర్మాణము గురించి రైలు కంపెనీ వారితో జిల్లా కలెక్టరుగారి ద్వారా జిల్లా బోర్డు వారు కోరినపుడు రైల్వే బోర్డు వారు తమకు నష్టము కలిగితే భరించుటకు జిల్లా బోర్డును హామీ కోరిరి. దానికి జిల్లా బోర్డువారు ఆ రైలు వల్ల కంపెనీకు వచ్చు నష్టమంతకు తాము పూచీ పడుదమనిన్ని లాభము వచ్చే యెడల సగము తమకు యివ్వవలసిందిగా కోరిరి. దానికి ఇరువది లక్షల రూపాయలు పెట్టుబడి చెల్లిస్తే అట్లే లాభములో సగమునిచ్చెదనిరి. దానికివప్పుకొని గవర్నమెంటు వద్దనుండి అప్పు తీసుకొని ఇరువది లక్షల రూపాయలు రైల్వే పెట్టుబడిగా కంపెనీకి చెల్లించి లాభములో భాగపు హక్కును సంపాదించిరి.

రైలు పెట్టుబడి కొరకు చేసిన ఆ రుణమును సగటు వడ్డీతో 40 అర్ధ సంవత్సర సమాన వాయిదాలుగా తీర్చేలాగా గవర్నమెంటుతో జిల్లా బోర్డు ఒడంబడిక చేసుకొనినది. ఆ రైలు వల్ల నష్టమెన్నడూ రానే లేదు. ప్రతి

సంవత్సరాంతమున లెక్క చూచుకొనగా జిల్లా బోర్డు వంతు నికర లాభం 3.5 లక్షల రూపాయలకు పైగా వచ్చుచుండెడిది. దానినుండి గవర్నమెంటు అప్పు వాయిదాలు చెల్లించగా మిగిలే సొమ్ము సం॥కు రెండు లక్షల రూపాయలకు పైగా నిలవయుండేది. నా హయాములో 33వ అప్పు వాయిదా గవర్నమెంటుకు చెల్లించుటలో నొకరోజు ఆలస్యమైనది. ఆ రోజు ఆలస్యమైనందుకు రూ॥ 500/-లు పెనాల్టీ చెల్లించవలసినదని ట్రెజరీ డిప్యూటీ కలెక్టరు నోటీసు పంపిరి. దానికి నేను సమాధానము వ్రాయుచూ, జిల్లా బోర్డు సొమ్ము గవర్నమెంటు ట్రెజరీలోనే యున్నందున, చిరాలో జమా ఖర్చు చేయడమేగాని వాస్తవంగా నగదు చెల్లించేది కాదనిన్ని ఒక రోజు కాగితములాలస్యమైనందువల్ల గవర్నమెంటుకు నష్టము కలిగేదేమీ లేదనిన్ని అయినను ఇకముందిట్టి ఆలస్యము కూడా జరగబోదనిన్ని పెనాల్టీ ఉత్తరువును ఉపసంహరించుకోవలసినదని కోరి వ్రాసితిని. దానికి ఆయన ఒప్పుకోనందున జిల్లా కలెక్టరుకు తెలిపితిని. ఆయనయును, మిన్నకుండెను. రూ॥ 500/-లు బోర్డు సొమ్ము నేను అన్యాయముగా ఖర్చు పెట్టడమంటే నా మనసునకెంతో కష్టమనిపించినది.

కృష్ణా జిల్లా బోర్డు నిలవసొమ్ము నుండి, వడ్డీకి అప్పులీయదలచితిమనిన్ని, అప్పులు కోరదలచిన బ్యాంకీలు వారికి కావలసిన మొత్తం – తీర్చేవాయిదా – వడ్డీరేటు తెలుపుతూ దరఖాస్తులు పంపవచ్చునని పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించితిని. అందుమీదట మదరాసు అర్బన్ బ్యాంకు రు॥ 2 లక్షలు, విజయవాడ కోఆపరేటివ్ బ్యాంకుకు రు॥75 వేలు, ఏలూరు కో ఆపరేటివ్ బ్యాంకుకు రు॥75 వేలు, కృష్ణా సెంట్రల్ బ్యాంకు రు॥50 వేలు మొత్తము 4 లక్షల రూపాయలుకు దరఖాస్తు పంపిరి. ఆయా బ్యాంకుల మోతుబరిని (Borrowing Capacity) గురించి గవర్నమెంటు కంట్రోలరు జనరల్ గారికి వ్రాసి తెలిసికొని నాలుగు లక్షలకు ట్రెజరీ డిప్యూటి కలెక్టరుకు చెక్కు వ్రాసి పంపుతూ కవరింగు లెటరులో ఏ బ్యాంకుకు ఎంత యియ్యవలసినది వివరములు తెలియజేసి ఆ ప్రకారం రెమిటెన్సు ట్రాన్సుఫర్ షీట్లు ఆయా బ్యాంకులకు వెంటనే పంపగోరితిని.

అంత పెద్ద మొత్తమొకేసారి ట్రెజరీ నుండి ఏ ప్రెసిడెంటు తీసియుండనందున కొంచెము తటపటాయించి జిల్లా కలెక్టరుతో సంప్రదించి, నేను పంపిన చెక్కు చెలామణి చేసి వెంటనే గవర్నమెంటుకు తెలియజేసెను. గవర్నమెంటు నాకొక లేఖ వ్రాయుచూ, ఎన్నడూ లేని క్రొత్త పంధానవలంబించుటకు గల కారణమేమని ప్రశ్నించిరి. నేనంపిన జవాబు నందిటుల వ్రాసితిని:- ప్రభుత్వంనందన్ని (Department) శాఖలు సమాన హోదాలో పరస్పర గౌరవ, సహకార, సద్భావములతో మెలగవలసియుండునని తలచితిని. దానికి విరుద్ధముగా బందరు ట్రెజరీ డిప్యూటీ కలెక్టరుకు నాకు మధ్య జరిగిన రూ 500ల పెనాల్టీని గురించిన ఫైలును మీ పర్యవేక్షణ కిందుతో పొందుపరచుచున్నాను. దానిని బట్టి నా మనసుకు తోచినదేమనగా:- ఏ డిపార్టుమెంటు బాగోగులు వారివేనని, ఎన్నికలలో ప్రజా ప్రాతినిధ్యము వహించి జిల్లా బోర్డు అధికారమును స్వీకరించిన నేను, బోర్డు సొమ్ము రూ॥ 500/- లు అన్యాయముగా, నష్టపరచితిననే విచారము కలిగి జిల్లా బోర్డుకు రైల్వే ఆదాయము వల్ల లభించిన బాపతు నిలవసొమ్ము సుమారు ముప్పది లక్షలు రూపాయలుకు మించిన మొత్తమును వడ్డీ లేకుండా వ్యర్థముగా గవర్నమెంటు ట్రెజరీలో నుంచుట వలన కలిగే లాభమేమీలేదన్నిన్ని నమ్మకమైన బ్యాంకులకు కొంత సొమ్మును అప్పు ఇచ్చినచో వడ్డీ వల్ల కొంత క్రొత్త ఆదాయమును రాబట్టినవాడనగుదునని తలచి యీ ప్రకారము చేయబూనితిని. ఇంతకన్న వేరే ప్రత్యేక కారణమేమీ లేవు అని స్పష్టముగా తెల్పితిని.

దానిమీద ప్రభుత్వం కలెక్టరుగారికేమి వ్రాసినదో తెలియదు కాని కొద్దిరోజుల్లోనే పెనాల్టీ బాపతు రూ॥ 500 తిరిగి వాపసు ఇచ్చి టి.డి.సి.గారు తన లోపములను గురించి చాలా పశ్చాత్తాపము నగుపరచెను. అంతటి నుండి పొదుపుకే మీ తలచూపనేలేదు. జిల్లా కలెక్టరు, ట్రెజరీ డిప్యూటి కలెక్టరు ప్రభుత్వం వారు నా యెడల సదభిప్రాయములతోనే ప్రవర్తించుచుండిరి.

## చల్లపల్లి రాజాగారితో వివాదం

జిల్లా బోర్డు ఆదాయం పరిశీలనలో నాకు కనిపించిన ఒక అంశమును గవర్నమెంటుకు తెలిపితిని. జమీందారు ఏరియాలో గల కొంత భూములను కౌలుకిచ్చి ఎంతో హెచ్చు రాబడిని జమీందార్లు రాబట్టుకున్నారు. లోకల్ సెస్సు చెల్లించుటలో ప్రక్కభూములతరం శిస్తు రేటు ప్రకారమయ్యే మొత్తంనకు మాత్రమే సెస్సు చెల్లించుచుండిరి. కృష్ణలంకలో అటువంటి భూమి గవర్నమెంటు ఇలాకాకున్న చోట్ల ఆ భూముల యొక్క కౌలు రాబడిమీద వచ్చే మొత్తమునకయ్యే సెస్సులనిచ్చుచుండిరి. ఈ విబేధములు లేకుండునటుల గవర్నమెంటువారు ఇచ్చుచున్న విధముగా జమీందార్లు కూడా వారు రాబట్టుకునే కౌలు మొత్తములననుసరించి లోకల్ సెస్సులు చెల్లించవలసి వుంటుందని అందుకనుగుణ్యమైన వుత్తరువులను ప్రభుత్వం జారీ చేయవలెనని కోరియుంటిని. ఈ సంగతులు తెలియుటతో జమీందార్లలో గలిగిన సంచలనమే, బోర్డు అధికారస్థానము నాక్రమించుటకై జమీందార్లకు కలిగిన వాంఛకు కొంత కారణమని చెప్పవచ్చును.

ఇంకొక సంగతి. బందరు చల్లపల్లి రోడ్డు మీదకు కావలసిన ఇసుక, రామానగరం – లక్ష్మీపురంల మధ్యనున్న రోడ్డుప్రక్క వెంట ఖాళీగా ఉన్న ప్రదేశమునుండి లభించేది. రోడ్డు ఏర్పడినప్పటి నుండి ఆ ఇసుకనే వాడుతుండిరి. బాలాజీరావు నాయుడుగారి హయాములో ఇసుక బళ్లను చల్లపల్లిరాజాగారి మనుష్యులు అటకాయించిరి. అందుమీదట ఆ ప్రదేశమునుండి పది ఎకరముల భూమిని లోకల్ బోర్డుకు కావలసిన యిసుక త్రవ్వుకొనుటకు, ఎంక్వయిర్ చేసి యిప్పించవలసిందిగా గవర్నమెంటును కోరితిని. అది తెలిసి చల్లపల్లి రాజాగారు ఆ ప్రదేశమునందంతటను (Dibi Dibi Plantation) మాదిగకరక్కాయ చెట్లు (ఔషద మొక్కలు) నాటించి ఒక పాక వేసి కాపలా మనిషిని పెట్టిరి. వారి ఉద్దేశ్యమును గ్రహించి, గవర్నమెంటు తీసుకొందురని తెలిసి బుద్ధిపూర్వకంగా మొక్కలు నాటించిన కారణమున హెచ్చు కాంపెన్సేషన్ కోరుటకు కూడా వీలుండదని రాజాగారికి తెలిపితిమి.

పిమ్మట మదరాసులో బాలాజీరావునాయుడు గారున్ను చల్లపల్ల రాజాగారైన శ్రీమంతు రాజా అంకినీడు ప్రసాదుగారున్ను, లెజిస్లేటు కౌన్సిల్ మెంబర్లుగనున్నందున వారిద్దరును లోకల్ బోర్డుల సెక్రటరీ పి.ఎల్.మూర్తిగారున్ను కలిసి సంభాషించుకొని, రాజా గారిష్టమైన మరియొక చోట లక్ష్మీపురంలో 4 ఎకరములు తీసుకొనుటకేర్పరచుకొని వచ్చిరి. బందరు నుండి ప్రెసిడెంటు గారు డిస్ట్రిక్టు యింజనీయరుగారు లక్ష్మీపురం వచ్చి ఆ నాలుగు ఎకరముల భూమిని చూచి దానినే ఇసుక నిమిత్తం తీసుకొనదలచినటుల రికార్డు మీద వ్రాసుకొని వెళ్లిరి. ప్రెసిడెంటు గారు తిరిగి మదరాసు వెళ్లుటతోనే ఆ రికార్డు నావద్దకు వచ్చినది. నేను కూడా ఆ ప్రదేశమును చూడదలచి ఒక నిర్ధారణ తేదీని అసిస్టెంటు ఇంజనీయరుగారినా స్థలమునందు Trial pits పెట్టించియుంచమని ఆ వేళకు నేను కూడా వెళ్లితిని.

మేమిద్దరమూ ఆ స్థలమునందు గోతులనుబట్టి చూడగా పై భాగమునందొక అడుగులోతుకన్నా ఇసుక లేనే లేదు. ఆ లోతు కింద నల్లరేగడి బంకమన్ను ఉంది. కనుక దీన్ని గురించిన నిర్ధారణకు మీటింగు అజండాలో చేర్పించితిని. బోర్డు సమక్షంమున ప్రెసిడెంటు గారు తాము డివిజన్ ఇంజనీరుగారు వెళ్లినపుడు పై భాగమును

మాత్రమే చూసి నిర్ధారించితిమనిన్ని పిమ్మట వైస్ ప్రెసిడెంటు గారు అసిస్టెంటు ఇంజనీరు గారున్ను వెళ్లినపుడు గోతులు తవ్వించి పరిశీలనగా చూచి యధార్థస్థితిని తెలుసుకొన్నారని గనుక దానిని వదిలివేసి మొదటి ప్రపోజలు ప్రకారం అక్విజిషన్ అవసరమని తీర్మానించగోరిరి.

పిమ్మట మదరాసు నుండి లోకల్ బోర్డు సెక్రటరీ గారు నాకొక లేఖ రాసిరి. ధనవంతుడగు జమీందారులతో వివాదగ్రస్తులమై ఆ భూమినే తీసుకొని ఆయనకు హెచ్చు కంపెన్సెషన్ యిచ్చుటకంటే, జమీందారు యిస్తాననే మరియెక్క స్థలము తీసుకొనుట యేల యుక్తము కాదో తెలుపగోరెను. దానికి జవాబునందు నేనిటుల వివరించితిని. దేవరకోట ఎస్టేటును గురించి అబ్దుల్ కుతబా యిచ్చిన సన్నదులోను, తిరిగి Sir Robert Ioline బ్రిటిష్ గవర్నమెంటు తరపున దానిని renew చేయుటలోను గల షరతులు ఆస్తి షెడ్యూలు వివరములను రెవిన్యూ బోర్డు ఆఫీసులో పరిశీలించినచో దాని పుట్టు పూర్వోత్తరములు సరిగా అర్థము కాగలవనిన్ని, ఇసుక కొరకు మనము కోరి తీసుకోదలచి స్థలమునందు జమీందారున కెట్టి హక్కు లేదనిన్ని అది శిస్తు నిర్ణయము చేయబడని ఖాళీ భూమి అనిన్ని... దానిని పబ్లిక్ పనులకు తీసుకొనుటలో ఎవరి అభ్యంతరము వుండకూడదనిన్ని దానికొరకు కంపెన్సెను యివ్వనక్కరలేదని, హెచ్చు కంపెన్సేషననే ప్రశ్నే ఉదయించబోదని విపులీకరించి వ్రాసియుంటిని.

ఈ సంగతులన్ని మూరుగారి ద్వారా తెలుసుకొని చల్లపల్లి వచ్చినపుడు వారి మేనేజరును పంపగా రాజా గారితో సమావేశము నేర్పరుచుకొంటిమి. ఆనాటి మా సంభాషణలో పూర్వము నుండి జరుగుతున్న సామాన్య పనికి – పబ్లిక్ రోడ్డు మీద పరిచే ఇసుకకు అడ్డు వేయించుట ఎస్టేటుదార్లును విద్యావంతులునగు తమవంటి వారికి తగిన పని కాదని చెప్పితిని. కాంట్రాక్టరు యందుండే విరోధభావము వలన తమ నౌకర్లటుల చేసిరని దానిని సమర్థించుటకు తాను పూనుకొని చేసిన యీ గ్రంథమంతా బుద్ధిపూర్వకముకాదని, దానినొక పట్టుదల భావముతో చూడక ఆ ప్రదేశము మినహా మరేచోటనైనను కావలసిన ఇసుక తీసుకొనుటకు తామెట్టి అభ్యంతరము చేయబోమని చెప్పిరి. అంతటితో ఆ కథ ముగిసినను, అంతటి నుండి నావంటి వారు బోర్డులోను రాజ్యాంగ వ్యవహారములోను ప్రవేశించుటకు జమీందార్లు అయిష్టతగనుండిరి. ఈ సంఘటన ఫలితములే తర్వాత వచ్చిన ఎన్నికలలలో జమీందార్లతో సంఘర్షణకు కారణములైనవి.

## జిల్లా బోర్డులో ప్రతిష్టంబన

జిల్లా బోర్డు నందు మెంబర్ల సంఖ్య 52 మంది. వీరిలో 1/4 వంతు నామినేషను కాబడిన మెంబర్లు, తాలూకా బోర్డుప్రెసిడెంట్లుగనెన్నుకోబడి దీనిలో ఎక్సు అఫిషియో మెంబర్లుగనున్నవారు ఎనిమిదిమంది తక్కిన సభ్యులు ఆయా తాలూకా బోర్డుల నుండి ఎన్నుకోబడిన ప్రతినిధులు. తిక్కాని బాలాజీరావు నాయుడుగారిని ప్రెసిడెంటుగా నామినేటు కాబడెను. నేను వైసు ప్రెసిడెంటుగ నెన్నుకోబడితిని. నామినేటెడ్ మెంబర్లలో కొంతమంది మాత్రం ప్రెసిడెంటుకు అనుకూలురు. జిల్లా కలెక్టరు స్వతంత్ర అభిప్రాయుడగు ఐర్లండు దేశీయుడు. ఎన్నికలు జరిగిన కొత్తలో అప్పటి పరిస్థితులను ప్రెసిడెంటుగారు ప్రభుత్వమునకు తెలుపుటలో బోర్డు సభ్యులలో నాన్ కో ఆపరేటర్లు హెచ్చు మంది కలరని బోర్డు పరిపాలన సాగించుట కష్టతరమని, నామినేషన్ల సంఖ్యపెంచడం అగత్యమని వ్రాసెను. ఆ ఆక్టుకు విరుద్ధముగా చేయవీలులేదనిరి. అందువలన బోర్డు పరిపాలనలో ప్రెసిడెంటుగారి నిరంకుశత్వమునకు అనుకూలించదాయెను. మీటింగు నోటీసు – అజెండా–విధాయక ప్రకారం ఏడు రోజుల వ్యవధితో పంపనందుకు ఒక మెంబరు తన ఆక్షేపణను తెలిపి మీటింగు నాపుచేయ గోరెను. దానిని మరెవరైనా బలపరచెదరాయని ప్రెసిడెంటుగారు

ప్రశ్నించిరి. (Any member may object it) ఏ మెంబరైనను అడ్డుపెట్టవచ్చునని ఆక్టునందు స్పష్టీకరించియున్నందున మరియొకరి ఆమోదము అనగత్యమని జవాబిచ్చెను. అంతటితో మీటింగు ఆపివేయబడెను.

ఈ మీటింగు నిలుపుదలకు ప్రెసిడెంటుగారి అవ్యవధి నోటీసు కారణమగుటను యీ మీటింగుకు వచ్చిన మెంబర్ల రాకపోకల ఖర్చులు (జర్నీ అలవెన్సు) ప్రెసిడెంటుగారే భరించవలసియుంటుందనే విషయమును మరుసటి మీటింగులో పెట్టి చర్చించుటకు నోటీసునిచ్చిరి. బ్రిటిష్ ప్రభుత్వ పాలనలో డిప్యూటి కలెక్టరుగ నుండి స్వేచ్ఛాధికారములను చెలాయించినవాడగుటచే ప్రెసిడెంటుగారికీ చర్య నెంతో కష్టమనిపించినది. అయినను విధి లేక, తన మర్యాదను, తన స్థానము యొక్క మర్యాదను నిలుపుకొన గోరి మెంబర్ల నిష్టపరచి, యిక ముందట్టుగా జరుగనీయనని చెప్పెను. ప్రతి విషయమునెంతో జాగ్రత్తగ చూడవలసివచ్చుట చాలా కష్టముగతోచెను. ఒకపుడు బోర్డుకు అవసరములేనిది మోటారు లారీలు కొన్నాడని, ఆ బేరములో కొంత కమిషన్ తీసుకొని పాతవి కొన్నాడని మొదలగు కొన్ని ఆరోపణలు చేసి, వాటిని విచారించుటకొక కమిటీని వేసిరి. ఆ కమిటీకి నన్నధ్యక్షునిగ కోరిరి.

ఇవన్నీ రాజకీయ విభేదములతో కలిగిన మనస్సందేహమును పెంపొందించుకొనగా తేలిన దుష్ఫలితములని చెప్పవచ్చును. ఇట్లుండగా, 1924 సంగుము మార్చి నెలాఖరున ఏలూరులో బోర్డు మీటింగునకై సభ్యులందరూ వచ్చి యుండిరి. మెంబర్లందరు కలిసి మాట్లాడుకొని ప్రెసిడెంటుగారికొక రాయభారమునంపిరి. ఉదయపు పూట ప్రెసిడెంటుగారిని మీటింగుకు రాకుండా (ఆయన) బసలోనే వుండగోరుతూ, మధ్యాహ్నము నుండి ఆయన మీద గల ఆరోపణలను నిష్పాక్షికముగ విచారించి నిజమును తేల్చుకొని సఖ్యతగా పరిష్కరించదలచితిమని కబురు చేసిరి. అందుకాయన సమ్మతించక మీటింగునారంభించెను. అపుడు మెంబర్లు ప్రతిష్టంభన Dead Lock అనే కొత్త పంథాను అమలు జరిపిరి.

మీటింగు ఒక చిన్న విషయముతో ప్రారంభమైనది. "డిస్ట్రిక్టు యింజనీయరుగారికి (కాన్ఫిడెన్షియల్ రికార్డు) రహస్యరికార్డు కొరకో పెట్టె కావలెనని" చెప్పి దానిని శాంక్షను చేయగోరెను. దానికెన్నో విధములగు ప్రశ్నలు సాగించిరి. ఇదివరకు అట్టిపెట్టె వుండేదేనా? అదిపుడేమైనది? కొనదలచిన పెట్టె ఏమోస్తరిది? ఏ ఫరంలో కొనదలచిరి? ఇంకా ఏయే ఫరములలోనైనా విచారించినారా? ఆయా ఫరంలలోని పెట్టెల యొక్క నాణ్యత, ఖరీదు మొదలగు వివరములు తెలుపుదురా? అని పెక్కు ప్రశ్నలు వేయగా, వాటిలో వరుసగా కొన్ని ప్రశ్నలకు సమాధానములిచ్చినను ప్రశ్నిలింకనూ వేయుచున్నందున విసుగెత్తి, తక్కిన సమాచారము లిపుడు తనవద్ద లేదని చెప్పెను. సమాచారమంతా పూర్తిగా తెలుసుకొనేవరకు దానిని ఆపివేయగోరిరి. అట్లా ఆపుచేయ తగదని మరికొందరనిరి. ఆపమనేవారిపేర్లు – ఆపవద్దనేవారి పేర్లు – తటస్థముగ నుండే వారిపేర్లు మినిట్ బుక్కులో వివరముగా వ్రాయవలెనని కోరిరి. ఆ విధముగా మూడు తరగతులుగా పేర్లన్ని వ్రాయించిరి.

తర్వాత రెండవ అంశమునారంభించెను. అది కూడా లాంఛనప్రాయముగా శాంక్షను కోరినదేగానీ పెద్ద చర్చనీయాంశముగాదు. రోడ్లనిమిత్తం కావలసిన కంకరకు, మెటల్ క్వారీ, ఎక్విజిషన్ శాంక్షను చేయవలెనని కోరబడెను. ఇదివరకున్న క్వారీ ఎప్పటితో ముగింపైనదని, క్రొత్తది కావలెనని ప్రపోజలు ఎపుడు వచ్చినదని, ఎక్కడ మనకు వీలుగాను చౌకగాను లభించగలదని విచారించినారా? వాటి వివరాలేమిటి. అనే మొదలైన అసంఖ్యాకములగు ప్రశ్నలతో విసిగించిరి. చివరకు దీనిని కూడా మొదటి దానిదారికే లాగిరి. అంతటనొక సభ్యుడు లేచి, ఈ సభలో

పరిగణించదకూడని ఓటు కూడా చేర్చి లెక్కించబడినందుకు మీటింగు అశాస్త్రీయమని, మినిట్ బుక్కులో వ్రాయగోరెను. దాని వివరములేమనగా:- భీమవరం తాలూకా బోర్డు ప్రెసిడెంటు గంధం వెంకయ్య నాయుడుగారొక సందర్భములో తన పదవికి రిజైన్ చేసినందున దానితోపాటు యీ బోర్డులో గల ఎక్సు అఫిషియో మెంబరు పదవి కూడా పోయినది. ఆ తాలూకా బోర్డు తిరిగి ఆయననే ప్రెసిడెంటుగా ఎన్నుకొన్నందున దానితోపాటు యిచట మెంబరు పదవి కూడా మళ్లీ ఏర్పడినది.

అయితే యీ విషయము నోటిఫికేషన్ జరిగిన పిమ్మట అమలులోకి రావలెను. అదింతవరకు జరిగినటుల ఈ ఆఫీసుకు తెలియపరచబడనందున ఆయన వోటున కనర్హుడని ఆ వోటునిపుడీ విభజనగా వ్రాసిన పేర్లలో చేర్చుట అశాస్త్రీయమని, మెంబరుగా ఎంచ వీలులేని వారి ఓటు తీసుకున్నందుకు ప్రెసిడెంటుగారశాస్త్రీయచర్య జరిగించినటుల మినిట్ బుక్‌లో వ్రాసి మీటింగు చెల్లనేరదని, రద్దుపరచగోరిరి. దానితో బయలుదేరిన గొప్ప సంచలనమునకేమీ చేయటకును ప్రెసిడెంటుగారికి తోచక, నిర్భాంతుడై, నా సలహానుపేక్షించెను. అపుడు నేను లేచి, సభవారితో అప్పటికే మధ్యాహ్నం 12 గం॥లు కావచ్చినది గనుక ఆ పూటకు మీటింగునిలుపు చేసి మధ్యాహ్నం 2 గం॥ల నుండి మరల సమావేశమగునటుల వాయిదా వేయగోరితిని. దానికందరు సమ్మతించి లేచిరి.

రెండు గంటల మీటింగుకు ప్రెసిడెంటుగారు రానేలేదు. మేమే పూర్తిచేసితిమి. సాయంత్రం 5 గం॥లకు మీటింగు ముగింపు సమయమునకు, ప్రెసిడెంటుగారు తన పదవికి రిజిగ్నేషన్ వ్రాసి పంపెను. అది మీటింగులో చదవబడి అందరి ఎదుట నామోదించబడెను. దానితో బాధ్యతయావత్తూ నాపై కొఱిగినది. సాలాఖరునాడు సాయంత్రం 5 గం॥ల వరకు తెలియనీయక అకస్మాత్తుగా రిజైను చేయుటలోనెంత నిగూఢమైన యిబ్బంది కలగగలదో చెప్పజాలను. క్రొత్త సంవత్సరమారంభమగుటచే మరుసటి సూర్యోదయము వేళకు జిల్లా యందంతటను గల టోల్‌గేట్లు క్రొత్త యిజారాదార్లకు వప్పగింతజేయవలసియున్నది. ఆలస్యమైతే యిజారాదారుకు వచ్చే రాబడి కొంత నష్టమైనదనే సాకు చెప్పి చెల్లింపులో కొంత ముదరా కోరెదరు.

అదేవిధంగా జిల్లాలోని రేవులు, క్రొత్త యిజారాదార్లకు వప్పగింతచేయవలసియున్నది. జిల్లాయందలి మోటారు కార్లంటిని సరియైన ఆర్డరులో నున్నది లేనిది పరిశీలించి లైసెన్సునీయవలసియున్నది. లేనిచో మరుసటి ఉదయమున సర్వీసు బస్సులన్నీ నడుపవీలుండదు. ఇట్టి పనులన్నింటిని ఒక రాత్రిలో అన్నిచోట్లను జరిపించే యేర్పాట్లేవిధంగా సాధ్యమగును. ఇటువంటి ఆలోచనల భారముతో బసకేగితిని. అప్పటికి మూడు రోజుల నుండి ఎడతెగని పనులతో నిద్రాహారములు సరిలేక ఎంతోబాధగానుంటున్న తరుణములో యీ భారము కూడా సంభవించుటతో నా పని చాలా దుర్భరమనిపించినది. అన్నిటికి దైవానుకూల్యత ప్రధానమనే నమ్మిక మాత్రము నన్ను వీడనందున సాయంకాల ప్రార్థన ముగించుకొని ఆలోచనలతో పరుంటిని. అపుడు కొన్ని మార్గములు గోచరించినవి.

అపుడు గుమాస్తాలను రోటరీ మిషన్ మొదలగు పరికరములతో రప్పించుకొని, నేనుపరుండియే కండ్లు మూసికొని స్ఫురించిన ఒక్కొక్క ఆలోచన ప్రకారం చెప్పి చేయించితిని. 1. జిల్లా యందంతట ఇరువది అయిదుగురు ఓవరుసీయర్లు కలరు. ఏ ప్రాంతమునందున్న వారికి ఆ ప్రాంతమునందలి టోలుగేట్లను క్రొత్త యిజారాదార్లకు మరుసటి సూర్యోదయము వేళకు వప్పగింతచేయుటకును ఆ సమయానికి యిజారాదారుగాని గుమాస్తాగాని లేనియెడల వచ్చేవరకు డిపార్టుమెంటలుగా వసూలు చేసి, వసూలుపైకముతో వాళ్లకు ఒప్పగించి రశీదు తీసుకు పంపవలసినదని

పుత్తరువులు వ్రాసి రోటరీ మిషన్ మీద సంతకముతో సహా కావలసిన కాపీలు తీయించితిని. 2) యిజారారేవులను ఆయా తాలూకా బోర్డు ప్రెసిడెంట్లు గాని అచటకి సమీపమునందున్న మెంబర్లుగాని ఎవరికి వీలగుచోట్ల వారికే ఏర్పాటుచేసి, రేవుయిజారా పాడిన క్రొత్తపాటదార్లకు మరుసటి సూర్యోదయమువేళకు వప్పగించుటకున్ను వాళ్లెవరు సమయానికి రానిచో, వచ్చేవరకు అయ్యేవసూలు సొమ్ముతో సహా వాళ్లకిచ్చి రసీదు పుచ్చుకు పంపవలసిందిగా వ్రాసి పై విధముగానే కావలసిన కాపీలు తీయించితిని. 3) లైసెన్సు ఫీజులు కట్టిన సర్వీసుబస్సుదార్లకు ఒక నెల వరకు టెంపరరీ పర్మిట్ ఇస్తూ నెలలోపలే మేము నియమించే వాయిదానాటికి హాజరై బస్సు తనిఖీ చేయించుకొని క్రమమైన లైసెన్సు తీసుకోవలసినదని వ్రాసి పై విధముగానే కావలసిన కాపీలు తీయించితిని.

అప్పుడా కాగితములను డిస్పాచీ గుమాస్తాలందరిచేతను వెంటనే తయారు చేయించి సర్వీసు బస్సుల ద్వారా ఆయా లైన్ల అనుకూలత ప్రకారం ఇచ్చి, ఆ రాత్రి తెల్లవారేలోపల ఎవరి కవర్లు వారికి సర్వు అయ్యేలాగున బందోబస్తుగా బస్సుల వాళ్లకుచెప్పి ఇప్పించితిని. ఏ బస్సులో ఏ కాగితము యిచ్చి పంపినది వ్రాసి వాళ్ల చేత సంతకాలు చేయించుకొనబడెను. ఏ బస్సువాళ్లైన యివ్వడములో లోపము జరిగిన యెడల వాళ్ల లైసెన్సులకు ఇబ్బంది వస్తాదేమోనని భయంతో వాళ్లందరు సరిగానే సకాలములో ఆ కాగితములను బట్వాడా చేసి మా ఆఫీసుకు రసీదు పంపిరి. అన్ని చోట్ల నుండి సక్రమంగా జరిపినటుల రశీదులు, రిపోర్టులు చేరినవి. పశ్చిమ గోదావరి జిల్లాలోకే జిల్లా బోర్డుగనుండుటచే పని జాస్తిగానుండేది.

పరిపాలనా విధానమునందలి పూర్వానుభవముగాని, తర్ఫీదుగాని లేకున్నను, పల్లెటూరు నివాసులైనను, సామాన్య విద్యావంతులైనను ఏ లోపము లేకుండా సక్రమ విధానాములతో చక్కని యోచనలు గలిగి, తమ విద్యుక్తధర్మములను మిగుల సమర్ధతతో నిర్వహించగలవారున్నారని, అంతకుముందు అధికారములోనున్న బస్తీ నివాసులైన విద్యావంతులగు వారందరు గ్రహించగలిగిరి. సామాన్య ప్రజానీకమునందు కూడా మిగుల తెలివిగల పరిపాలనాదక్షత గల సమర్ధులున్నారనే గమనిక గలిగి అప్పటి పరిపాలనా రిపోర్టుల మీద తృప్తికరమగు సదభిప్రాయములనుల్లేఖించిరి. బోర్డు పరిపాలనారీత్యా ఆయా సందర్భాలలో జరిగిన చర్యలన్నింటిని విపులీకరించి వ్రాసినచో గ్రంథ విస్తరమగునని తలచి ఇంతటితో దీనినాపివేసి తర్వాత కథనారంభించెదను.

## మళ్లీ జిల్లా బోర్డు ఎన్నికలు

1927 సంవత్సరమున బందరు తాలూకా బోర్డు ఎన్నికలలో చల్లపల్లి నియోజకవర్గం స్థానమునకు నేనొక అభ్యర్థిగా ఉంటిని. ఆ ఒక్కస్థానమునకు అభ్యర్థులము ఏడుగురము. నాతో మంచి పోటీ అనుకున్న కంఠమనేని వెంకటరంగయ్యగారిని అప్పటి చల్లపల్లి రాజాగారైన శ్రీమంతు రాజా అంకినీడు ప్రసాద్ బహదూర్ గారు చాలా ప్రోత్సహించి పోటీ చేయిస్తున్నారు. రాజాగారిని నేను చూచినపుడు అప్పటికే రంగయ్యగారికి తాను మాట యిచ్చినానని ఆయన తన క్లాస్‌మేట్ అని సమాధానం చెప్పిరి. స్వతహా వారి మనసులో నేను తాలూకా బోర్డుకు రావడము సుతరాము యిష్టము లేదు. పిమ్మట కొద్దిరోజులకు ఓట్ల ప్రచారము కొరకు నేను చల్లపల్లిలో నుండగా రంగయ్యగారొక లేఖ వ్రాసి పంపిరి. "కొన్ని కారణముల వలన ఈ దఫాకు తానుమానుకున్నానని తనకిచ్చెదమన్న వారి ఓట్లు కూడా నేనే సంపాదించుకొని జయము పొందవలెనని తాను కోరుతున్నా"నని వ్రాసి పంపెను.

పిమ్మట రాజాగారిని వారి మేడలోనే దర్శించితిని. వారు నన్ను చూడగానే తనను ఓట్లడుగుటకే వచ్చితిననే

భావముతో “రంగయ్య గారు మానుకుంటామన్నారు, నీ సంగతి నాకు జ్ఞాపకము లేక మాలెంపాటి వెంకటకృష్ణయ్య గారికిస్తానన్నాను. ఇపుడు మార్పుగా చెపితే నన్ను బద్దీకునిగా నిందిస్తారు. తొందరపడి ముందుగా మాట యిచ్చితినని నీవేమీ అనుకోవద్దు” అని నమ్రతగా నచ్చజెప్పినారు. అందుమీదట నేను మీ ఓట్ల కొరకు రాలేదు. నేనెందుకు వచ్చితిననగా? మీ నివాస స్థానమున్ను, మీ పరగణా రాజధానిన్ని అయిన చల్లపల్లిలో జరిగే ఎన్నికలలో మీ యిష్టమునకు వ్యతిరేకముగా నిలిచి నేను గెలుపొందినచో, మీ మనసునందలి అయిష్టత వల్ల కలిగే కక్షతో ముమ్ముందేవైనా అపకారములు నాకు తటస్థించునేమోననే సందేహము నా మనసునందేర్పడి తన్నివారణార్థమై మీవద్దనే అన్ని సంగతులు తేల్చుకోదలచివచ్చితిని. నేను బోర్డులో ప్రవేశించుట మీకు నిశ్చయంగా మనసారా యిష్టములేని యెడల నాతోనే స్పష్టముగా చెప్పివేయండి నేను బుద్ధిపూర్వకముగ మానివేసెదను. దానితో ఓట్ల ప్రచారబాధ తప్పిపోతుంది. ఈ పదవిలో నా స్వలాభమేమీలేనందున మానుకొనుటలోనాకెట్టి సంకోచము నుండబోదు అని స్పష్టీకరించగా, దానికి జవాబుగా వారు నాతో “I am the last man to say so” అని చెపుతూ నన్ను ముఖ్యముగా నిలువ వలసినదేనని ప్రోత్సహకరముగా, ఎన్నికలు జరిగిన మరుక్షణము నుండి నా యెడల తాము ఎట్టి ద్వేష భావములు వహించనని, ఎన్నికలలోనేను గెలుపొందగానే తానే ముందుగా నన్నభినందించెదనని కూడా చెప్పెను.

అప్పటికి ఎన్నికల వ్యవధి ఆరురోజులు మాత్రమే కలదు. ప్రచారము కొక కారు అద్దెకు మాట్లాడి బందరు నుండి తెప్పించితిని. ప్రచారము సక్రమముగానే జరిగినది. ఎన్నికల ప్రచారములో నాకు వ్యతిరేకముగ రాజాగారు వారి శక్తికొలది ప్రచారము చేయించడము, తన స్వంత పలుకుబడి నంతను వినియోగించి పెక్కుమందికి తానే స్వయముగా చెప్పడముతోను నేను గెలుచుట కష్టతరమని తోచినది. ఎన్నికల సందర్భములో జమీందారీ సెంటరగుటను ఏ అల్లరులు జరుగకుండునటులనేర్పాటు చేయించగోరి జిల్లా కలెక్టరుగారికి ముందుగానే వ్రాసితిని. అందుకు ఆయన మేజిస్ట్రేటును పోలింగు ఆఫీసరుగాను సర్కిల్ ఇన్‌స్పెక్టరును సబ్ రిజిస్ట్రారును అసిస్టెంట్సుగాను నియమించిరి. మీ స్వస్థానములో ఏ అల్లరి జరగకుండునటుల చూడవలసిన బాధ్యత మీకు కూడా కలదని జమీందారుగారికి కలెక్టరుగారు హెచ్చరించి వారికొక లేఖ వ్రాసిరి. అందువల్ల ఆనాడు అల్లర్లు ఏమీ జరగలేదు.

పోలింగు నాటి ఉదయము ఎనిమిది గంటలయ్యేసరికి మా కారు డ్రైవరు నావద్దకు వచ్చి టైరు చెడినదని కొత్త టైరు బెజవాడ వెళ్లితెచ్చుకొనుటకు సొమ్ము కావలెనని విచారము నటించి అడిగెను. ఈ మోసమునకు కారణము బహిరంగమునకేమీ కనిపించకపోయినను అందరు బాహాటముగానే చెప్పుకొనిరి. నేను బాడిగకు మాట్లాడుకొన్న జట్కాను నాకు దొరకకుండా వేరే పన్నాగము పన్నిరి. చివరకు ఒంటెద్దు బండి కూడా దొరకనందున కాలినడకయే గతియైనది. మొత్తం మీద సాయంకాలమునకు ఎన్నికల పోలింగు పూర్తిచేసుకొని పెట్టెలు సీళ్లు వేసి పోలీసు బందోబస్తుతో ఆ రాత్రి బందరు పంపివేసిరి. ఓట్లు లెక్కించిన రోజున మధ్యాహ్నం వరకు రాజాగారి పార్టీకే గెలుపనుకొనిరి. మొత్తం ఓట్లన్ని లెక్కించుట పూర్తియగుసరికి జయము నాదేనని ప్రకటించబడెను.

రాజాగారు లోగడ నాతో అనియున్న ప్రకారము తమ గుర్రపు బండిని పంపి నన్ను రప్పించుకొని అభినందించిరి. అపుడు వారు నాతో సంభాషించుతూ, తమతో నమ్మకముగా చెప్పినవారందరూ వ్యతిరేకముగా ఓటు వేసినారని అందువల్ల నేను గెల్చుట తటస్థించినదని, తన వద్ద మాట్లాడిన వారి మాటలలోగల “చిత్తం, చిత్తం” యొక్క అర్థము తనకు బాగా తెలియవచ్చినదని చెప్పిరి. పిమ్మట వారున్నంతకాలము నన్నెంతో గౌరవముతోనే చూచుచుండిరి.

## డిస్ట్రిక్ ఎడ్యుకేషనల్ కౌన్సిలు ప్రెసిడెంటుగా బాధ్యతలు

ఆ విధముగా ఎన్నికలలో గెలుపొంది 1927 సంవత్సరము తిరిగి బందరు తాలూకా బోర్డు సభ్యుడనైతిని. ఆ తాలూకా బోర్డు నుండి కృష్ణా డిస్ట్రిక్టు ఎడ్యుకేషనల్ కౌన్సిలుకు పంపవలసిన ఇద్దరు ప్రతినిధులలో నన్నొకరిగా నెన్నుకొనిరి. దానితో నేను డిస్ట్రిక్టు ఎడ్యుకేషనల్ కౌన్సిల్ మెంబరుగా ప్రవేశించితిని. డి.ఇ.సి.లో ప్రతి తాలూకా బోర్డు నుండిన్ని, జిల్లాలోగల ప్రతి మునిసిపాలిటీనుండిన్ని, ఇద్దరిద్దరుగా వచ్చే ప్రతినిధులున్ను, (Ex. Officio) ఉద్యోగరీత్యా మెంబర్లుగా, జిల్లా కలెక్టరు, జిల్లా ఎడ్యుకేషనల్ ఆఫీసరు మహమ్మడెన్ స్కూళ్ల యినస్పెక్టరు, గరుల్సు రేంజి ఇన్‌స్పెక్టర్‌సలున్ను, 1. కనడియన్ బాప్టిస్టు మిషన్ (సి.బి.ఎం.) 2. రోమన్ కాథలిక్కు మిషన్ (ఆర్.సి.ఎం.) 3. ఇండియన్ క్రిస్టియన్ మిషన్ (ఐ.సి.ఎం.), 4. చెర్చిమిషన్ (సి.ఎం.ఎస్) 5. ముక్తి సైన్యము (సాల్వేషన్ ఆర్మి) ఈ అయిదు సంస్థల నుండివచ్చే అయిదుగురు ప్రతినిధులు నాన్‌మిషన్ ఎయిడెడ్ స్కూళ్ల తరపున వచ్చెడి యిద్దరు ప్రతినిధులు కలిసి మొత్తం 32 మంది మెంబర్లతో నేర్పడియుండెను. దానికి అధ్యక్షుడుగా అప్పటి కృష్ణా జిల్లా కలెక్టరు A.R.C. West Lake I.C.S. గారుండిరి. ప్రెసిడెంటుగారొకనాడు తనకు గల వ్యవహార భారములను వ్యక్తపరచిరి.

కౌన్సిలు ప్రెసిడెంటు, వైసు ప్రెసిడెంటు పదవులను ఎన్నికకు పెట్టెదనని సూచించగా దానికి సభ్యులందరు సమ్మతించిరి. తేది నిర్ణయించి బెజవాడ మ్యూజియం హాలులో ఎన్నికల మీటింగు జరుప నిశ్చయించిరి. ఆనాడు మీటింగు వేళకు ముందే బెజవాడలో ధన్వాడ అనంతం గారి బంగళాలో సభ్యులు చాలామంది సమావేశమై ఒక నిశ్చితాభిప్రాయమునకు వచ్చిరి. ఆ ఏర్పాటులో డా॥ ధన్వాడ శ్రీరామచంద్రరావు, ఎం.ఎ., ఎం.డి. ప్రెసిడెంటుగాను, నేను వైసు ప్రెసిడెంటుగాను అచటి వారందరు నిర్ణయించిరి. పిమ్మట అటు నుండి మేమందరము మీటింగు హాలు చేరితిమి. అచటకు వచ్చిన మిగతా మెంబర్లు కూడా దీనికి అనుకూలించిరి. కలెక్టరుగారి మీటింగుటైముకు వచ్చిరి. ఎన్నికలు జరిగేటపుడు చాలా చోట్ల శాంతి భంగమునకు కలహ ప్రదముగ నుండుట సంభవించుచుండునటులబట్టి పోలీసుల సహాయము కావలసివచ్చునేమోనని కలెక్టరుగారు తగు జాగ్రత్త వహించిరి.

ఎన్నికల మీటింగు ప్రారంభించగానే సభ్యులందరు ఏకాభిప్రాయముతో పై నిర్ణయమును ప్రెసిడెంటుగారికి తెలియజేసిరి. వారపుడాశ్చర్యచకితులై కౌన్సిల్ సభ్యుల ఐక్యత నెంతో శ్లాఘించిరి. ఆ విధముగా నేను డి.ఇ.సి. వైసు ప్రెసిడెంటునైతిని. పిమ్మట డా॥ ధన్వాడ శ్రీరామచంద్రరావుగారికి కృష్ణా జిల్లా బోర్డు ప్రెసిడెంటుగా నుండెడి పదవీ కాలము పూర్తి అయినందున దానితోపాటు డి.ఇ.సి.యందున్న ఎక్స్-అఫీషియో మెంబరు పదవిన్ని, దానితోపాటుగా డి.ఇ.సి. ప్రెసిడెంటు పదవిన్ని ముగింపైనవి. అపుడా పదవికి సభ్యులందరు ఏకాభిప్రాయులై నన్నెన్నుకొనిరి. నా స్థానమునందు వైసు ప్రెసిడెంటుగా నాధవర్ఝుల సరస్వతీ నాగభూషణం అనే ఆమెను ఎన్నుకొనిరి. ఆ విధముగా కృష్ణా డిస్ట్రిక్టు ఎడ్యుకేషనల్ కౌన్సిలర్ ప్రెసిడెంటునైతిని.

### తలతిక్క సెక్రెటరీ

విద్యావంతులైన సభ్యులతో విద్యా విషయమైన చర్చలు జరుపవలసిన అట్టి సభా నిర్వహణ చల్లా కష్టతరమేనని ఒప్పుకొందును. ఈ కౌన్సిల్ ఆఫీసు బందరులోనుండెను. బందరు రేంజి డిప్యూటి యిన్‌స్పెక్టర్ యీ కౌన్సిల్‌కు సెక్రటరీగా నుండెను. ఆఫీసు పనులలోనేగాక మీటింగు సమయంలో కూడా తర్జుమా పనులు అగత్యములయ్యేవి. నేను పనిలో చేరగానే ముందుగా అప్పటి డి.ఇ.సి. సెక్రటరి పార్సీ రాఘవేంద్రరావుగారిని వారి బసలో చూచివచ్చితిని. దానిని

ఆయన అపార్థము చేసుకొని, ప్రెసిడెంటు పెద్ద విద్యావంతుడు కానపుడు తనకు లోబడి నడవక తప్పదని అందువల్లనే తనను ముందుగా చూచితినని భావించి నన్ను చాలా నిర్లక్ష్యముగాను, లోకువగాను చూడసాగెను. ప్రథమ దశలోనే వరుసగా మూడు మీటింగులకు సెక్రటరీ హాజరుకాలేదు. అందువల్ల చాలా కష్టమనిపించినను అదివరకు వైసు ప్రెసిడెంటుగా నాకు గల అనుభవమును బట్టి వెల్తి లేకుండానే సమర్థించితిని. మీటింగులకు రాని కారణములు తెలుపగోరితిని. ఆయన భార్యకు వైద్య సహాయమునకై తాను దగ్గిర వుండవలసిన అగత్యము కలిగినదని యింకా ఏవో కొన్ని కారణాలతో తాను రాలేదని తెలిపినాడు. మీటింగు తేదీలలో ఏదైనా శలవు కోరియున్నాడా? డ్యూటీలోనున్నాడా? అని డి.ఇ.ఒ. ఆఫీసుకు వ్రాయగా సెలవు కోరలేదని జవాబు వచ్చినది. ఆ కాగితములను బట్టి ఆయన చర్యలు గవర్నమెంటుకు తెలిపితే ఉద్యోగ భంగమువచ్చునని తలచి అప్పటికి నిదానించితిని.

పిమ్మట ఒకనాడు గవర్నమెంటుకు వెళ్లవలసిన ఒక డ్రాఫ్ట్ (ముసాయిదా)ను అప్పటి అగత్యమును బట్టి (తాను వ్రాయవలసినదానిని) నేనే వ్రాసి ఆఫీసుకు పంపితిని. ఫెయిర్‌కాపీ (సాఫు ప్రతి)ని సెక్రటరీ సంతకము చేసి డిస్పాచికి పంపడం ఆచారమైయుండగా తాను సంతకము చేయక నావద్దకే తిరిగి పంపెను. సంతకము చేయని కారణము ఏమని? లిఖితముగా ప్రశ్నించితిని. దానికి కారణమొకటి కాదని (For not one reason) జవాబువచ్చెను. (May I know your reason) నీ కారణములను నేను తెలుసుకోవచ్చునా? అని మరల ప్రశ్నించితిని. (I reserve my reasons) నా కారణములు చెప్పేవి కావనెను. (So long you conceal your reason, I insist you to sign on the paper) నీ కారణములు నీవు దాచియుంచునంతకాలము, కాగితము మీద సంతకం చేసి తీరవలసినదిగా విధించుచున్నానని వుత్తరువు పంపితిని. దానిమీద సంతకము చేసిపంపి, ఆ వెంటనే గవర్నమెంటుకు తానొక రిపోర్టు నంపెను. తానుండగా తన సహాయము కోరక ప్రెసిడెంటు స్వయంగా డ్రాఫ్ట్ వ్రాసినాడని ఏమేమో వ్రాసిపంపెను. గవర్నమెంటు నుండి వచ్చిన లేఖలో దీనికి కారణమడిగిరి. అపుడు పై గ్రంథమంతా వివరిస్తూ ఆయన ప్రవర్తననుగురించిన రికార్డు నకళ్లు టైపు చేయించి గవర్నమెంటు పరిశీలనకు పంపితిని. వెంటనే రాఘవేంద్రరావుగారిని వెంకటగిరికి ట్రాన్సుఫర్ చేసి 24 గంటలులోగా వెళ్లవలసిందిగా టెలిగ్రాఫ్ ద్వారా ఆర్డరు పంపిరి. ఆయన భార్య అప్పటికే చనిపోయినది. కుమార్తెను ప్రసూతికి బందరు రప్పించినాడు. ఆ సమయంలో ట్రాన్సుఫర్. దానితో కంగారు పడి వెంటనే మదరాసువెళ్లి డైరెక్టరు ఆఫీసులో ట్రాన్సుఫరు వల్ల తనకు గల కష్టములను గురించి చెప్పుకొనెను. ప్రెసిడెంటుగారి వద్దనుండి నిన్ను గురించి మంచి జవాబేదైనా వస్తేనే తప్ప ఏమి సహాయము చేయ వీలులేదని తేల్చి చెప్పిరి. దానిమీదట తిరిగి నావద్దకే వచ్చి పశ్చాత్తాపముతో క్షమార్పణకోరి తన కష్ట నివారణోపాయమునకై అర్థించెను. దానిమీదటాయనను తగినరీతిని మందలించి, తిరిగి గవర్నమెంటుకు నేను వ్రాయుటతో డి.ఇ.సి. సెక్రటరీకి మీరు విధించిన శిక్షను తగ్గింపుచేయగోరుతున్నాడు. నాకంటే ముందుగా తానే మీకు రిపోర్టు చేసిన మీదట, నేను నిజమును దాచియుంచక యదార్థతను స్పష్టీకరించుట తప్పనిసరియైనందున తనకు తానే హాని కారకుడైనాడు. అతనిని శిక్షింపచేయుటయేనాయుద్దేశ్యమైనచో అతనిని గురించి ముందుగా వ్రాసి నేనే పంపియుందును. ఆ శిక్షనే కొంత తీవ్రత తగ్గించిన చాలునని నా తలంపు అని తెలియజేయగా దానిమీదట దగ్గరలో ఏలూరుకు మార్చిరి. అయితే మీటింగు హాజరు కాని నెలలకతనికిచ్చిన Fixed T.A. ప్రయాణ భత్యం తిరిగి గవర్నమెంటుకు జమకట్టవలెననిరి. దానితో ఆయనకు బాగా తెలిసివచ్చినది. ఆయన చాలా విద్యాప్రవీణుడు.

సీనియరుద్యోగి అయినను తన స్వాతిశయ గర్వము వలన తన స్థితినంత దూరము వరకు తెచ్చుకొనెను.

**నూతన పాఠశాలలు**

గొల్లపల్లి జమీందారు శ్రీమన్నారాయణ అప్పారావుగారు నూజివీడు తాలూకా బోర్డు ప్రెసిడెంటుగనుండేవారు. ఆయా గ్రామస్తుల అర్జీలను బట్టి ఆ బోర్డు యిలాకా కొన్ని గ్రామాలలో నూతనముగా పాఠశాలలు పెట్టించి రికగ్నిషన్ దరఖాస్తులు పంపియుండిరి. వాటిలో బాలుర పాఠశాలలవి డి.ఇ.ఓ. ద్వారాను, బాలికా పాఠశాలలవి గరల్స్ రేంజి ఇన్‌స్పెక్టరు ద్వారాను సిఫారసుతో మాకు (డి.ఇ.సి) వస్తే మేము రికగ్నిషన్ యివ్వడమో, నిరాకరించడమో చేయుచుండుట విధాయకము. ఆ కాగితములు మాకు డిపార్టుమెంటు ద్వారా మాకు రావడములోగాని మేము రికగ్నిషన్ శాంక్షన్ చేయుటలోగాని ఆలస్యమైనచో, యిలోగా తాలూకా బోర్డు ఆఫీసు ఆడిట్ తనిఖీ జరిగే యెడల, రికగ్నిషన్ కాని వాటికయ్యే ఖర్చును సర్‌చార్జీ చేసి ప్రెసిడెంటు వద్ద వసూలు చేయుదురు. అందుకు జడిసి నూజివీడు తా॥బో॥ ప్రెసిడెంటుగారు అప్పటి బందరు తాలూకా బోర్డు ప్రెసిడెంటు గొట్టిపాటి బ్రహ్మయ్య సమేతముగా వచ్చి వారికి గల కష్టములను వివరించిరి.

నేను కౌన్సిల్ ప్రెసిడెంటుగా రావడముతోనే యిది తటస్థించినది. ఆ సంగతులు వారి వల్ల వ్రాతమూలముగా తీసుకొని, అందుకు సంబంధించిన ఆఫీసర్లకు త్వరలో రికగ్నిషన్ దరఖాస్తులు పరిశీలించి ఆలస్యము చేయక రిమార్కులతో మాకు పంపవలసిందిగా వ్రాస్తూ ఆ విషయమును ఆ నెల కౌన్సిల్ మీటింగు అజెండాలో చేర్పించితిని. కౌన్సిలు మీటింగు నాటికి ఆయా ఆఫీసుల నుండి ఆ రికగ్నిషన్ దరఖాస్తులు రానేలేదు. ఎపుడు పంపే సంగతి జవాబు వ్రాయనులేదు. వారు కాగితములు పంపనిది కౌన్సిల్ రికగ్నేషన్ చేయజాలదని, అందువల్ల ప్రెసిడెంట్లకు సర్‌చార్జీ తగలక తీరదని, యీ వ్యవహారమంతా వారితోనే వున్నదనే ధీమాతో బుద్ధిపూర్వకముగా ఆ కాగితములు పంపుటకు సాచివేత చేసినారని తలచితిని.

ఈ విషయమునంతను ఆనాటి మీటింగులో సభ్యులకు విశదపరచి, "ఈ దిగువ గ్రామాలలో స్కూళ్లు పెట్టుటకు అంగీకరామునొసగడమైనది" అనే తీర్మానమును కౌన్సిల్‌నందంగీకరింపబడిన పిమ్మట దాని కాపీని ఆయా బోర్డు ప్రెసిడెంట్లకు పంపితిరి. దానితో వారికి సర్చార్జీ భయము తీరినది. తీర్మానము తమ యిష్టమునకు వ్యతిరేకముగ నున్నదనే ఈర్షతో, దీనిని పురస్కరించుకొని అప్పటి డి.ఇ.ఒ. చావలి సూర్యప్రకాశరావు డైరక్టర్‌గారి ద్వారా గవర్నమెంటుకు వ్రాసినదేమనగా: డిపార్టుమెంటుద్వారా రికగ్నిషన్ దరఖాస్తులు డి.ఇ.సి. ఆఫీసుకు రాకముందే ప్రెసిడెంటు రికగ్నేషన్ తీర్మానములు చేయుచున్నాడని, ఆ తీర్మానములు రద్దుపరచవలసినదని తెలిపియుండెను. దానిమీద నన్ను జవాబీయగోరిరి. నేను రికగ్నేషన్ కాగితములు ఆలస్యము చేయక పంపగోరి ఆయా ఆఫీసర్లకు తగిన వ్యవధితో తెలియజేసి ఆ సంగతినే మా అజెండాలో చేర్పించితిని. ఎవరును మీటింగు నాటికి కాగితములు పంపనులేదు. ఎపుడు పంపగలిగినది జవాబు తెలుపనులేదు.

తాలూకా బోర్డు ప్రెసిడెంట్లు మాకు వ్రాసుకున్న సంగతులను విచారించి, ఆయా చోట్ల స్కూళ్ళు పెట్టుకొనుటకంగీకారమొసగుతూ తీర్మానించినది నిజమే. అది పర్మిషన్ కాని, రికగ్నేషన్ కాదనేది ఆ మీటింగునందు పాల్గొన్న మన డి.ఇ.ఒ. గారికిని తెలియును. ఆ తీర్మానము యొక్క ఉద్దేశ్యము, ఆయా బోర్డులకు ఆడిటు అబ్జక్షన్స్ లేకుండా చేయుటయే. ఆ స్కూళ్లను గురించిన డిపార్టుమెంటల్ రిపోర్టు రాగానే పరిశీలించి ఉండదగిన రికగ్నిషన్

ఇవ్వడము, లేనివాటిని మూసివేయించడము, శాంక్షన్ చేయవచ్చును. పర్మిషన్ లేనిది స్కూళ్లు పెట్టుటకెట్లా సంభవమో? స్కూళ్లు పెట్టనిదే ఏమి చూచి రికగ్నేషన్‌కు సిఫారసు చేయవీలగునో గోచరించుట లేదు. పబ్లిక్ ప్రజాసంస్థయైన తాలూకా బోర్డుకు క్రొత్త పాఠశాలనారంభించుటను అనుమతించుటకు కూడా డి.ఇ.సి.కి అధికారము లేదనే సందర్భములో, అట్టి తీర్మానమును రద్దు చేయుటకంటే మా కౌన్సిల్‌నే రద్దు చేయుట చాలా ఉత్తమము. తానొక కౌన్సిల్‌లో హాజరుండిన్ని జరిగిన చర్చలలో పాల్గొని తీర్మానమును తెలిసికొనియుండిన్ని జిల్లా విద్యాశాఖాధికారియగు ఆ పెద్ద విద్యావంతుడు ఇట్టి అర్థరహితమైన వ్యర్థపు వ్రాతలతో అమూల్యమగు కాలమును వ్రయపరుచుట ఎంతో విచారకరము. దీనిని గురించిన సవిస్తరమంతా ఆయన వల్లనే మీరు తెలుసుకోగలరు. యీ నా జవాబును చూచిన మీదట గవర్నమెంటువారు డైరెక్టరు గారి ద్వారా డి.ఇ.ఒకు వ్రాయుటలోను స్వయంగా హాజరుండిన్ని తీర్మానమును సరిగా అర్థము చేసుకొనకనే, తొందరపడి అనవసరంగా యిట్టి వ్రాతలతో కాలహరణము చేయుట తగదని మందలించిరి. అప్పటి ఆ రికగ్నిషన్ దరఖాస్తులు దాఖలైన పిమ్మట ఏ ఆఫీసులో ఎంత కాలము నిలవయున్నది సంజాయిషీ తీసి పంపవలసినదిగా డి.ఇ.ఒ.గారిని కోరిరి. దానితో కొంత దూకుడు తగ్గి శాంతమునకు దిగినది.

బందరు తాలూకా మునిపల్లెలో ఆది ఆంధ్రనైటు స్కూలులో టీచరు, మేనేజరు (హరిజనుడు) రికగ్నిషన్ దరఖాస్తు పంపుకొనెను. ఆ స్కూలును మామూలు పద్ధతిగా డిప్యూటి ఇనస్పెక్టరుగారు పరీక్షించి గ్రాంటు అంకెను సూచించెను. అయినను ఎందువల్లనో, దానికిని, దానితోపాటు మరియు అయిదు స్కూళ్లకును రికగ్నిషన్ యివ్వకుండుటకు డి.ఇ.ఒ.గారు తన అనంగీకారపు లిస్టును పంపెను. మా ఆఫీసులో అప్పటి హెడ్డుగుమాస్తా గిడుగు సూర్యనారాయణ టీచరుతో షరీకు అయికమ్మాగా, మునిపల్లెలో ఆ మేనేజరు పేరనేగల పగటి పాఠశాల గ్రాంటుతో చేర్చి ఒకే చెక్కు వ్రాసి కాగితముల తొందరలో నాచే సంతకము చేయించి బట్వాడా చేసెను. సొమ్ము వానికి ముట్టిన పిమ్మట ఒకనాడు నిమ్మళంగా యీ సంగతి నాతో చెప్పినాడు. అపుడు గుమాస్తా చేసిన పనికి చాలా కోపమే కలిగినది. నన్ను మభ్యపెట్టి యిప్పించినందుకు ఆ గ్రాంటు మొత్తమును గుమస్తా జీతమునుండి రాబట్టి తగు ఉత్తరువును చేయుదునంటిని. దానితో ఆయన చాలా భయపడసాగెను. ఆయన సంసారము జరుగుబాటు తక్కువ. పిల్లలు గల కుటుంబము. ఆయన సోదరుడు గిడుగు రామమూర్తిగారి పేరు ప్రతిష్ఠల అండవల్లనే యీయనకీ యుద్యోగము లభించినది. ఆయన సోదరుడనే పేరువల్లనే యీనను కనికరించుటకు కారణము. అప్పటి నా కోపమును గ్రహించి పశ్చాత్తాపముతో యదార్థత నొప్పుకొని వెంటనే క్షమించగోరెను.

నా మనసునందాలోచించుకొనగా, ఆది ఆంధ్రగూడెములలో చదువు చెప్పే వాళ్లు దొరకడం అరుదు. సంవత్సరమంతా చదువు చెప్పిన తర్వాత స్కూలు పరీక్షించి, అసెస్‌మెంటు నిరూపించి, ఎందువల్ల రికగ్నేషన్ నిరాకరణ లిస్టుపంపినారు. జిల్లా విద్యాశాఖాదికారి అభిప్రాయమును తెలియగోరి నేనొక లేఖ వ్రాసితిని. ఆ లిస్టు దాఖలా ఆరుస్కూళ్లకు రికగ్నిషన్ యిచ్చుటకు అంగీకరించదలచకపోయినను, కనీసం మునిపల్లె ఆది ఆంధ్ర నైటు స్కూలు ఒకటైనా అంగీకరించవలసియుండునని, గ్రాంటు యిచ్చివేయబడినదని, గనుక దీనిని గురించి ప్రత్యేక పరిస్థితిగా ఆలోచించవలసినదని వివరించితిని. నా వ్రాతనే ఆధారముగా తీసుకొని డి.ఇ.ఒ గారు నామీద దండయాత్రకు తనకు తగిన అదను దొరికినదని, సంతోషముతో వెంటనే డైరెక్టరు ద్వారా గవర్నమెంటుకు రిపోర్టు చేసెను. దానిలో నాన్ అఫిషియల్ ప్రెసిడెంటు ప్రొసీజరుకు విరుద్ధముగా రికగ్నిషన్ కాని స్కూలుకు గ్రాంటు యిచ్చివేసెనని, దానిని ఆస్తిలేని

ఆది ఆంధ్ర టీచరు వద్ద నుండి ఎట్లా రికవరీ చేయగలడో తెలిసికొమ్మని, ఒకవేళ గ్రాంటు యిప్పించదలచినను, సదరు గవర్నమెంటు జి.వో. ప్రకారము అన్ ట్రయిన్డు టీచరుకు సప్లిమెంటరీ గ్రాంటు యిచ్చుట నిషేదము గనుక రికవరీ తప్పదని ఘాటుగా వ్రాసిపంపెను. దాని మీదట గవర్నమెంటువారు నాకీ సంగతులను తెలుపుతూ సంజాయిషీ కోరిరి.

దానిని చూడగానే వ్రాసినదేమనగా రికగ్నిషన్ విషయము కౌన్సిల్ తీర్మానము చేయవలసియున్నదని, అది నిరాకరింపబడే సందర్భములో మాత్రమే రికవరీ ప్రశ్న ఉదయించగలదని, అపుడు మీకు జవాబు వ్రాయుదునంటిని. పిమ్మట దానిని అజెండాలో చేర్చితిని. కౌన్సిల్ మీటింగులో చర్చకు వచ్చినది. అపుడు డి.ఇ.ఓ.గారు కూడా వున్నారు. జిల్లా కలెక్టరుగారు ఇంకా మిషనరీలు మొదలగు సభ్యులందరు కలరు. నేను తీర్మానమునుపక్రమించి చెప్పుటలో, బీదరికముతో ఏమీ ప్రతిఫలమివ్వలేని ఆది ఆంధ్ర పల్లెలో విద్యావసరమున్న చోట అడ్వాన్సు గ్రాంటు యిచ్చియైనా టీచరును ప్రోత్సహించి స్కూలు నెలకొల్పవలసిన విధియైయుండగా, సంవత్సరమంతా తన స్వంత ఖర్చుతో స్కూలు నిర్వహించిన పిమ్మట, డిపార్టుమెంటల్‌గా యినస్పెక్షన్ చేసి సరియైన రిమార్కులతో ఎసెస్‌మెంట్ నిర్ణయించి పిమ్మట, రికగ్నిషన్ నిరాకరించవలసినదిగా చెప్పడం డి.ఇ.ఒ.గారిది చాలా అన్యాయమనిన్ని, ఎందువల్ల నిరాకరించుచున్నది జవాబు చెప్పవలసిన బాధ్యత వారియందే కలదని చెప్పితిని.

నెం.6, జి.ఓ. ప్రకారము గ్రాంటు యిచ్చుట నిషేదమని చెప్పిరి. ఆ జి.ఓ. యందలి పర్యవసానం అన్ ట్రయిన్డు టీచరుకు సప్లిమెంటరీ గ్రాంటు యివ్వకూడదనేదైయున్నది. అది దీనికి వర్తించదు. ఎటులననగా: టీచరు సెషన్ స్కూలు సర్టిఫికెట్‌గల వాడగుటను అన్‌ట్రయిన్డు టీచరుగా పరిగణింపబడును. నియమానుసారముగ సకాలమునందు దాఖలు చేయబడిన ఒకే దరఖాస్తు అగుటవలన సప్లిమెంటరీ కానేరదు. గనుక నెం.6 జి.ఓ దీనికి ఏ విధమునను వర్తించదు అని స్పష్టీకరించితిని. అపుడు జిల్లా కలెక్టరుగారు మాట్లాడుతూ "ఒక సంవత్సరమునకు టెంపరరీ రికగ్నిషన్ మంజూరు చేయవలసినదిగా" తీర్మానమును చేయగోరెను. దీనితో ప్రస్తుత సందిగ్ధ సమస్య తొలగిపోగలదని, రాబోవు సంవత్సరం విద్యాశాఖాధికారిగారి మాట ప్రకారమే చేయవచ్చునని, ఇపుడిచ్చిన గ్రాంటుపై ప్రెసిడెంటుగారు రికవరీ చేయవలసిన ప్రసక్తి వుండదని, అందువలన ఉభయుల యుద్దేశ్యములు నెరవేరినట్లే కాగలదని మధ్యవర్తిత్వము వహించి చెప్పిన మీదట కౌన్సిల్ సభ్యులందరు దానికి సమ్మతించి ఆ విధముగానే తీర్మానించిరి.

దీనిని గవర్నమెంటుకు తెలుపుతూ ఇదివరకలో యీ జిల్లాలో వేర్వేరు రేంజీలలో ఆరు చోట్ల జి.ఒ. కు విరుద్ధముగా డి.ఇ.ఓ.గారు మాకు పంపిన వ్రాతలననుసరించి గ్రాంటు యిచ్చిన ఉదాహరణలు కనుపరచెడి స్టేటుమెంటును పంపితిని. అందును గురించి సంజాయిషీ చెప్పి సర్దుబాటు చేసుకొనుటకెంతో శ్రమపడిరి. అయినను దాని ఫలితముగా డి.ఇ.ఓ.గారిని మందలింపు చేయడమేగాక ఒక సంవత్సర కాలము ఇంక్రిమెంటునాపిరి. దానితో డి.ఇ.వో గారు యిటువంటి చర్యల వల్ల కలిగే లాభమును బాగా గుర్తించగలవారైరి. ఈ సమయమున మా ఆఫీసు అప్పటి గుమాస్తా గిడుగు సూర్యనారాయణ మీద నాకు కలిగిన అనుమానముననుసరించి మరియొక ప్రదేశమునకు ట్రాన్సుఫర్ చేయించి, కనగాల సీతారామయ్య నిచటకు రప్పించితిని. దానితో ఆఫీసునందలి అవకతవకలు నశించినవి.

కడవకొల్లులో అరిగెపూడి వెంకటరామ చౌదరి గారి మేనేజిమెంటులో నూరుమంది విద్యార్థులు అయిదుగురుపాధ్యాయులతోనొక హయ్యరు ఎలిమెంటరీ స్కూలు కలదు. దానికి డి.ఇ.ఓ.గారి నిర్ణయ ప్రకారమొక సంవత్సరమున అయిదుగురు టీచర్లకు గ్రాంటునిచ్చితిమి. మరు సంవత్సరము విద్యార్థుల సంఖ్య 120 వరకు

హెచ్చినది. కాని ఎందువల్లనో ఆ సంవత్సరపు డి.ఇ.ఓ. గారి, రిపోర్టులో నలుగురు టీచర్లకు మాత్రమే గ్రాంటునిచ్చుటకు సిఫారసు చేసిరి. గ్రాంటు మొత్తమును పెంచుటకు తగ్గించుటకు మాత్రమే కౌన్సిల్ ప్రెసిడెంటు కధికారము కలదు. టీచర్ల సంఖ్యను నిర్ణయించుట, డి.ఇ.ఓ.గారి అధికారములోనిది. కాగా, నేను, మేనేజ్‌మెంటుకు నష్టము రాకుండా కాపాడవలెననంటే, గ్రాంటు మొత్తమును పెంపు చేసి నలుగురు టీచర్లకే ఆ మొత్తమునునిచ్చునటుల శాంక్షన్ చేయవచ్చును. అట్లా చేయుటకు నా మనసుకిష్టములేక అయిదుగురు టీచర్లకు గ్రాంటును యిచ్చితిని. దానిని గురించి డి.ఇ.ఓ. గారికి నా మీద ఆగ్రహము కలిగి, డైరెక్టరు ద్వారా గవర్నమెంటుకు రిపోర్టు చేసెను. తన అధికారమును నేనాక్రమించి రూల్సుకు విరుద్ధముగా అయిదవ టీచరు గ్రాంటు నిచ్చితినని, దానిని రద్దు చేసి ఆ సొమ్ము రికవరీ చేయించవలసిందని ఆ రిపోర్టునందు ఉదహరించెను.

దానిని గురించి గవర్నమెంటు నన్నడిగిన సంజాయిషీలో నేను వ్రాసిందేమనగా:– అదే స్కూలుకు అదే ఆఫీసరు క్రిందటి సంవత్సరము నూరుమంది విద్యార్థులున్నపుడు అయిదుగురు టీచర్లకు గ్రాంటునిప్పించవచ్చునని, యీ సంవత్సరం 120 మంది విద్యార్థులకు నలుగురు టీచర్లు మాత్రమే చాలుననడం, క్రమ విరుద్ధమని స్పష్టమగుచున్నది. ఈ సందర్భములో డిపార్టుమెంటు ఆఫీసర్ల ప్రవర్తన అనుమానించతగినదిగా తోచి, దీనిని మీ నోటీసులోనికి తేదలచి, అధికార విభజన తెలిసియుండిన్ని యీ మార్గమునవలంభించితిని. విద్యార్థుల సంఖ్యాభివృద్ధిని చూచియుండిన్ని ఒక టీచరును తగ్గించమనుటలో తనకు గల కారణమును స్పష్టీకరించి గవర్నమెంటుకు నచ్చచెప్పవలసిన బాధ్యత ఆయనయందే కలదుగనుక విచారించి ఆమీదట, రికవరీ అగత్యమని గవర్నమెంటు నిర్ణయించేయెడల మేనేజిమెంటునుండి అయిదవ టీచరుకిచ్చిన గ్రాంటును తిరిగి వసూలు చేయుదును. జిల్లా విద్యాశాఖాదికారి, బాధ్యతా రహితముగను నిరకుంశముగ యిటువంటి అవకతవకలు చేయుటతో, డిపార్టుమెంటుకును దానితోపాటు ప్రభుత్వమునకు అవమానకరము కాగలదని నేను విశ్వసించుచున్నాను. తగు విచారణ జరిపిన మీదట ఆయన ప్రవర్తన సరిదిద్దుటవసరమనిన్ని, నా చర్యను సమర్థించడమో, వ్యతిరేకించడమో తెలియగల ప్రభుత్వపు వుత్తరువులననుసరించి నా పరిపాలనా పద్ధతులను సక్రమ పరచుకొనుటకెన్నడు వెనుదీయనని వ్రాసితిని.

దానితో డి.ఇ.ఓ. గారికి ఘట్టి మందలింపుతోపాటు ఆయన ఆక్టింగును ఖాయము చేయుటకొక సంవత్సర కాలము నిలిపియుంచిరి.నా చర్యలను గురించి (స్పెషల్ కేస్)గా భావించి దీనిని రూల్సు నుండి మినహాయించితిమనిరి. దానితో అదివరకు నాయందు డి.ఇ.ఓ.గారికి గల నిర్లక్ష్యత, దురాగ్రహము మొదలగునవన్ని అంతరించి, అంతటి నుండి సలహా, సంప్రదింపులతో పరిపాలనా విషయములలో కలిసిరాక తప్పనందున ఏకీభావముతోనే మెలగుచుండిరి. తమ విద్యాధిక్యతను మాత్రమే దృష్టియందుంచుకొని ఎదుటవారి సమర్ధతను గుర్తించక నిర్లక్ష్యము చేసినందువల్ల కలిగిన ఫలితమే దీని పర్యవసానము.

కృష్ణా జిల్లాలలోని లోకల్ బోర్డు మునిసిపాలిటీ అజమాయిషీలోని స్కూళ్లు గాక మిగతా ప్రాధమిక పాఠశాలలకు గవర్నమెంటు వారిచ్చే గ్రాంటు, సుమారు 3 లక్షల రూపాయలకు లోగా నుండేది. ప్రతి సంవత్సరం గవర్నమెంటు బడ్జెటులో ఆయా జిల్లాల పరిస్థితులకు తగినట్లుగా గ్రాంటు మొత్తములను నిర్ణయించి ఆ మొత్తమును గవర్నమెంటు లెక్కలనుండి తీసి, డిస్ట్రిక్టు ఎడ్యుకేషన్ కౌన్సిల్ పేర (అలాట్ చేసి) జమ కట్టేవారు. దానిని జిల్లాలోని ప్రాధమిక పాఠశాలల పరిస్థితులను బట్టి విద్యాశాఖాధికారులు పంపెడి సలహాలను పరిశీలించిన మీదట, కౌన్సిలు ఆమోదించిన

నిర్ణయం ప్రకారం అయ్యే గ్రాంటు మొత్తమును, ఆయా స్కూళ్ల బిల్లులను బట్టి చెక్కులు యిచ్చే విధానముండెడిది. ప్రతి సంవత్సరం మార్చి నెలాఖరు సాలాఖరుగా నిర్ణయించుకొని, ఆ తేదీనాటికి చెక్కులు యివ్వగానిల్చియున్న నిలవ పైకమును ఏప్రిల్ మొదటి తేదీన కౌన్సిల్ లెక్కల నుండి ప్రభుత్వపు లెక్కలలో జమకట్టు ఆచారము కలదు. ఏవైనా తకరార్లవల్లనో రిపోర్టులు రావడము ఆలస్యం వల్లనో అప్పటికి గ్రాంటు చెక్కులు ఇవ్వని స్కూళ్ల తాలూకు గ్రాంటు పైకము తిరిగి గవర్నమెంటుకే చేరేది. పిమ్మట తకరార్లు లేని సరియైన రిపోర్టులు రాగానే ఆ గ్రాంటునిచ్చుటకు కొత్తసంవత్సరపు మంజూరైన సొమ్ములోనుండి యివ్వవలసిన వచ్చేది.

ఆ సంవత్సరం మంజూరయ్యే సొమ్ము ఆ సంవత్సరమునకు కావలసిన మొత్తమునకు మాత్రమే సరిపోవునటులనుండెడిది. దానిలోనుండి పాత బాకీల కొరకు కొంత తీసుకొనుటవల్ల ఆ సంవత్సరమీయవలసిన మొత్తములకు తక్కువయ్యేది. ఆ తగ్గుదల పైకమును అన్ని స్కూళ్లమీద నిలవరించి జనరల్ కట్ అనే పేరుతో మినహాయించి యిచ్చేవారు. దానితో చాలా గగ్గోలు పుట్టేది. ఉపాధ్యాయులు చాలా అందోళనచేసేవారు. నేను ప్రెసిడెంటు పదవికి రాగానే ముందుగా దీనిని గురించి ఆలోచించితిని. అన్ని స్కూళ్లకు మా లెక్కల ప్రకారం మార్చి నెల 31 తేదీనాటికి చెక్కులు యిచ్చుటవలన మా ఛితా (క్యాష్‌బుక్)లో ఆ పైకమంతా ఖర్చు కనిపించేది. మా వద్ద నుండి ట్రెజరీకి అడ్వైజ్ లిస్టు పంపబడిన చెక్కులకు మాత్రమే సొమ్ము ముట్టేది. తక్కిన వాటికి అనగా, తకరార్ల వల్ల మేము లిస్టు పంపని చెక్కులకు అ తకరార్లు తీరిన పిమ్మట మాకు సరియైన రిపోర్టు రాగానే లిస్టు పంపితే అపుడా చెక్కు మార్చుకొని సొమ్ము తెచ్చుకునేవారు. అంతవరకు ఆ బాపతు పైకము మా పేరనే ట్రెజరీలో నిలవయుండెడిది. ఏప్రిల్ మొదటి తేదీకి మా వద్దనున్న చిఠా దాఖలా నిలవ మొత్తము మాత్రము గవర్నమెంటుకు వాపసు అయ్యేది. అందువల్ల పాత బాకీలు, కొత్త సంవత్సర బడ్జెటు సొమ్ములో తీసియివ్వవలసిన పంథా తప్పినది. అందువల్ల జనరల్ కట్ అనేది నా హయాంలో ఎన్నడు అగత్యము రానేలేదు. పైకమును పంచుటలో మిగిలితే ఆ మొత్తమును కొన్ని మంచి స్కూళ్లకు స్కేలు కంటే అదనపు గ్రాంటుగా నిచ్చెడివారము. దీనినంతను తెలుసుకొనిన ఉపాధ్యాయులందరు చాలా కృతజ్ఞతలు వెల్లడించిరి.

ఒక పల్లెనుండి ఆదిఆంధ్ర స్కూలుకు రికగ్నేషన్ దరఖాస్తు వచ్చినది. అచటనదివరకొక సి.బి.ఎం. స్కూలున్నదని అందువల్ల దీనికి రికగ్నేషన్ ఇవ్వకూడదని ఆ మిషనరీ అభ్యంతరము చెప్పెను. కౌన్సిల్లో చర్చించి రికగ్నేషన్ శాంక్షన్ చేయబడెను. దానిని రద్దు చేయించగోరి ఆ మిషనరీ, డైరెక్టరుతోను గవర్నమెంటుతోను విన్నవించుకొనెను. దానిని పునరాలోచించవలసినదని గవర్నమెంటు నుండి మాకు శ్రీముఖం వచ్చినది. కౌన్సిలు రూల్సును బట్టి మూడు మాసములు అనంతరం దానిని పునరాలోచనకై అజెండాలో చేర్చితిని. కౌన్సిలు తిరిగి చర్చించి, పునరాలోచన చేసిన మీదట తిరిగి దానినే ఖాయం చేసితిమని తీర్మానించిరి. Reconcidered and Reaffirmed ఆ తీర్మానపు నకలును గవర్నమెంటుకు పంపితిని. అది చూచి గవర్నమెంటువారు నా అభిప్రాయమును కౌన్సిల్ యొక్క ఉద్దేశ్యమును స్పష్టీకరించగోరిరి. దానికి నేను వ్రాసిన దేమనగా:- (ఒకే ప్రదేశంలో వేరువేరు మిషనరీలు, వేర్వేరుగా స్కూళ్లు పెట్టి, రికగ్నేషన్ చేయించుకున్న ఉదాహరణలు కొన్ని చూపించి) ఒకే మతమునకు చెందిన మిషనరీలు వారి వారి శాఖాబేధముల ప్రకారం ఆర్.సి.ఎం. స్కూలున్నచోటనే, సి.బి.ఎం. వేరొక స్కూలుంచడం, సి.బి.ఎస్. స్కూలున్న చోటనే సి.బి.ఎం. వేరొక స్కూలుంచడం పూర్వము నుండి జరుగుతూనే ఉన్నది. ఆ స్కూళ్లను ఐక్యపరచగలిగినచో రెండు

స్కూళ్లలోని టీచర్లు ఒకే చోట విద్య బోధించుట వలన ప్రతి క్లాసుకు ఒక ప్రత్యేక ఉపాధ్యాయుడేర్పడి విద్యాభివృద్ధికి చాలా అనువుగా నుండగలదు. ఆ ప్రకారము కలిపి వేయదగిన స్కూళ్ల లిస్టు నిందుతో పంపుతున్నాను. గనుక ఈ విషయమై ఆయా మిషనరీల అభిప్రాయమును తెప్పించుకొని ముందుగా ఆ పాఠశాలనైక్యపరచడం సముచితమనిన్ని, అపుడు యీ ఆది ఆంధ్ర స్కూలు కూడా వాటివలెనే రెండవ దానితో కలిపి వేయడము సాధ్యమేనని, అది జరిగే వరకు యీ స్కూలు రికగ్నేషన్ మంజూరు చేయడము యుక్తమేనని బాగా ఆలోచించి తీర్మానించబడినదని సమాధానము వ్రాసితిని.

దానిని చూచిన మీదట మిషనరీలతో సంప్రతించి గవర్నమెంటు తిరిగి ఏ సంగతి మా కౌవున్సిలుకు చెప్పనులేదు మా తీర్మానమును రద్దు చేయనులేదు. ఉన్నతాధికారులందరు మిషనరీలకు, జాతిమతముల రీత్యా సన్నిహితులగుటవలన తమ మాట చెల్లించుకోవలసినపుడు నేరుగా వెళ్లి చెప్పి చేయించుకొనె అలవాటును బట్టి అప్పుడప్పుడు వుయ్యూరు నందున్న కనెడియన్ బాప్టిస్టు మిషనరీ రెవరెండు గార్డెన్ గారు యీ ప్రకారము జరిగించిరి. కానీ ఏమి చేయుటకు వారి సంగతులచే వారికి అడ్డము వచ్చుటచే వీలులేక ఉపసంహరించుకొని మిన్నకుండిరి. పరిపాలనా సందర్భమున తటస్థించిన సంఘటనలన్నీ వివరించదలచిన గ్రంథ విస్తరమే కాగలదు. 1927 సం॥రము నుండి 1930 సం॥వరకు గల డి.ఇ.సి. అడ్మినిస్ట్రేషన్ రిపోర్టును దానిని గురించిన ప్రభుత్వాభిప్రాయమును చూచిన పరిపాలనా సౌహార్ధము సుబోధము కాగలదు. దీనినంతటితో నాపి మరల కథకువత్తుము.

## ప్రాసిక్యూషన్ కథ

కొక్కిలిగెడ్డ గ్రామము దగ్గర పాతకర అనే పేరుతో కృష్ణ వరద కట్ట వుండేది. దానికొక వంతెన, తూము, తలుపులు అమర్చి దాని నుండి దిగువకు సుమారు మూడు మైళ్లకొక కాలువ ద్వారా వరదనీటిని ఆరణి వారి చెరవులోకి నింపి దానితో మాగాణి పండించేవారుట. ఆ కాలువను యీదులకర అనే పిలిచేవారు. దరిమిలా కొంతకాలానికి దానినే మురుగునీటిపారుదల సౌకర్యమునకు పయోగింప వీలుగా చేసుకొనిరి. జమీందారీ గ్రామాలలోనిదగుటను యీ కాలువ మీద అధికారమును జమీందార్లే వహించేవారు. ఇట్లుండగా ఇమ్మానేని నరసింహ రావు నాయుడుగారు దివి తాలూకా తహసీలుదారుగా వచ్చినారు. నాతో జిల్లా బోర్డు వైసుప్రెసిడెంటు పదవికి పోటీ చేసిన ఇమ్మానేని సీతారామరావు నాయుడుగారి కుమారుడే యీయన. ఆ తాహసీలుదారుగారి హయాములో మోపిదేవి నందలి చేబ్రోలు నాగయ్య, కంఠంనేని అచ్చయ్యగార్లమీద మా యూరి కాపురస్తుడగు రావి రామచంద్రయ్య యీదులకర పోరంబోకులో మట్టి త్రవ్వినందుకు 'బి'ఫారం కేసులు పెట్టించి పదేసి రూపాయలు అపరాధము విధింప జేసియుండెను.

అదేవిధంగా నామీద కూడా కేసులు పెట్టించదలచి సదరు రామచంద్రయ్య, తాహసీలుదారుతోను, రెవిన్యూ ఇనస్పెక్టరు అడిదం వెంకటరత్నం గారితోను శ్రద్ధగా చెప్పి యీదులకర నుండి ప్రజలకు హానికరమగు విధముగా మట్టి త్రవ్వించి నా చేలో వేసుకొన్నటుల 'బి'ఫారం తయారుచేయించి ప్రాసిక్యూషనుకు సిద్ధపరిపించెను. దానిని తహసీలుదారు వ్రాసిన ప్రకారం ప్రాసిక్యూషన్ అమలు జరుపుటకు అంగీకారమును పొందగోరి బందరు రివన్యూ డివిజనల్ ఆఫీసరు గారు కృష్ణా జిల్లా కలెక్టరుగారికి పంపిరి. ఆ కాగితములు పరిశీలించి చూచి అప్పటి జిల్లా సిరస్తాదారు దామోదరం మొదలియారుగారు ఆ కాగితములను తిరిగి ఆర్.డి.ఓ. గారికి పంపుతూ త్రవ్వినవారి నుండి సంజాయిషీ తీసుకొననిదే ప్రాసిక్యూషన్ చేయగోరుట అక్రమమని రిమార్కు వ్రాసిరి. దానిమీదట నన్ను విచారించదలచి

నోటీసు పంపిరి. కొత్తపేట బంగళావద్ద విచారణ ఆరంభించి నన్ను పిలిచి సంజాయిషీ కోరిరి.

త్రవ్విన ప్రదేశము, విచారణాధికారులకు సంబంధము కాదనిన్ని, లోకల్ పంఢ్, పి.డబ్యు.డి., జమీందారీ కమ్యునల్ పోరంబోకలు మాత్రమే నాన్ గవర్నమెంటు గ్రామాలలోనుంటివని, రివిన్యూ పోరంబోకులు గవర్నమెంటుకు సబంధించినవేవీ వుండవని గనుక యీ విచారణ అనగత్యమని చెప్పితిని. ప్రజలు ఫిర్యాదు చేయనిది మేజిస్ట్రేటుగా విచారించుటకైనా అనగత్యములేదనిన్ని, ఒక వేళ విచారించదలచినను ముందు ఫిర్యాదిని విచారించనిదే ముద్దాయి స్టేటుమెంటునీయనక్కరలేదని చెప్పితిని. దానిమీదట దివి తాహసీలుదారిని పిలిచి సాక్ష్యమడిగిరి. ఆయన తాను వ్రాసిన దానికనుకూలముగా వాంగ్మూలమిచ్చెను. క్రాసు పరీక్షకు నా కవకాశమీయబడెను. నేనడిగిన ప్రశ్నలకు ఆయన చెప్పిన జవాబులను బట్టి తేలిన సారాంశమేమనగా :– ఆ త్రవ్విన ప్రదేశము కాలువలోనిదేనని, రోడ్డు వంతెన వద్దనుండి తూర్పునకు కలదని, ఎగువ నుండి కాలువ ద్వారా వచ్చే నీరు రోడ్డు వంతెన గుండా యీ త్రవ్విన కాలువ ప్రదేశమునుండే దిగువకు పోవలసియుండునని వంతెన అడుగున గల చప్టాకంటే యీ త్రవ్విన ప్రదేశమెంత లోతున్నది తాను చెప్పలేనని, తాను వెళ్లినపుడు నన్ను పిలిపించలేదని, నా వల్ల సంజాయిషీ పుచ్చుకొననేలేదని, రోడ్డుమీద నున్న వంతెనపైన గుర్రము మీదనుండే చూచితినని, లోతుగానున్నటుల కనిపించినదని చెప్పెను.

దానిమీదట నేను ఆర్.డి.ఓ.గారితో చెప్పిన దానిలో తాసీల్దారుగారు తనకులోతుగా కనుపించినదన్నది రోడ్డు యొక్క ఎత్తున్న వంతెనపైన గల ఎత్తున్ను ఆపైన గుర్రము ఎత్తున్ను, ఆపైన తాను కూర్చున్న ఎత్తున్ను కలిపి మొత్తమంతా లోతుగా కనిపించియుండవచ్చును. నేను వంతెన చప్టామట్టమునకు ఆరడుగులోతు మాత్రమే పెట్టి, త్రవ్వించితినని ఆ లోతు ప్రమాదకరము కాజాలదని, నేను చెప్పిన లోతును గురించి సందేహించనక్కరలేదని, ఇపుడు ఆర్.డి.ఓ.గారు స్వయముగా ఆ ప్రదేశమును చూచి లోతును గురించి లెవెలు చూపించి పరిశీలించవచ్చునని దానితో నిజస్థితి స్పష్టముగ తెలియగలదని చెప్పితిని. నా మాటలన్ని విని, నీవు చెప్పినదంతా నిజమని నమ్ముతున్నాను. కాని ఆ త్రవ్విన మట్టిగట్టున వేయక నీ చేలో వేసుకున్న కారణమేమని అడిగెను. ప్రక్క చేలనుండి పెద్ద వర్షాలకు కొట్టుకొనివచ్చి కాలువలో పేరిన మట్టిని రైతులు త్రవ్వి తిరిగి ఆ చేలోనే వేసుకొని లెవెలు భర్తీ చేసుకొనుట మామూలుగా జరుగుతున్న ఆచారమే. అయితే సర్కారు ఖర్చుతో పూడిక తీయించి కాలువ మరమ్మతు పనులు చేయించినపుడు మాత్రం గట్లకు వేయడం విధాయకముగా జరుగుతుంటుంది అని జవాబు చెప్పితిని. (Your prosecution is given up) నీ ప్రాసిక్యూషన్ వదులుకోవడమైనదని తీర్పు చెప్పిరి.

నేను వచ్చేటప్పుడు ఆర్.డి.ఓ.గారు పిలిచి "చాలా గడుసుతనంగా మాట్లాడితివేమని" అడిగిరి. నిజమును అధికార్ల యెదుట జంకు లేకుండా స్పష్టముగా చెప్పనిది వారి చిత్తమునకు విశదం కానేరదని ఆ విధముగా చెప్పితిని. నరసింహారావు నాయుడుగారు నన్ను చూచి యీ సంగతులన్ని తనతోనే చెప్పితే బాగుండేది కదాయనిరి. ఈ విచారణ ముందుగా మీరే చేసియున్నచో నేను మీతోనే చెప్పియుందునంటిని. ఆ వ్యవహారమంతటితో అచట ముగిసినను రావి రామచంద్రయ్య మాత్రము ఊరుకొనలేదు. దీనినే తిరిగి జమీందారీ ఎస్టేటు మేనేజరు వద్ద విచారణకు తెచ్చెను. మందపాటి లక్ష్మీనారాయణగారు అప్పటి మేనేజరు. ఆయన, ఎస్టేటు అనుమతిని పొందకుండా, మీకు మీరే మట్టి త్రవ్వించడం ఎస్టేటు హక్కును ఉల్లఘించుటగా ఏల భావించకూడదో చెప్పగోరిరి.

ఈదులకర మురుగు కాలువలోని పూడిక తీయించగోరి చాలా అర్జీలు ఎస్టేటుకు పంపుకొనియుంటిమనిన్ని,

రాజాగారితో కూడా స్వయముగా చెప్పుకొని యుంటిననిన్ని, ఎన్నాళ్లకూ వారి వల్ల ఆపని నెరవేర్చబడనందున మాపైర్లకు మురుగు యిబ్బందిని తొలగించుకొని పంటలు బాగా పండించుకొనుటకై ఆయా రైతులము ఎవరి చేల బారులో వారము కాలువ పూడిక తీసి బాగుచేసుకున్నామని చెప్పితిని. ఆ త్రవ్విన మట్టిని మీ చేలో వేసుకోవడమెందుకని అడిగిరి. ఆ పేరినమన్ను కాలువ కిరుప్రక్కలనున్న చేలలో నుండి వర్షమువల్ల కొట్టుకువచ్చి పేరుకున్నదేగనుక మళ్లీ ఆ చేలోకే ఆ మన్ను తిరిగి చేర్చుకున్నాము కాలువ హక్కును మేము కోరడము లేదు అని సమాధానమిచ్చితిని. ఆ చేసేపని మా పర్మిషన్ పొంది చేయవలసినదేకాని మీకు మీరుగా ఎన్నడూ చేయకూడదని మందలింపసాగిరి. దానికి ప్రత్యుత్తరముగా, రైతులు పండించే పైర్లకు వీలుగా కావలసిన సౌకర్యములు చేయక నిరాకరించినా, ఉపేక్షించినా, ఎస్టేటు సన్నదులోని షరతుల ప్రకారం ఎస్టేటుదార్లు ప్రవర్తించినందుకు రైతులు చర్యకు దిగితే, అపుడు ఎస్టేటుదార్లు పనియేమవుతుందో ఆలోచించుకొని మమ్మున మందలించడం భావ్యమని చెప్పితిని. ఉభయుల మంచిని కోరి సౌమ్యతగా మాట్లాడుటకు బదులుగా చాలా తీవ్రతలోకి దిగడం భావ్యం కాదని ఇక ముందు మీరట్టి పనులేవీ తలపెట్టినను పర్మిషన్ పొందవలెనని, లోగడ జరిగినదానికి వారేమీ చేయదలచలేదని చెప్పి ముగించిరి.

## మధ్య నిషేద ఉద్యమం

మత్తు పదార్ధ నిషేదమును గురించి ఇంగ్లండు నందు విక్టోరియా రాణిగారి చిన్న కొమారుడు లియోపాల్డు ప్రభువు (ప్రిన్స్ లియోపాల్డ్) ఉద్యమము నారంభించి ప్రబోధము సాగించిన కాలములో మన దేశమునందును మద్య నిషేదమును గురించి ప్రచారము బాగానే సాగుచుండెను. కృష్ణా జిల్లా మద్య నిషేధ ప్రచార సంఘమునకు (బందరు ప్లీడరు) వల్లూరి సూర్యనారాయణరావుగారు ప్రెసిడెంటుగాను, నేను వైసు ప్రెసిడెంటుగానుండేవారము. అపుడొక సందర్భములో కాంగ్రెస్ వర్కర్లు అవనిగడ్డలో మీటింగు చేయదలచి దండోరా వేయించిరి. ఆ దండోరా వేసిన మాదిగవానిని తన బసకు రప్పించి తాలూకా తాహశీలుదారుఇమ్మానేని నరసింహారావునాయుడుగారు, దండోరా వేసిన తప్పెటకు చిల్లి పొడిచి పంపివేసెను. ఆ మాదిగవానికి ఆ తప్పెట ఖరీదు కాంగ్రెస్ వారే భరించి క్రొత్త తప్పెటనిప్పించిరి. ప్రజలలో తాసీల్దారు ప్రవర్తనను గురించి కొంత ఆలజడి బయల్దేరి గ్రామాలలో వ్యాపించినది.

ఇట్టి స్థితిలో తాసీల్దారుగారపుడొక గ్రామమునకు సర్వ్యూట్ వస్తామని మామూలు ప్రకారం తనకు తగిన బస వసతులేర్పరచి తగు సన్నాహముతో సిద్ధముగనుండవలసినదని ఆ గ్రామ మునసబు కరణముకు కబురు చేసిరి. అపుడా గ్రామ పెద్దలు ఆలోచించుకొని ఒక నిర్ణయము చేసుకొని మునసబు కరణములతో చెప్పియుండిరి. తాసీల్దారుగారు వచ్చి తన బస ఎక్కడని అడిగెను. దానికి నిమ్మళంగా జవాబు చెప్పనారంభించిరి. చాలా ప్రయత్నించి చూచితిమని గ్రామంలో ఖాళీ ఇళ్లేవి లేవని, సత్రము మొదలైనవేవీలేవని, ఏమి చేయుటకు తోచలేదని చెప్పిరి. దానితో ఆయనకు కోపము వచ్చి మునసబుగారిల్లెక్కడనని అడిగెను. అచటకే వెళ్లుటకు నిశ్చయించుకొని బయల్దేరెను. తమరు సమ్మతించే యెడల అభ్యంతరము లేదని చెప్పి, వారినచటికి వెంటబెట్టుకొని వెళ్లి చూపించిరి. అది తాటి ఆకుల పైకప్పుతో చుట్టూ అన్ని వైపులా దళ్లున్ను, యింటి ముందున్న పందిరిలో గేదెదూడ, కుడితి కుండలు, తాటి గింజలు, నులక మంచము మొదలగునవన్ని చూచి చాలా అసహ్యించుకొని, ఇదేమి ఇల్లు మునసబూ, కరణంగారి యింటికైనా వెళ్లుదము దారితీయమనెను. అచట నుండి కరణంగారింటికి వెళ్లిరి. అది పెంకుటిల్లు. రోతగాలేదు. ముందు వెనుక వసారాలు గల ఒకే గర్భగది గల ఇల్లు. వెనుక వసారా వంట చేసుకొనుటకు భోజనములకు, గది సామానులకు నివాసమునకు,

ముందు అరుగుమీద గల వసారా కొట్టులో బహిష్టైయున్న స్త్రీ నివసించుటకు మాత్రమే చోటుంది. సరిపోయిన ఖాళీ ఏమీ కనిపించలేదు. వసారా అరుగుమీద నుండుటకు యింట్లోవారి రాకపోకలకు యిబ్బంది గనుక వీలుపడదు. ఏమీ తోచక నిలిచి ఏదో ఆలోచిస్తుండగా గుర్రపు సఫరు వచ్చి, వెట్టివాడు గుర్రానికి కట్టిగొయ్య తెమ్మంటే తేవడం లేదని తాసీల్దారు గారితో చెప్పెను. ఆ వెట్టివానిని కోపము కొలదీ తిట్టి, ఎందుకు తేలేదని అడిగెను. ఆ వూళ్లో కట్టుగొయ్యలమ్మే దుకాణం లేదని, తమ వద్ద లేవని, ఎచట తెమ్మనేది చెపితే తెస్తానని భయభక్తులతో వినయ విధేయతలతో చెప్పసాగెను. ప్రస్తుతం టెలిగ్రాం స్తంభానికి కట్టవచ్చునని చెపితే గుర్రపు సఫరు వినడము లేదని వెట్టివాడు చెప్పుకొనెను.

అపుడు గత్యంతరమేమీ కనుపించక వెంటనే గుర్రమునెక్కి మరియొక గ్రామమునకు తరలిపోయెను. కాని తనమనసులో మాత్రం దీనికంతకు ఏదో కారణముండక తీరదని తలచెను. ఇట్లుండగా అబ్కారీ వేలంపాటల వాయిదా వచ్చినది. చల్లపల్లిలో పోలీసుస్టేషన్ వద్ద వేలం జరుగుతుంది. బందరు నుండి డిప్యూటీ కలెక్టరుగారు వచ్చి వేలం వేస్తారు. ఆనాడు మేమందరము, అబ్కారీ వ్యతిరేక ప్రచారమునకు చల్లపల్లి వచ్చెదమని తెలిసి తాహశీల్దారుగారు ఇన్‌కంటాక్సు విచారణ నిమిత్తం తన వద్ద చల్లపల్లి మకాములో హాజరుకమ్మని ఆనాటి వాయిదాతో నాకొక నోటీసు పంపినారు. అప్పట్లో రివెన్యూ అధికార్లే ఇన్‌కంటాక్సు విచారణకూడా చేసేవారు. నేనెటూ వెళ్లదలచియే యున్నందున ఆనాడు చల్లపల్లి వెళ్లి తాహసీల్దారుని చూచితిని. సాయంత్రం 5 గం॥లకు విచారిస్తానని వాయిదా వేసెను. నేనచట నుండి నా పనికి వెళ్లితిని.

ఆ నాటి మా ప్రొగ్రాము ప్రకారము నేను పోలీసుస్టేషనుకు ఎదురుగా పరిశె నాగభూషణంగారి అరుగుమీద మకాముగనుంటిని. కానూరి చిన వెంకట దాసయ్యగారు స్టేషన్ వీధిలో, స్టేషన్‌కు ఉత్తరముగా కొంత దూరమునకు కోడాలి ఆంజనేయులుగారు మహమ్మదీయుల ఇళ్లవైపున దక్షిణ వీధిలోను ప్రచార ప్రబోధము చేయసాగిరి. ఆ రెండుచోట్లను చాలా జనసమూహము చేరి ఆసక్తిగా వినుచుండిరి. తాసీల్దారుగారి సలహా ప్రకారం పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరుగారు కానూరు చిన వెంకట దాసయ్యగారిని సమీపించి ప్రజా సమూహము చేరుటవల్ల రహదారికి అభ్యంతరముగ నుంటున్నదని అచట నుండి వెళ్లిపొమ్మని చెప్పెను. అచట నుండి ప్రక్కయింటి అరుగుమీదకు వెళ్లి ప్రబోధము సాగించిరి. పోలీసువారు యింటి యజమానిని పిలిచి యింటి అరుగులమీదనుండి జనాన్ని పంపివేయకపోతే చాలా తంటా వస్తుందని బెదిరించగా అతను భయపడి వారినందరిని అచట నుండి కదిలిపొమ్మని బ్రతిమాలుచుండెను. ఆ జనము కూడా ఆంజనేయులుగారు చెప్పుతున్న చోటకు చేరుకొనిరి.

ఇట్లుండగా బందరు నుండి ఆర్.డి.ఓ. గారు చల్లపల్లి పోలీసు స్టేషన్‌కు వచ్చి పాటదార్లను గురించి విచారించగా వారందరు కోడాలి ఆంజనేయులుగారి ఉపన్యాసమును వినుటకు వెళ్లియున్నారని తెలిసి తానున్ను, తాసీల్దారున్ను , ఆ జనసమూహము వద్దకు వెళ్లిరి. కోడాలి ఆంజనేయులుగారదివరకు అవనిగడ్డలో స్టేషనరీ సబ్ మెజిస్ట్రేట్ కోర్టులో గుమాస్తాగా నుండుట తాసీల్దారుగారికి తెలుసును గనుక ఆయననొక సామాన్య వ్యక్తిగానెంచి తాను అదుపు చేయతలపెట్టెను. అపుడు ముందుగా తాసీల్దారు సంభాషణ నారంభించెను. ఆంజనేయులుగారు, మీపై అధికారి సమక్షమున మీరుజోక్యము కలుగజేసుకొని మాట్లాడుట అసమంజసమనెను. తాసీల్దారు కోపముతో "నోరుమూయ"మనెను (షట్ యువర్ మౌత్) తాసీల్దారుగారు నన్ను నోరు మూయమంటున్నారని తెలుగులో ప్రజా సమూహమునకు చెపుతూ ఆంజనేయులుగారు నవ్విరి. తాసీల్దారుగారు (వై డుయు లాఫ్) ఎందుకు నవ్వుతావని

గద్దించెను. ఆంజనేయులుగారు (To Laugh also a crime) నవ్వుట కూడా నేరమేనా? అని అంటుండగా ప్రజలందరు గొల్లున నవ్విరి.అపుడు ఆర్.డి.ఓ గారు తాను కల్పించుకొని మాట్లాడినదేమనగా:- తాను బందరు ఆర్.డి.ఓ.నని, అబ్కారీ వేలము నిమిత్తము వచ్చితినని, వేలంపాటదార్లలో చాలామంది యిచటనున్నారని తెలిసి వారిని పిలుచుట కొరకే యిచటకు వచ్చితిమని, అట్టివారున్నచో పోలీసు స్టేషన్ వద్ద అబ్కారీ వేలం జరిగే చోటుకి రాగోరుతున్నామని చెప్పి తిరిగి స్టేషనుకు వెళ్లిపోయిరి. డిప్యూటీ కలెక్టరు - తాసీల్దారు-అబ్కారీ పోలీసు సిబ్బందితో చాలాసేపు నిరీక్షించి ఎవరూ పాటకు రానందున పాటలు వాయిదా వేసుకొని తిరిగివెళ్లిరి. మా ఉద్యమ ప్రచారకులందరు ఆనాటికి విరమించి వెళ్లిరి.

నేను సాయంకాలం లోకల్ ఫండ్ సత్రంలోనున్న తాహసీల్దార్ వద్దకు వాయిదా ప్రకారం వెళ్లితిని. అపుడు నా యిన్‌కంటాక్స్ విచారణ జరగిన పిమ్మట తాను ఇష్టాగోష్ఠిగా అనధికార రీత్యా నాతో కొంతసేపు మాట్లాడదలచి తన కోర్కెను నాతో వెల్లడించెను. నేనందుకంగీకరించగా కొంతసేపు సంభాషించితిమి.

తాసీల్దారు : "మీవంటి వారి ఆసరా చూసుకొనిగదా ఆంజనేయులందరి యెదుట నన్నావిధంగా మాట్లాడుట?

నేను : ప్రభుత్వోద్యోగులైనంత మాత్రమున మీరు ప్రజావిరోధులు కానక్కరలేదు. మీ సక్రమ ప్రవర్తనయే మీ యెడల ప్రజల సద్భావ గౌరవములకు ఆస్కారము. గనుక మీ ప్రవర్తననొకసారి పరికించుకొనిన, మీకు మాత్రము దానికి గల కారణమేదైనది ద్యోతముకాదా?

తాసీల్దారు : దానిని మీరు దాచక చెప్పివేస్తే నేను త్వరగా జ్ఞప్తికి తెచ్చుకొనుటకు వీలగును.

నేను : అవనిగడ్డలో దండోరా వేసిన వాని తప్పెట చిల్లి పొడిచి యుంటిరి గదా! డప్పు వేయమన్నది కాంగ్రెస్ వారై యుండగా కూలి డబ్బులకాసించి వచ్చిన ఆ బీదవాని నేడ్పించుట కంటే, మీకు వీలుంటే కాంగ్రెస్ వారిమీదనే ఏదైనా చర్య తీసుకొంటే బాగుండేది గదా? అది మీ పేరునకెంత కళంకము తెచ్చినదో ఆలోచించుకోండి. తాలూకా అధికారిగా నుండి గ్రామంలోకి మకాము వెళితే మీకు బస దొరకక, గుర్రాన్ని కట్టుటకు సర్కారు టెలిగ్రాం స్తంభమే గతి కాదగిన స్థితికి వచ్చి భోజన వేళకు మరొక యూరికి వెళ్లిన సంగతి జ్ఞాపకము తెచ్చుకుంటే, అదంతా ఆ విధంగా ఎందుకు జరిగినది మీకే బోధపడగలదు. మీరెపుడు దారితప్పి నడిచెదరో, సక్రమ మార్గమునకు మిమ్మున త్రిప్పుటకు ప్రజలేదో పన్నాగము పన్నెదరు. అది విధాయకమేగదా!

తాసీల్దారు : మీవంటి ఆస్తిగల ధనవంతులు ప్రభుత్వమునెడల సహాయ నిరాకరణమునకు పూనుకొనినచో, ప్రభుత్వ రక్షణ లేకనే మీ ఆస్తికి ధనమునకుభద్రత ఎటుల కలుగగలదు?

నేను : కొన్ని గ్రామాలకొక చోట నొక పోలీసు స్టేషన్‌పెట్టినంతమాత్రమున దేశము నందంతటను శాంతి కలుగగలదని చెప్పజాలము. దేశమునందు నైతిక ధర్మములంతరించనంతవరకు కాలము క్రమముగానే జరుగుతుంటుంది. ఒక స్టేషనులోనున్న పదిమంది పోలీసులు రెండు పదుల గ్రామాలలోని ప్రజలందరి ఆస్తినెల్లపుడూ కాపాడుట నెలా సాధ్యమగును? ఒకప్పుడు పోలీస్‌స్టేషన్ వున్న, చల్లపల్లి గ్రామములోనే స్టేషను దగ్గరలోనున్న వరదా వెంకటరామయ్యగారి బట్టల దుకాణం పట్టపగలే దోపిడి చేయబడినది. స్టేషనులోని ఆయుధములను దోపిడిదార్లు హరించకుండా పోలీసులు జాగ్రత్తగా కాపాడకొనిరేగాని బట్టల దుకాణపు దోపిడి మాత్రం ఆపుదల చేయనేలేదు. దోపిడి అంతా పూర్తి

అయిన తర్వాత పోలీసులొచ్చి ఎంత సొత్తు పోయినది తెలిసికొని కేసు పెట్టి నడిపించినారు. అందుకుగాను మరికొంత ఖర్చు కూడా వరదా వెంకట రామయ్యగారికి తగిలినది. దోపిడి నష్టం రాకపోగా ఖర్చులు కూడా దండగైనవి. ఇదే విధముగానుంటుంది వారు చెప్పే రక్షణ, శాంతి భద్రతలును–

తాసీల్దారు : మీరట్లా అంటారుగదా! ఇంతకన్నా మిన్నగా పూర్వపు హిందూ రాజులు మాత్రం ఏమిచేసేవారు?

నేను : పూర్వపు హిందూ రాజుల పాలనలో దౌర్జనము – దోపిడీ జరిగినదని తెలియగానే రాజభటులు – అధికార్లు వచ్చి నష్టపడ్డవానిని విచారించి ఆదరించి కొంత నష్టపు సొమ్మునపుడే సర్కారు ఖజానానుండి యిప్పించి తిరిగి వెంటనే యధాప్రకారము వ్యాపారము సాగించుకొమ్మని చెప్పి, వారి వ్యాపారము నిరంతరాయముగా సాగునటుల కొంతకాలము వరకు ప్రభుత్వ రక్షక సహాయమునిచ్చి తోడ్పడెడివారు. పిమ్మట నేరస్తులెవరైనది విచారించి నిజమును తేల్చుకొని ఆ నేరస్తుల ఆస్తి నుండి ఆ దండుగ నంతను వసూలుచేసి, గవర్నమెంటిచ్చిన అడ్వాన్సు మాత్రం తీసుకొని మిగతా నష్టపూర్తికి దోపిడికి గురియైన వానికిప్పించెడివారు. అప్పటి పరిపాలనను ప్రజలు చాలా మెచ్చుకొనెడివారు.

యీ సంగతులున్ను ఇంకా కాంగ్రెస్ సంబంధమగు చాలా సంగతులను నావల్ల తెలుసుకొని ఆశ్చర్యముగా ఇవన్ని ఎట్లా మీకు తెలిసినవని నన్ను చాలా విడ్డూరముగా అడిగెను. అప్పటి నుండి ఆయన ప్రవర్తనలో కొంతమార్పు వచ్చినదని చెప్పవచ్చును.

## వ్యాపారంలో ఎదురైన సమస్యలు

పూర్వము నుండి మా సంసారమునకు వ్యవసాయము ప్రధాన వృత్తిగాయుంటున్నది. మా తండ్రిగారి హయాము నుండి ప్రవృత్తిగా వడ్డీ వ్యాపారము కూడా ఆరంభించబడినది. నా వ్యవహారారంభమునకు ఏడువేల రూపాయల వరకు ఖాతా వున్నది. రెండు వేల రూపాయలు రొక్కం నిలవున్నది. నేను కూడా సక్రమ పద్ధతులతో, నియమబద్ధముగ వడ్డీ వ్యాపారమును చేయుచునేయుంటిని. మంచి ఖాతాదారులు తటస్థించినను అతను కొరేదానికన్నా హెచ్చు మొత్తమునప్పిచ్చుటకు లేదు. బాకీ మొత్తమంతా ఒకేసారి తీర్చవలెననే కఠిన షరతులేదు. మూడు సంవత్సరములలోగా యిచ్చే వసూళ్లు అసలులోనే జమ వేసుకొనేది. ఆ పిమ్మట యిచ్చే వసూళ్లలో వడ్డీ క్రింద కొంతవేసి మిగతాది అసలులో వేసుకొనేది. బాకీదారుని పనుల కక్కుర్తికొద్ది వడ్డీ రేటు హెచ్చించుటనేది లేదు. ఎప్పుడూ ఒకే సాధారణ రేటు ఉండేది. ఋణవిముక్తికి బాకీ దారునికి కావలసిన సహాయ సంపత్తులు వీలైనవరకు చేసేది. ఎన్ని విధములుగా మంచి తనముతో ప్రవర్తించినా, కొందరు బాకీ దార్ల వల్ల కలిగించబడిన నష్టములు తప్పేవికావు. అట్టి స్వానుభవ కథలు కొన్ని చెప్పెదను.

మా యూరిలో మా పురోహిత కుటుంబ జ్యేష్ఠుడైన అడుసుమిల్లి ప్రకాశరావుగారికి పొలం శిస్తు వగైరాలకు కొంత సొమ్మునిచ్చి ప్రామిసరీ నోటు వ్రాయించుకొంటిని. ఆయన యింకా మరికొందరి వద్ద కూడా అప్పులు తెచ్చియుండెను. వారిలో ఒకరిద్దరు పెట్టుబడిదారులు దావాలు వేసి డిక్రీలు పొంది ఆస్తి వేలమునకు తెచ్చిరి. అపుడు ప్రకాశం గారికిని వారితో భాగస్తులును జాయింటు కుటుంబ ఆస్తులగు మరికొందరిని సమిష్టి హక్కుభుక్తములుగల ఒక పెద్ద పెంకుటి భవంతిలో ప్రకాశం గారి వంతు 1/6 భాగమును వారి బంధువులలో ఒకరుగు నిమ్మగడ్డ సుబ్రహ్మణ్యంగారు వేలములో కొని తాను కోరినంత లాభము తనకివ్వనిఎడల మిగతా భాగస్తులందరికి యిబ్బందికరముగా నుండునటుల తాను కొన్న భాగమును సారా దుకాణమునకు అద్దెకిచ్చెదనని బెదిరించసాగెను.

అందుకు ఝుడిసి ప్రకాశంగారితో భాగస్తులును మా పురోహితులగు బ్రహ్మయ్య-రామజోగయ్య-పున్నయ్యగార్లు నాతో ఆలోచించి వేలం ఖాయముగాక ముందు అనగా నెలలోపల బాకీ సొమ్మును ప్రకాశంగారికి అప్పు యిచ్చి ఆయన చేత కోర్టులో దాఖలు చేయించి వేలం రద్దు చేయించవచ్చుననిన్ని, యీ విధంగా ప్రకాశంగారికి నేను యిచ్చే అప్పు సరిగా నాకు వసూలు కావడంలో నష్టము రాకుండా సదరు భాగస్తులు ముగ్గురు అయిదువందల రూపాయలు ముదరా యిచ్చెదమని నాతో మూజువాని ఏర్పాటు చేసుకొన్నందున నేనా సొమ్మును ప్రకాశం గారికి అప్పుగా ఇచ్చాను. ఆ సొమ్మంతకు రూ॥ 1500లకు ప్రకాశం వగైరాల జాయింటు కుటుంబాస్తిలో కొన్ని భూములను, ఆయన 1/6 భాగంగా తనఖా పత్రం వ్రాయించుకొంటిని. ఆ సొమ్ముతో కోర్టు వేలం రద్దు చేయించుకొనబడినది.

తర్వాత కొన్నాళ్లకు తమ కుటుంబ ఆస్తి పంపిణీకి ప్రకాశంగారి తమ్ముడు బ్రహ్మయ్యగారు దావా తెచ్చి కోర్టు ద్వారా ఆస్తి పంపిణీ చేసుకొనుటలో నాతనఖా పత్రంలోని అయిటములు యితర భాగస్తులకును, నా తనఖా పత్రములోలేని కొన్ని యితర అయిటములు ప్రకాశంగారికిని వచ్చేలాగున (గ్రామములోని కొందరసూయపరుల దుస్సలహా వల్ల) కోర్టు కమిషనరు భాగములేర్పరచగా దాని ప్రకారమే కోర్టు తీర్పున్ను చేయబడెను. నా తనఖా బాకీని గురించి ప్రకాశం గారిని అడుగగా తన భూములలో కొన్నింటిని ఖరీదు నిర్ణయించి బాకీ మొత్తమునకు భూములు క్రయం చేయుదునని, ఏయే భూములు యిచ్చేది కొల్లూరునందున్న తన కొమాళ్లతో సంప్రదించి వచ్చెదనని తనకు కోర్టు పంపిణీలో ఏర్పడిన నంబర్లు నావద్దనేవున్నందున, ఆ నంబర్లు విస్తీర్ణములు తనకు వేసియిస్తే తాను కొమాళ్లతో సహా వచ్చి నాకు క్రయమును వ్రాసియిచ్చేదననెను.

నేను ఆయన మాటల ధోరణిని బట్టి కొంత అనుమానించి ఆయన భూముల విస్తీర్ణము మాత్రం సరిగానే వేసి, నంబర్లు మాత్రం తప్పుగా వేసి యిచ్చితిని. దానిని తీసుకువెళ్లినాకు తెలియకుండా యితరత్రా తానీయవలసిన బాకీల క్రింద ఒక చేను దుగ్గినేని వెంకయ్యకు, ఒక చేను మోపిదేవి పుండరీకాక్షుడుగారికి పెంకుటిల్లు తన అత్త బుర్రా నాంచారమ్మకు తనఖాలు వ్రాసి రిజిష్టరు చేసెనూ నా తనఖాలోతాను వ్రాసిన నెంబర్లుగల భూములు ఇతర భాగస్తులకు వెళ్లుటవల్లను తనకు కోర్టు ద్వారా భాగంగా వచ్చిన నంబర్లు భూములు పై విధముగా తాను వేరే తనఖాలు వ్రాయుటవల్లను... నా బాకీని గురించి చాలా చిక్కులలోకి వచ్చెను.

అపుడు నేను దావా వేయక తప్పలేదు. పూర్వపు మూజువాని ఏర్పాటు ప్రకారం బ్రహ్మయ్య వగైరా ముగ్గురు భాగస్తులు పూచీ పడిన రు. 500లతో వ్యవహారపు ఖర్చులు సాగించితిని. కుటుంబ ఆస్తి పంపిణీ దావాలో తన ఖాదారులైన నన్ను ప్రతివాదిగా చేర్చియుండనందునను, ప్రకాశంగారికి 1/6 వంతు భాగమునకు హక్కుదారుడై యుండి తనఖాలో వ్రాసిన నంబర్లు కోర్టు తీర్పులో భాగముల రీత్యా మారినను, వాటి స్థానే వచ్చిన కొత్త నెంబర్లు నా తనఖా హక్కుకు బాధ్యతకలవిగా చేర్చుకోవచ్చునని, ప్రకాశంగారు దుగ్గినేని వెంకయ్య వగైరాలకు వ్రాసిన తనఖాలలోని నంబర్లు తప్పుగా నుంటంవల్ల యీ తనఖాకు సంబంధించి వేలముకు తెచ్చిన నెంబర్లు కానందునను ప్రకాశంగారి వంతుగా నేను జప్తు చేయించిన ఆస్తి జప్తు ప్రకారమే వేలము కాబడినందున బాకీ సొమ్మంతయూ నష్టమేమీ లేకుండానే వసూలైనది. కాని చిక్కులు - అవస్థలు మాత్రం తప్పలేదు. తాము చేసిన అక్రమ పనులను గురించి ప్రకాశంగారు, కొమాళ్లు పశ్చాత్తాపము చెందిరి. మోపిదేవి పుండరీకాక్షుడు గారు వగైరాలు తప్పునెంబర్లతో తనఖా వ్రాయించుకొన్న సంగతిని, నేను వేలం కొరకు రిజిస్ట్రేషన్ ఎన్‌కంబ్రెన్సు సర్టిఫికెట్ తీసుకున్న తర్వాత తెలుసుకొని నెంబర్లు సరిజేసి సవరణ

దస్తావేజు వ్రాయించి రిజిష్టరీ చేయించుకొనిరి. నా జప్తుకు దరిమిలాను సవరణ వ్రాసుకొన్నందున నా బాకీకి లోబడి రెండవ బాధ్యతగల బాకీలుగా వారికి తీర్పు అయి ఆ బాకీలున్ను తరువాత తీర్చుకోబడినవి. ఈ వ్యవహారములన్నింటిలోను ఎవరి బాకీలు నష్టము కాలేదు. చాలా మెలికలు మాత్రము సంభవించినవి.

2) మా యూరికి దగ్గరలో చిరువోలు లంక అనే గ్రామము నందు కరణీకపు కుటుంబములలో, చిరువోలు రామదాసుగారి కుమారుడు రామయ్య అనే పేరుగల "చిక్కులమారి, పేచీకోరు" అనే ప్రఖ్యాతిగల ఒక నియోగ వ్యక్తి కలడు. ఆయన వల్లన తనకు రావలసిన రూ॥ 100ల చేబదులు బాకీని రాబట్టుకొనేటందుకై మా మామ రావి రామయ్యగారు నాచేత ఆయనకు రూ॥ 500లు భూమి తనఖా మీద అప్పు యిప్పించునటుల ఏర్పాటు మాట్లాడి నాకు సిఫారసు చేయగా నేనందుకంగీకరించితిని. తనఖా ఉంచదలచిన మరికొంత ఆస్తిన్ని పూర్వమొకపుడు కంతేటి వారి బాకీ క్రింద సివిలుకోర్టు వేలములలో కొసూరి రామన్న పేర కొని, ఆ రామన్న చేత, రామదాసు, ఆయన భార్య నరసమ్మ కొమాళ్లు రామయ్య, వెంకటప్పయ్య, రామకృష్ణయ్య, సుబ్బయ్యగార్ల పేర తిరిగి క్రయం వ్రాయించుకొని ఆక్రయ ధనం తీరుమానం నిమిత్తం ఆ భూమినే బాకీ తీరేవరకు కౌవులుగా కోసూరి రామన్నపేర క్రయదార్లందరు కలిసి బండగుర్తు దస్తావేజు వ్రాసి రిజిష్టరీ చేయించిరి.

ఆ భూముల తాలూకు సర్కారు శిస్తును కౌలుదారే చెల్లించునట్లు ఏర్పరుచుకొనియున్నారు. ఆ శిస్తును సర్కారుకు చెల్లించుటకని, కౌవులుదారు నుండి రామయ్య అడిగి పుచ్చుకొని మొదటి సంవత్సరం మాత్రం సరిగా చెల్లించి, మరుసంవత్సరం శిస్తు బాకీయుంచి, ఆ బాకీ క్రింద లాలూచీగా రెవిన్యూ వేలములో రామయ్య అత్తవారి తరపున, వుల్లిపాలెం పూజారి కొమ్మారులు బ్రహ్మయ్య పేర వెల్లడి లేకుండా కొని తిరిగి ఆ బ్రహ్మయ్య చేత రామయ్య భార్య లక్ష్మీ నరసమ్మ పేర క్రయం వ్రాయించి ఆమె చేత యితరులకు ఆ భూములు రిజిష్టరీ కౌవులు వ్రాయించి కోసూరి రామన్నను కౌవులు భూమి నుండి వెళ్లగొట్టెను. అందువల్ల రామయ్య సోదరులకు భాగపు హక్కు లేకుండా చేయడమున్ను, కోసూరి రామన్నకు బాకీ తీర్చనక్కర లేకుండా తప్పించుకొనుటయును జరిగినవి. ఆ భూమినే మరికొంత కాలమైన తర్వాత శిస్తు బాకి కింద రావి పిచ్చయ్య పేర రెవిన్యూ వేలములో కొని, ఆయాన వల్ల రామయ్య బావమరిదియైన యల్లాప్రగడ సుబ్బారాయుడుగారి పేర క్రయం వ్రాయించి, ఆ క్రయదారువల్ల ఆయన మేనల్లుడైన పులిపాక హనుమంతరావుగారికి తనఖా వ్రాయించి ఆ తనఖా సంగతినుదహరించకనే యల్లాప్రగడ సుబ్బారాయుడుగారి వల్ల, చిరువోలు రామయ్యగారి కుమారుడున్ను, సదరు రామయ్య గారి పినతండ్రి అయిన చిరువోలు మునిరాజుగారి కోమ్మార్డు లేటు లక్ష్మీనారాయణ గారి భార్య కామేశ్వరమ్మగారికి దత్త పుత్రుడున్ను, అయన వెంకట కృష్ణయ్యగారి పేర క్రయం వ్రాయించి రిజిష్టరీ చేయించిరి.

యీ చివరి వేలము సంగతి మాత్రము మాకు చెప్పి, దానినను సరించి వ్రాసిన క్రయములు మాత్రం చూపించి సదరు వెంకట కృష్ణయ్యగారి వల్ల నా పేర రూ॥ 500/-లకు తనఖా వ్రాసెదమని చెప్పి రూ॥ 400/-లు రొక్కమున్ను మునాయిదాయున్ను తీసుకెళ్లి ఎన్నాళ్ళకు తనఖా దస్తావేజు చూపించరైరి. నూరు రూపాయలు మామమగారి పైకములో మినహాయింపు చేయించి తాను తీసుకోవడం వారికిష్టము లేనందున ఆ సంగతి వెల్లడించక గోప్యముగా నుంచి నా దస్తావేజును తెచ్చిఇవ్వక కాలయాపన చేయుచూవచ్చిరి. అపుడు నేను వెంకట కృష్ణయ్యగారిని తొందర చేయగా, నాతో మాట తప్పుకొనలేక, ఆలస్యమునకేవో కారణాలు చెప్పినా తనఖా దస్తావేజు నాకు తెచ్చియిచ్చెను. ఆ తనఖా బాకీని 12

సంవత్సరములు సమీపించే వరకు యివ్వక యేమేమో చెపుతూ కాలం జరిపిరి. నేను అనుమానించి రిజిస్ట్రేషన్ ఆఫీసులో విచారించి తెలుసుకొనగా పైన ఉదహరించిన వ్యవహారపు మెలికలన్ని బయటపడినవి.

అపుడు తనఖా బాకీని గురించి తొందరపెట్టి బాకీ తీర్మానమునకు తనఖాలోని 5 యకరాల మెట్ట భూమిని వెంకటకృష్ణయ్యగారి వల్ల క్రయం వ్రాయించుకొంటిని. క్రయం భూమిని స్వాధీనం చేసుకొనుటకు వెళ్లగా 3 ఎకరములు కోసూరి వీరయ్య కొమార్డు వెంకటస్వామికిని, 2 ఎకరములు యక్కటి రత్నమునకున్ను చిరువోలు రామయ్య భార్య లక్ష్మీ నరసమ్మ కౌవులుకు యిచ్చినదని భూమి నుండి కౌవులుదార్లు తొలగకపోయిరి. అపుడు వారిలో వెంకటస్వామితో రాజీ మాట్లాడగా, అతనికి నా పొలంలో 3 ఎకరాలు పైరు వేసియున్న భూమిని ప్రతిఫలం కోరకుండా ఆ ఒక సంవత్సరముకు యిచ్చి అదనంగా రూ॥ 60 రొక్కము కూడా యిస్తే తాను భూమి నుండి తొలగుదునన్నాడు. నాకదిష్టము లేకున్నను, తప్పని సరిచేత ఒప్పుకొని యిచ్చి అతని నుండి ఆ భూమిని స్వాధీనం చేసుకొంటిని. తక్కిన 2 ఎకరముల భూమి యక్కటి రత్నం కౌలు వొదులుకొనుటకు నిరాకరించి తానే దున్ని నువ్వు పైరు వేసినాడు. పైరు మొలిచినది.

మా గ్రామంలో నాకు స్నేహితులుగా కనుపిస్తూ వ్యతిరేకముగా పనిచేయు అసూయాపరులగు కొందరు మాలోనే వుంటూ వచ్చిరి. అట్టివారిలో ముఖ్యుడు కంఠంనేని నాగయ్య-ఆయన మా అమ్మకు మేనమామ కుమారుడు. అతని ద్వారా నా సంగతులన్ని తెలిసిన వరకు విరోధుల వద్దకు వేగు నడుస్తుండేది. నన్నేవిధంగానైనా క్రిమినలు వ్యవహారములలో దింపి మిక్కిలిగా సొమ్ము నాచేత ఖర్చు పెట్టించడం మూలంగా నన్ను నష్టపెట్టవలెననేది అతని ముఖ్యోద్దేశ్యము గనుక అప్పట్లో నావద్దకు వచ్చి మంచితనంగా మాట్లాడుతూ యక్కటి రత్నం వేసిన నువ్వు పైరును చెడగొట్టి, ఆ భూమిని దున్ని స్వాధీనం చేసుకొనకపోతే నా క్రయ దస్తావేజు వ్యర్ధమేనని బాకీ సొమ్మంతా నష్టమే కాగలదని సలహా చెప్పినాడు. అందుకు నేనిట్లంటిని. ఆ మొలచిన పైరు నేను వేసినదేనని సాక్ష్యము చెప్పిస్తే సరిపోతుందని పైరు మొక్కలమీద ఎవరు వేసినది గుర్తులుండవని, ఆ పైరు చెడగొట్టి నేను మళ్లీ పైరు వేసినా ఆ పైరు వాళ్లు చెదగొట్టకుండా మనకే ఉంచుతారనే నమ్మకమేమి కలగదని, అందువల్ల మనకేమీ ప్రయోజనం లేదని పైరు తయారై పంటకు రాగానే మనమే దానిని మహాస్సూలు చేసుకోవచ్చును గనుక ఆ పైరు నట్లాగే పెరుగనిచ్చెదనంటిని.

ఈ సంభాషణ సంగతులన్ని రామయ్యగారికి వేగు అందజేసినాడు. దానితో కొద్ది కాలము వరకు హడావిడి లేకుండా ప్రశాంతముగా గడచినది. కొన్నాళ్లయిన పిమ్మట కంఠంనేని నాగయ్య నొకనాడు పిలిచి పైరు మొక్కలు దున్నించి మళ్లి మనము పైరు వేస్తే మనకు ఎక్కువ అనుకూలమేమో? ఆలోచన చెప్పియుంటిని. అదే మంచి మార్గమని మొదటనే చెప్పితినిగదా, ఎందుకనో నీవందులకిష్టపడవైతివి. అంతేగాని అది చాలా అనుకూలమైన పద్ధతేననెను. నీ నాగళ్లు, నీవు, నీ మనుష్యులు నాకు సహాయంగా వస్తానంటే నేను దానికి దిగెదనంటిని. తప్పకుండా సహాయముగా నుందునని తాను కూడా వస్తానని చెప్పినందున, ఒకరాత్రి అందుకు నిర్ధారణ చేసుకొని, నేను వచ్చి పిలిచేవరకు ఎవరింటివాద్ద వారే ఉండవలసినదని, నేను పిలవగానే బయలుదేరి రావలసినదని చెప్పి, ఆ రాత్రి కొంత ప్రొద్దు గడిచిన పిమ్మట ఆ పొలం వద్దకు వేగు చూచిరమ్మని మా మనిషిని పంపి తెలుసుకొనగా, తగాదా స్తలమునకు సమీపమునందున్న జమీందారుగారి బీడులో పొదలచాటున సుమారు యిరువది మంది జనులు కర్రలు మొదలైన పరికరములతో సిద్ధముగా కాచుకొనియున్నారని రూఢీ తెలిసినది. అది నాగయ్య పంపిన వేగును బాగా ధృవపరచినది.

మా పనులలోకి మామూలుగా వచ్చె మా పలుకుబడి మనుష్యులతో యీ తగువులోకి వెళితే చాలా నష్టము

ఇబ్బంది కలుగుతుందని భయపెట్టి వెళ్లొద్దని నాగయ్య సలహా యిచ్చినట్లు కూడా తెలియవచ్చినది. ఆ రాత్రి నేను వెళ్లి పిలువనందున మరునాటి యుదయమున నాగయ్య వచ్చి, ఏమయ్యా! నీ మాట ప్రకారం రాత్రంతా నీకొరకు చూస్తుంటిని, రాలేదని' అడిగెను. రాత్రి రాననందుకు కారణము వేరేయేమీ లేదు. రెండుసార్లు బయలుదేరినా దుశ్శకునమే కనిపించినది. మొదటిసారి విధవరాలు ఎదురైనదని తిరిగి వెళ్లితే రెండవసారి బయలుదేరినపుడు పిల్లి ఎదురైనది. యిటువంటి అపశకునములు కనిపిస్తుండగా తగాదా ప్రదేశమునకు రాత్రిళ్లు వెళ్ళడం ప్రమాదకరమనే తలంపుతో మానితినని చెప్పితిని. దానిని అతను పూర్తిగా నమ్మినాడు. మళ్లి ఎప్పుడనే విషయం మంచి రోజున విచారించి చెపుతానంటిని. దానితో ఊరుకున్నాడు.

ఒకరాత్రి వెళ్ల నిశ్చయించుకొని, నాగయ్యకు తెలియనీయక అతి రహస్యముగా, మా నాగళ్లు 5, మా పినతండ్రుల నాగళ్లు5, నా బావమరిది నాగళ్లు 5, అతని మేనమామల నాగళ్లు 5, మొత్తం యిరువది నాగళ్లు 60 మంది జనంతో నాలుగు మురోలుగా సమకూర్చుకొని నిశీద సమయములో వెళ్లి ఏర్పాట్లు, మార్గములు, దున్నవలసిన పద్ధతులు సవిరముగా చెప్పి ప్రతి అయిదేసి నాగళ్లకు ఒక మేస్త్రీ నేర్పరచి, అయిదేసి నాగళ్లు కొండ్ర వెణ్యా, దున్నే ఏర్పాటు చెప్పి వారందరిపైన కాపలా జనమున్ను దీనికంతకు సర్దారుగా మా బావమరిదిని ఏర్పాటు చేసి ఆ రాత్రి నేను కామరాజుగడ్డ కరణంగారి కొమారుని పెళ్లికి వెళ్లి తెల్లవారి వచ్చునట్లేర్పరచుకొంటిని.

ఇదంతా రహస్యంగా లోపాయికారీగా నిశ్చయించుకొన్న రోజున సాయంత్రం వేగు తెలుసుకొనుటకు నాగయ్య నావద్దకు వస్తుండుటను దూరమునందే గుర్తించి వెంటనే గదిలో తలపు వేసుకొని పరుంటిని. అపుడు నాగయ్య మా యింటి అరుగుమీద కూర్చొని మా అమ్మగారితో సంభాషణ చేస్తూ నేనెచటనున్న సంగతి నడిగెను. గది తలుపులేసి యుండుటను చూచి గదిలో పరున్నాడని తలనొప్పి వచ్చినపుడు లోపల పరుంటాడని చెప్పెను. దానితో ఏమీ తెలుసుకో వీలులేక పొలం వెళ్లినాడు. ఆ రాత్రి మేమనుకొన్న కార్యక్రమమంతా సరిగా జరిగినది. మరుసటి ఉదయమున నేనింటి వద్దనుండగా నాగయ్య రాత్రి జరిగిన పనిని గురించిన వివరములు తెలుసుకొని రామయ్యకు వేగు పంపదలచి నా వద్దకు వచ్చెను. మా సంభాషణలో నేను చెప్పినదేమనగా:- క్రిందటి మధ్యాహ్నము నుండి తలనెప్పితో గదిలోనే పరుండియుంటిని. రాత్రి జరిగిన సంగతులు యింకా నాకు తెలియరాలేదని వివరములు తెలుసుకొందునని చెప్పితిని. నాగయ్య పైరు ముదిరిన తర్వాత చెడగొట్టడము - నాగళ్లు సమూహముగా దున్నడము - చెరుపునేరముగా నుండునేమోననెను. నేను మొదట వేసిన పైరు సరిగా అంటక- గుబుర్లు తెరపలుగానున్నందున నేను వేసిన పైరునే నే చెడగొట్టి మరియొక పైరు వేసుకొనుట నేరము ఎట్ల కాగలదని నేనంటిని. దుక్కి తనిఖీ చేసి చూసినా 5 నాగళ్లుతోనే దున్నినటుల మడుపులో గల కొండ్రల వల్ల తెలియగలదని క్రిమినల్ చర్యకు అవకాశమేమీ లేదని చెప్పితిని.

ఈ సంగతులు నావల్ల విని మా వ్యవసాయదార్ల వద్దకు నాగయ్యవెళ్లి ఎంతగా విచారించినా వాళ్లేమీ సందీయరైరి. అందువల్ల తాను పంపే వేగు ఏమీ తోచక మా యిద్దరి సంభాషణాంశములనే కబురు పంపెను. అపుడు క్రిమినల్ చర్య మానుకోని సివిలు కోర్టులో రామయ్య భార్య లక్ష్మీ నరసమ్మ చేత నిర్దిష్ట పరిహార శాసనము ప్రకారము పొజిషన్ దావా దాఖలు చేయించెను. ఆ దావాలో నేను క్రయదారునైనను కోర్టు ద్వారా అధికారమును స్థిరపరచుకొని తద్వారా క్రయపు ఆస్తిని స్వాధీనము చేసుకోవలసినదని, బలవంతముగా ఆ భూమిలో ప్రవేశించకూడదని తీర్పు చెప్పబడెను. ఆ తీర్పు నాటికి ఆ భూమిలో నేను వేసిన నీలిపైరు మాత్రమున్నది.

నా క్రయ ప్రకారం నేను లక్ష్మీ నరసమ్మగారి మీద రెగ్యులరు దావా తెచ్చితిని. ఆ దావా విచారణలో కావలసిన రికార్డునంతను సమకూర్చుటకు కృష్ణాజిల్లా రిజిస్ట్రారు - అవనిగడ్డ - రేపల్లె సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో కొన్ని నఖళ్లు తెచ్చిన మీదట మరికొన్ని గుంటూరు కోర్టులోనున్నవని తెలిసి అచటికి వెళ్లితిని. గుంటూరులో ప్లీడరు గోవిందరాజులు శ్రీనివాసరావు గారి గుమాస్తా చింతపల్లి ఉత్తరేశంగారిని చూచినకళ్ల సంగతి ఆయనతో చెప్పితిని. తమ వద్ద గల రికార్డులు వెదకగా ఒక వ్యాజ్యపు తీర్పునకళ్లు కనిపించినవని అవేనేమో చూడమని నా చేతికీయగా వ్యాజ్యపు నంబరున్ను పేర్లున్ను గుర్తుంచుకొని అవేనని తిరిగి యిచ్చితిని. ఆ నకళ్లు బందరులో మా ప్లీడరుకు చూపించి తెచ్చి యిచ్చెదనని అందుకేమైనా ప్రతిఫలం కోరితే యిస్తానంటిని. నకలు బందరు తీసుకువెళ్లుటకు వీలులేదని గుంటూరులోనే చూచుకొని వెళ్లి యిచ్చివేయుటకు మాత్రమే వీలుంటుందని, తనకు రూ॥ 25లకు తక్కువగాకుండా ప్రతిఫలం యివ్వవలసివుంటుందని లేనియెడల వెళ్లవలసినదని, నిష్కర్షగా చెప్పివైచెను. రూ॥ 15 యిస్తానన్నా ఒప్పుకోలేదు.

అచట నుంచి లేచి కోర్టులో యిలాక రికార్డు అచ్చువేసే వాణి ప్రెస్సుకు వెళ్లి నేను గుర్తుంచుకొన్న వ్యాజ్యపు నెంబరు చెప్పి వాళ్లు కోరిన ప్రకారము ఒక రూపాయి వాళ్లకీయగానే వెదకి ఆ తీర్పుకు అచ్చు కాపీనొకదానిని యిచ్చిరి. తీర్పు అంతా పూర్తిగానున్నది. (సర్టిఫైడ్ కాపీ మాత్రం కాదు) దానిని తీసుకున్న పిమ్మట మరికొన్ని కాగితములు కావలసి కోర్టుకు వెళ్లితిని. అచట మన చింతపల్లి వుత్తరేశంగారు కనిపించి ఏమిటి సంగతి అని అడిగెను. నా వద్దనున్న ప్రెస్ కాగితముచూపించి ఒక రూపాయితో వచ్చే కాగితములకు రూ॥ 15 యిస్తానన్నా అంగీరించవైతివి. మంచి సంపాదనాపరుడవేనంటిని. మీరు బందరు వారనే సంగతి మరిచి పల్నాటి రెడ్లకు చెప్పే రేటు చెప్పితినని మీకు యింకా యేమైనా కావలసిస్తే చెప్పండి అవన్ని సప్లయి చేస్తాను. మీ యిష్టం వచ్చినంత ఇవ్వండి అని రాజీ బేరానికి దిగినందున నాకు కావలసిన కాగితాలన్నీ ఆయన ద్వారానే తెప్పించుకొని ప్రతిఫలంగా బూర్నీసు కొనక్కోమని రెండు రూపాయలు మాత్రమే యిచ్చితిని. అందుకాయన సంతుష్టి నొందెను.

ఆ విధంగా వెళ్లవలసిన అన్ని చోట్లకు వెళ్లి పూర్వనుండి చిరువోలు రామయ్యగారికి ఆయన కుటుంబమునకు సంబంధించిన యావత్తూ రికార్డును కోర్టు యెదుటనుంచగా, కోర్టు అధికారి చాలా ఆశ్యర్యపడి ఇన్ని తరహాలుగా యింత రికార్డు ఏ ఆస్తిని గురించి ఏ వ్యాజ్యములోను తాను చూచివుండలేదని, తాను ఎంత శ్రద్ధగా ఎన్ని సార్లు కేసు చదివినా ఆ చిక్కులన్ని సొంతము వరకు జ్ఞాపకముంచుకొనుట చాలా కష్టసాధ్యముగనున్నదని చెప్పి సౌమ్యముగా విచారణ చేయసాగెను. చివరకు రామయ్యగారు రాచకురుపుతో మరణించిన తర్వాత ఆయన భార్య లక్ష్మీనరసమ్మ కొమాళ్లతో ఆలోచించి రాజీగా క్రయభూమిని నాకు స్వాధీనం చేసినందున ఖర్చులు ఎవరివి వారే భరించుకొని యిండ్లకు చేరితిమి.

లోగడ కౌలుదార్లలో కొసూరి వెంకటస్వామి కౌవులు భూమి స్తానే నా సొంత భూమి యిచ్చినను అదనంగా నా వద్దకు రూ 60 లు తీసుకొనిగాని కౌవులు భూమి నా స్వాధీనం కానివ్వలేదనేది తెలిసిన విషయమే. పిమ్మట కొద్ది కాలానికే, నా చేలలో వున్న నీలిపైరు బేరమునకు వచ్చినాడు. 5 ఎకరాలలో నీలి పైరు నూరు రూపాయలు ఖరీదు చెప్పి, సొమ్ము ముందిచ్చి పైరు కోసుకోమని నిర్మొహమాటంగా చెప్పివైచితిని. అందుకంగీకరించి నూరు రూపాయలు ముందుగా యిచ్చి వెళ్లినాడు. పిమ్మట పదిరోజులు గడిచిన తర్వాత మొదటికోతకు తయారుగా నున్న వరకు కోయించుకోదలచి చేను వద్దకు వెళ్లి పైరు చూచుకొనగా ఎందువల్లనో పైరంతా నిలువున ఎండి చచ్చిపోయియున్నందున, నిర్ఘాంతుడై చేయునది లేక నా వద్దకు వచ్చి అంగలార్చి అదనంగా తాను పుచ్చుకొన్న 60

రూ॥లు మినహాయించి మిగతా రూ॥ 40 లైనా తనకు యిస్తానేమోనని చాలా వరకు బిగలాపడి చూచినాడు. అదేమీ జరగనందున నిరాశుడై తాను సంపాదించిన అక్రమ లాభము తీసుకొన దక్కలేదని తనకు తానే తెలుసుకొని నిండార్లుగా ఊరుకున్నాడు.

రెండవ కౌలుదారులైన యక్కటి రత్నం, పొజిషన్ దావాలో లక్ష్మీనరసమ్మ పక్షంగా తీర్పు చెప్పినపుడు ఆ భూమిలో నేను వేసియున్న నీలిపైరును తనకు ఖరీదుకు యివ్వవలసినదిగా నన్ను కోరెను. పొజిషన్ దావా తీర్పులో భూమిస్వాధీనము మాత్రమే చెప్పబడినది. పైరు సంగతి చెప్పలేదు. నేను వేసిన దగుటవలన దానిని ఖరీదుకు తీసుకొంటే భూమి పైరు అంతా తన వశంనందే ఉంచుకొనవచ్చునని తలచి నావద్దకు పైరు బేరమాడుటకు వచ్చెను. ఆ పైరు యిచ్చేది కాదనిన్ని, నా వ్యాజ్యం తేలేవరకు నా పైరును నేనే వుంచుకుందునని ఎవరివల్లనైనా పైరుకు నష్టం సంభవిస్తే దానికి వారే బాధ్యులు కావలసియుంటుందని, నా పైరు కోయకుండా నిలవయుంచెదనని స్పష్టముగా చెప్పితిని. కౌవులరీత్యా భూమి మాత్రం తాను స్వాధీనం చేసుకొన్నా పైరును స్వాధీనం చేసుకొనుటకు తీర్పులో ఏమీ ఆస్కారం కనిపించలేదు. పైరు నాదైనంత వరకు ఆ భూమిని అతడే విధమగా సాగుచేయగలడు? సాగుచేసినా చేయకపోయినా కౌలు మొత్తం అదివరకే చెల్లించియుండినందున లక్ష్మీనరసమ్మకు నష్టమేమీలేదు. కౌవులుదారుకు గత్యంతరమేమీ తోచదాయెను. అపుడు చేయునది లేక నాతో రాజీ మాట్లాడుకొని రూ॥ 40 నష్టపూర్తికిని రూ॥ 40 నీలి పైరు ఖరీదుగాను నాకు రొక్కముగా అతను యిచ్చి తానదివరకు చేసిన అక్రమాలనుదహరిస్తూ ఒక క్షమాపణ పత్రము వ్రాసి ఇచ్చెను. కౌవులు తీరగానే భూమి నాకుస్వాధీనము చేసి తాను తొలగిపోయెను. ఇదిగాక వడ్డీ వ్యాపారరీత్యా అడుసుమిల్లి ప్రకాశం గారి మీద జరిపిన తనఖా డిక్రి వేలములో హెచ్చు ధరపెట్టి ఒక అయిటం భూమిని యక్కంటి రత్నం కొనగా, ఆ అయిటం మీద మోపిదేవి పుండరీకాక్షుడు గారికి సవరణ దస్తావేజును బట్టి ఏర్పడిన తనఖా హక్కురీత్యా ఆ బాకీనంతను యక్కటి రత్నమే తీర్చవలసి రావడంతో కాకతాళీయముగా ఆ దండుగంతా తన నెత్తినపడుటతో గాభరాపడి, కృశించి తన అక్రములన్నింటిని గుర్తుకు తెచ్చుకొని తనకుతానే చాలా పశ్చాత్తాపమును వెలిబుచ్చెను. ఈ విధముగా ఆ కథ ముగిసినది.

# Gemological Table of the Families in Ravi Varipalem

## Hamlet of Mopidevi
## Divi Taluka
## Krishna District, Andhra Pradesh.
## Dt. 26-10-1955



| | | |
|---|---|---|
| **1.** భాగం | **1.** రావి వారు | **5–15** వ పేజి |
| **2.** భాగం | **2.** కావూరి వారు | **16–17**వ పేజి |
| కుమార్తెల సంతు | **3.** కంఠంనేనివారు | **18–20**వ పేజి |
| | **4.** బొందలపాటివారు | **20**వ పేజి |
| | **5.** వేములపల్లివారు | **21**వ పేజి |
| | **6.** యార్లగడ్డ వారు | **21**వ పేజి |
| | **7.** జొన్నలగడ్డ వారు | **22**వ పేజి |
| **3.** భాగం | **8.** వలస వచ్చిన వారు | **23**వ పేజి |



## రావివారిపాలెం సంక్షిప్త చరిత్ర

ఆన 1700 సంవత్సరములనాటికి 'రావివారిపాలెం' అనే ఈ గ్రామము పెద్ద అరణ్యముగా వుండెడిది. ఆ కాలమున దేవరకోట సంస్థానంలో పనిచేసే చాకలి 'దానాయ' అక్కడ పనిచేసి తిరిగి వచ్చి తన నివాసమగు ఈ ప్రాంతపు అరణ్యములోనే ఒంటరిగా నివశించుచుండెను. ఒకనాడాతనికి 'నాగయతిప్ప' గ్రామం నుండి తన భార్యతోను, పాడి గేదెతోను వలసపోవుచున్న ఒక కమ్మ ఆసామి 'పుల్లంరాజుచెరువు' వద్ద యెదురయ్యెను. అప్పుడు దానాయవారిని వెనకకు తీసుకువచ్చి అరణ్య ప్రాంతమగు ఈ గ్రామంలోనే ఆయనకు నివాసమేర్పరచి తన సహాయముతో ఆయన కొక యిల్లు గూడ వేసి యిచ్చెను. ఆ కాలము నాటికి గ్రామంలో వారిరువురే జతగా వుంటూ వుండేవారు. ఆ ఆసామిపేరు 'రావి సింగరప్ప'. ఆయనయే రావి వారకందరికి మూల పురుషుడు. రావి వారుండుట చేత ఈ గ్రామమునకు

'రావివారిపాలెం' అను పేరు పెట్టబడెను. తర్వాత కాలక్రమేపి సింగరప్ప మిగతా తమ్ములు గూడా యిచ్చటికే వచ్చి స్థిర నివాసమేర్పరచుకొనిరి. మొదటిభాగంలో చూపబడిన రావివారంతా సింగరప్ప తాలూకు పురుష సంతతి వారు.

రెండవభాగంలో చూపబడిన ఇతర గోత్రీకులందరు రావివారి తాలూకు ఆడపడుచుల సంతతి వారు.

1.కావూరి వారు తెనాలి తాలూకా కఠెవరం దగ్గర గుడివాడ గ్రామంనుండియు 2. కంఠంనేని వారు నాగాయతిప్ప, మణుకూరు మొదలైన గ్రామాలనుండియు, 3. బొందలపాటి వారు దాలిపర్రు గ్రామం నుండియు 4. వేములపల్లి వారు నాగాయతిప్ప, భేతపూడి గ్రామాల నుండియు 5. యార్లగడ్డ వారు నల్లూరు వగైరా గ్రామాల నుండియు 6. జొన్నలగడ్డ వారు తెన్నేరు వగైరా గ్రామాలనుండియు ఇల్లరికంగా వచ్చిరి. మూడవ భాగంలో చూపబడిన గోత్రీకులందరు ఎట్టి సంబంధం లేకుండ ఇచ్చట భూములు కొనుక్కొని వలస వచ్చినారు. ఈ గ్రామము మోపిదేవి గ్రామమునకు శివారుగా వుంటున్నది.

ఈ గ్రామమున కప్పటి మునసబు రావి నాగయ్య గారు ఈ గ్రామమునకు తూర్పు వైపున గ్రామ దేవతయగు 'నూకాలమ్మకు' గుడినొకదానిని కట్టించి దానికి చెరువు త్రవ్వించి దానిలో స్తంభ ప్రతిష్ట చేయించి గ్రామములో గల చాకళ్లచే నిత్యం ధూపదీప నైవేద్యములు విధిగా పెట్టించి జాతరలు బ్రహ్మాండంగా చేయించేవారు. ప్రస్తుతం ఆ గుడి శిధిలమైపోయినది. తత్సంబంధములైన పూజాది కార్యములు, జాతరలు జరుగుట లేదు. ఇప్పటికి ఆ పేరుతోనే వ్యవహరించబడుతున్న ఆ చెరువును ప్రభుత్వం వారు 1940 సంవత్సరంలో తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దాని మూలపురుషులగు మునసబు గారి యిప్పటి వంశీయులు గూడ సదరు చెరువును గురించి ఎట్టి అభ్యంతరములు చూపక ప్రభుత్వం వారికే వదిలివేసిరి.

ఈ గ్రామములో గల రైతులంతా సన్నిహిత బంధువులగుటచేత 1911 సంవత్సరము ఫిబ్రవరి నెలలో గ్రామస్తులంతా ఏకీభవించి కత్తి పొలమునకు అనగా 17 ఎకరములు రు. 6-00లు చొప్పున చందాలు కొంతవరకు వసూలు చేసి శ్రీ యార్లగడ్డ వెంకట సుబ్బయ్య, కావూరి కోదండ రామయ్య గార్ల అధ్వర్యము క్రింద అప్పటి గ్రామ మునసబు గారు 'శ్రీరామాలయ' నిర్మాణమునకుగాను ఉచితముగా వదిలివేసిన స్థలములో, ఆలయ నిర్మాణము ప్రారంభించి గోడల కట్టుడు పూర్తికాగానే వారిలో కొన్ని అభిప్రాయ భేదములు కలుగుటచేత సదరు పనిని ఆపివేసిరి. మరల 1914 ఆనందనామ సం॥ ఫిబ్రవరి నెలలో శ్రీ యార్లగడ్డ నారాయణమూర్తి, కావూరి కోదండరామయ్య గార్ల పెత్తనం క్రింద దిగుబాటు చందాలు వసూలు చేసి ఆలయ నిర్మాణమును పూర్తిగావించిరి. ఆలయంలో గల అలమర ఖర్చును ప్రత్యేకం కావూరి నాగయ్యగారి భార్య రత్నమ్మగారు భరించిరి. శ్రీ రామచంద్రుని పెద్ద పటమును శ్రీ రావి పిచ్చయ్యగారి కుమారుడు రాఘవయ్య గారు బహూకరించిరి. కొయ్య రధమును రావి నాగయ్య గారు చేయించి యిచ్చిరి. గ్రామస్తుల అభిమానంతో హార్మోనియం, మృదంగంను కొని రావి నాగయ్య, కావూరి వెంకట రామయ్య గార్ల ఆధ్వర్యం క్రింద చాలా కాలము వరకు ఆలయంలో భజనలు చేసేవారు. మొదటి నుండి యిప్పటివకు శ్రీ రామనవమి నాడు ప్రతి సంవత్సరం 'శ్రీ సీతారాములు కళ్యాణమును' రాత్రికి రథోత్సవము, తాళ మేళములతో బ్రహ్మాండముగా గ్రామమంతా శ్రీ స్వామివారి ఊరేగింపు జరుగుచున్నది.

శ్రీ స్వామివారి కళ్యాణ సమయంలోను, ఊరేగింపు సమయంలోను, చాకళ్లు, మంగళ్లు, పూర్వమునుండి రివాజుగా మేళములు వగైరా తమ తమ విధులన్నియు స్వామివారికి ఉచితంగా ఇప్పటికిని చేయుచున్నారు. ఇప్పుడు ఆలయంలో భజనలు, వాయిద్యములు పూర్తిగా తగ్గిపోయినవి. ఆలయంలో దీపారాధన నిత్యం శ్రీరాముల వారికి వివాహ కట్నములతో వచ్చే మామూళ్లవల్లను (ఇంటికి రూ॥ 100) గ్రామంలో జరిగే కాలగార పాట నిల్వలోనించి, శ్రీ వేములపల్లి నారాయణమూర్తి, బొందలపాటి రాఘవయ్యగార్లచే చేయబడినది. గ్రామంలో నిల్వ వున్న కాలగారపు డబ్బులో నుండి ఆలయంలో సున్నం నాపరాళ్లు వేయుట మొదలగు పనులు శ్రీ కావూరి కోదండరామయ్య గారిచే 1938 సం॥లో చేయించబడినవి. మిగతా నిల్వ డబ్బు శ్రీ రావి నారాయణమూర్తి (వీరయ్య) గారి వద్ద నిల్వ వున్నది. ఆలయం ప్రస్తుతం మరమ్మతు చేయవలసిన స్థితిలో వున్నది.

ప్రస్తుతం గ్రామస్తుల విరాళాల వలన ఆయలంలో నిత్యం దీప ధూప నైవేద్యములు శ్రీ కావూరి నారాయణమూర్తి గారి వల్ల చేయబడుచున్నవి. గ్రామంలో కమ్మవారు 178 కుటుంబములు, చాకళ్లు 21, బ్రాహ్మణులు 7, గౌడులు 5, కోమటి 1 కుటుంబములు కలవు.

## గోత్రములు

1. రావివారు - వీరంకిల గోత్రం
2. పెదకావూరివారు - ఆరికట్ల/అరిగఅన్నం
3. చినకావూరివారు - వెంజర్ల/దక్షిణాది
4. బొందలపాటివారు - వేలాలు, ఉల్లులు
ఆడపడచుపెట్టింది
5. వేములపల్లివారు - పమిడిపాళ్లు
6. చలసాని వారు - పమిడిపాళ్లు
7. జొన్నలగడ్డ వారు - ధాన్యాల గోత్రం
8. కంఠంనేని వారు - ఆవాలు గోత్రం
9. యార్లగడ్డవారు - రేచర్ల
10. పరుచూరివారు - పోగునూళ్ల
11. కొత్తపల్లి వారు - పోగునూళ్ల
12. సూరపనేనివారు - వల్లుట్ల
13. దావులూరివారు - మట్టాళ్ల
14. ఘంటావారు - పమిడిచుక్కల
15. ఎలమంచిలివారు - వల్లకాళ్ల గోత్రం
16. పమిడిముక్కలవారు - త్రైలోక్య గోత్రం

***కమ్మ, కాపు, రెడ్డివారలకు మొత్తం***
***1 లక్ష 72వేల గోత్రాలు***


*గోత్ర సేకరణ : పిచ్చుకగుంట వాళ్లు (25-7-57)*


## మొదటి భాగము

**రావివారి మూల పురుషుడు**


- 1. సింగరప్ప
  - 1. పెద బుచ్చయ్య.
  - 2. సంజీవు.
  - 3. పేరంటాలు
  - 4. బుచ్చి వీరన్న (మోహిదేవి)
  - 5. గుడికాంతలలంక (పేరు తెలియదు.)
  - 6. సుబ్బన్న.
- 2. పెద వెంకయ్య
- 3. చౌదరమ్మ
- 4. సుబ్బరయ్య

## 1. పెదబుచ్చయ్య ప్రథమ భార్య






1. పెద బుచ్చయ్య (ద్వితీయ భార్య)
1. రామన్న.
2. అప్పయ్య.
3. వెంకటరాయుడు.
సుబ్బారాయుడు.
తిరుపతి రాయుడు.
వెంకట రామయ్య.
నారాయుడు.
(చినముత్తేవి.)
సుబ్బారాయుడు
బసవయ్య
సుబ్బయ్య.
కృష్ణయ్య
(నాగపూరు.)
కోటయ్య.
1. తిరుపతిరాయుడు.
2. కోటయ్య.
3. రత్నయ్య.
రామచంద్రయ్య.
(దత్తు నాగయ్యకు.)
గోపాలరావు.
వెంకటేశ్వర రావు.
కాటేశ్వర రావు.
సత్యనారాయణ.
వెంకట రామయ్య.
శంకరరావు.
మాణిక్యాలరావు.
భాస్కర రావు.
సీతారామయ్య.
1. గంగయ్య.
2. తాతయ్య.
3. నారయ్య.
వెంకట రామయ్య.
వెంకట సుబ్బయ్య.
1. కోదండ రామయ్య.
2. వెంకట కృష్ణయ్య.
1. సీతారామయ్య.
2. వెంకటేశ్వరరావు.
3. గంగాధరరావు.
1. వెంకటేశ్వరావు.
2. గంగాధరావు

## 2. సంజీవు



తాతన్న, (దత్తు.)
అల్లుడు. (కంభంనేనివారు.) కె. 4
అల్లుడు. బి.
బాందలపాటి నారప్ప
(దాలిపరుు)
1. సంభ్వారాంతుండు.
2. రామన్న
1. నాగుర్య్య
(వీరమ్మ.)
2. లక్ష్మీనారాయణ.
3. సంజీవ రాయుడు.
1. కోటయ్య
(గూడవల్లి.)
2. వెంకయ్య
3. తాతయ్య
(బాపమ్మ.)
దత్తు
జగన్నాధం.
వెంకటేశ్వరవు.
1. లక్ష్మీనారాయణ.
2. శివరామ కృష్ణయ్య.
3. శ్రీ కృష్ణ
4. జగన్నాధం.
(దత్తు.)
తాతయ్య.
అల్లుడు.
వేములపల్లి నారాయణ.
నాగాంతుడు
నైజాం
అప్పారావు.
లీలాప్రసాదరావు.
లక్ష్మణ రాయుండు.
వెంకయ్య.
వెంకట సుబ్బయ్య.
వెంకటేశ్వరావు.
వెంకటేశ్వరరావు.
రామచంద్రరావు

# బుచ్చి వీరన్న (మోపిదేవి)





6. సుబ్బన్న.
1. సుబ్బయ్య.
1. వెంకన్న.
2. నాగన్న.
3. రామన్న.
1. లక్ష్మన్న.
2. రామచంద్రయ్య.
లక్ష్మీనారాయణ. (ప్రజుళ్ల)
తిరపతిరాయుడు. (దాలిపర్రు)
(అల్లుడు కంఠంనేని వీర రాఘవయ్య - తాతయ్య.)
సత్యనారాయణ.
నాగయ్య.
వెంకటరామయ్య.
(శివరాంపురం)
కృష్ణయ్య, శివరాంపురం.
1. సుబ్బారావు.
2. రంగయ్య.
3. వెంకటేశ్వర రావు
(శివరాంపురం)
(వెదపోలు.)
2. చిన సుబ్బయ్య.
1. నాగన్న.
2. జానకి రామయ్య.
3. వెంకన్న.
సుబ్బయ్య.
అల్లుడు వేములపల్లి నాగయ్య.
సుబ్బయ్య.
అల్లుడు. వేములపల్లి కోటయ్య.
1 సుబ్బయ్య.
2 రామకోటయ్య
వెంకట కృష్ణయ్య
రాజయ్య (వెలివోలు.)
1. సత్యనారాయణ.
2. వెంకట కృష్ణయ్య.
3. జానకిరామయ్య.
4. కోటేశ్వర రావు.
మోహనకృష్ణ ప్రసాద్
రామనాథ బాబు.
రంగారావు.
నాగయ్య (శివరామపురం.)
బుజ్జిబాబు.
సుబ్బారావు.
(ఆర్తమూరు.)

॥ పెద వెంకయ్య సింగరప్ప పెద తమ్ముడు.






గుండుపాలెం. 1953 సం॥

11 పెదవెంకయ్య, సింగరప్ప పెద తమ్ముడు.




3 వ తరము సింగరప్ప రెండవ తమ్ముడు





4 సుబ్బన్న.
కె. 1. వేజీ 16
సరసమ్మ.
కె. 3.
సుందరమ్మ.
వేజీ 17, కె. 2.
నాగయ్య. మునసీబ్.
లక్ష్మన్న.
అల్లుడు.
పెదవీరన్న.
మొదటి భార్య.
వెలమంద వెంకటప్పయ్య. దాతిపన్ను.
రెండవ/వెలమంద లక్ష్మీదేవి/ భార్య.
పద్మయ్య.
వెద రామన్న.
అమ్మన్న.
కోటయ్య.
కృష్ణయ్య.
సుబ్బయ్య.
రామయ్య.
వెంకటప్పయ్య.
కోటయ్య.
వెంకట రత్నం.
వెంకటేశ్వరరావు.
అమ్మన్న.
రంగారావు.
సూర్య ప్రకాశరావు.
(లంకపల్లి.)
తాతయ్య.
వెంకటేశ్వర రావు.
(దత్తు.)
కోటయ్య.
బలరామయ్య.
సుబ్రహ్మణ్యం.
బుల్లి కోటయ్య.
వెంకట సుబ్బయ్య.
కాంతయ్య.
రామయ్య.
నారాయణ మూర్తి.
రంగయ్య.
శివరావు.
(అవనిగడ్డ.)
వెంకట రామయ్య.
లక్ష్మయ్య.
రేపల్లె.
కోదండ రామయ్య.
బసవయ్య.
వెంకట సుబ్బయ్య.
దేశాయి.
శివరామకృష్ణయ్య.
రాధాకృష్ణ మూర్తి.
వీరయ్య.
నాగయ్య.
బాలచంద్రశేఖరరావు.




2. వెంకన్న. (మునిసిఫ్.)
4. అమ్మన్న.
1. రామన్న. (మునిసిఫ్.)
3. నాగయ్య.
1. కోటయ్య.
కృష్ణమూర్తి.
బలరామయ్య.
1. వీరయ్య (మునిసిఫ్)
2. రత్తయ్య.
4. పద్మయ్య.
5. కోటయ్య.
నారాయణ మూర్తి.
బసవయ్య (నరసింహపురం) (కోడూరు)
వెంకట సుబ్బయ్య.
1. రామ చంద్ర రావు.
హనుమంతరావు.
రామమోహనరావు. లక్ష్మణరావు. భరతుడు. శత్రుఘ్నుడు.


కె. 1. కావూరివారు

రెండవ భాగము

కుమార్తెల సంతతి

మూలపురుషుడు 4 రావి సుబ్బన్న బావమరిది. పక్క. 14.






వెంకట రామయ్య.(ంగెమ్మ)
కె 2 కావూరివారు
ఐచ్చయ్య (సుందరమ్మ)
Page 14
వీరన్న.(మహాలక్ష్మమ్మ)
కోటయ్య. (కుటుంబమ్మ)
లక్ష్మీదేవిభర్త. రావిజ్ఞానక రామయ్య.
దత్త. శివరామయ్య (సీతారామమ్మ)
వెంకట కుటుంబ రావు. (వరలక్ష్మి)
వెంకటేశ్వర రావు. (తులశమ్మ)
కోటయ్య. నాంచారమ్మ. (నైజాం.)
వీరరాఘవయ్య.
సోమశేఖర ప్రసాద్. (దుర్గాంబ)
దేవకీనందన ప్రసాద్.
సీతారాం ప్రసాద్.
వెంకట రావు.
నైజాం.
రమేశ బాబు.
వెంకట కోదండరామయ్య.
నాగేశ్వర రావు.
నాగయ్య (రత్నమ్మ.)
దత్త. కోదండరామయ్య (సీతారామమ్మ)
శేషయ్య, (వరమ్మ.)
వెంకట కృష్ణయ్య (కృష్ణమ్మ)
కోదండ రామయ్య. దత్త.
శివరామయ్య. దత్త.
సీతారామయ్య.
బసవయ్య.
సత్యనారాయణ. (విమలమ్మ)
బలరామయ్య. (తులశమ్మ.)
రామశేషయ్య. (వెంకటరమణమ్మ)
సీతా నాగేశ్వర రావు.
సీతారామవరయ్య.
నాగేశ్వర రావు.
కోడూరు, నరసింహపురం.
రవీంద్ర బాబు బందరు.
శ్రీరామమూర్తి.
సుబ్బమ్మ. (సుబ్బమ్మ)
వెంకట రామయ్య. (శేషమ్మ)
సీతారామయ్య. (రామాంజమ్మ)
రామచంద్రయ్య. (కుటుంబమ్మ.)
చిన రామకృష్ణయ్య. (సీతారామమ్మ.)
వెంకట రాంబాబు.
రత్నమ్మ సంతానం.
సౌభాగ్యమ్మ సంతు.
వెంకట రత్నం.
సత్యనారాయణ.
వెదరామకృష్ణయ్య. (శీతారత్తమ్మ)
సత్యనారాయణ (లక్ష్మమ్మ.)
సుబ్బయ్య. (సత్యజ్ఞాన ప్రసూనాంబ.)
చంద్రశేఖర ప్రసాద్.
దేవకీనందన ప్రసాద్.
వల్లమ్మ.
సీతారామమ్మ.
(ఖానాపురం.) (వరంగల్.)
చిదంబర రావు. లక్ష్మీనరసమ్మ.
వెంకట నారాయణ
వీరరాఘవయ్య. వెంకట రత్నం.
శివరామకృష్ణయ్య. లక్ష్మీకాంతం. గండుపాలెం 1956 సం.
సుబ్బారావు.
రామలింగయ్య. గుండుపాలెం.


కె.3 కుంటంసనివారు నాగయుంప్ప,

పెరుమాళ్లు (సరమ్మ) రావి నాగయ్య బావమరది వేడీ 14




కొ. 4 కంఠంనేనివారు /వనుకూరు/

మూలపురుషుడు. వనకిరి ఉల్లంకం. నెం. 8.



బి. బాందలపాటి వారు, గాలిపర్రు.

సా వప్ప. నంబీవు అల్లుడు.



## వేమిముల పల్లి వారు, నాగాంతుతిప్ప.

శేకి. 10.

- వెంకన్న
  - కోటయ్య (రావిజానకి రామయ్య అల్లుడు.)
    - 1. వెంకట శివయ్య.
      - అల్లుడు. ముమ్మనేని వెంకట రత్నం. బాబర్లంక.
    - 2. పిచ్చయ్య.
      - 1. వెంకటేశ్వర రావు.
      - 2. రంగారావు.

(భేతపూడి.) పే. 3.

- నాగయ్య. (రావి పెద నాగన్న అల్లుడు.)
  - వెదప్పయ్య.
    - నాగేశ్వర రావు:

## ఎరాగ్లగడ్డ వారు.


పేజీ 14.

మంగాలపురుషుడు. రావి నాగన్నగారి మేనకోడలు భర్త.

- 1. సుబ్బన్న (వెంకమ్మ.) — బావమరిది జాన్నల గాడ్డ కోటయ్య. పేజీ. 22.
  - నాగయ్య.
    - రాఘవయ్య.
      - వెంకటేశ్వర రావు.
- 2. వెంకన్న.
  - 1. శ్రీరాములు (వెల్లబారారు.)
  - 2. సుబ్బయ్య.
    - 1. శివరామయ్య.
      - 1. సుబ్బారావు.
      - 2. రాధాకృష్ణయ్య.
      - 3. అంకినీడు.
      - 4. పాండురంగారావు.
      - 5. జగన్నాథం.
      - 6. సాంబశివ రావు.
    - 2. గోపాలరావు. (లంకపల్లి.)
  - 3. పున్నయ్య.
    - 1. కోటేశ్వర రావు.
    - 2. వెంకట రామయ్య
    - 3. రాఘవయ్య.
    - 4. సుబ్బారావు.


(నాట్ యిన్ విలేజ్.)

## జొన్నలగడ్డ వారు:



పుల్లన్న.
1. పేరుతెలియుటుడు.
2. పేరు తెలియుటుడు.
అక్కయ్య.
లక్ష్మన్న, (వెద సుబ్బయ్య బావమరిది) పేజి. 11.
1. సుబ్బన్న.
2. అచ్చన్న.
3. వెంకన్న.
వీరయ్య.
వీరయ్య (కాంతమ్మ.)
అల్లుడు, రాని బాపయ్య. (నెరావిలేని.)
1. సుబ్బన్న. (గూడవల్లి.)
2. వీరయ్య.
3. రత్తయ్య
సుబ్బారావు.
1. సత్యనారాయణ.
2. వెంకట రామయ్య.
3. రంగయ్య. (వాడపాలెం.)
4. రాఘవయ్య.
5. కృష్ణమూర్తి,
6. సుబ్బారావు.
బాబురావు.
మల్లేశ్వర రావు.
సాంబశివరావు. (గుడిపాలెం.)
1. వెంకటేశ్వరరావు.
2. పిచ్చేశ్వర రావు. (దింటిమోరక, కోడూరు.)
మూలపురుషుడు:
1. పుల్లయ్య.
2. అప్పన్న.
పేజి. 21.
కోటయ్య. (యార్లగడ్డసుబ్బన్నబావమరిది.)
నాగన్న. (బోడపాడు.)
1. కుటుంబరాయుడు.
2. బసవయ్య.
1. వెంకట కృష్ణయ్య. (మైలవరం.)
2. వెంకట రత్నం.
1. వెంకటేశ్వర రావు. (లక్ష్మీపురం.)
2.

మూడవ భాగము.



1. పేముల పల్లివారు, (నాగాయలంక)
లక్ష్మన్న.
1. రామన్న.
2. వెంకన్న.
3. నాగయ్య.
4. రత్తయ్య.
1. కిష్టయ్య.
(గాల్వేపల్లి.)
2. లక్ష్మయ్య.
(దత్తు.)
1. నరసయ్య.
అల్లుడు, (దుగ్గిరాల.)
2. రామయ్య.
దత్తు, లక్ష్మయ్య.
(గాల్వేపల్లి.)
కోటయ్య.
(వనుకూరు.)
1. ఉమామహేశ్వరరావు.
2. బుజ్జి
3. శివరామకృష్ణప్రసాద్.
(అవిరాధ్య.)
4. మోహనరావు.
5. జగన్మోహనరావు.
2. వలసానివారు (వెలివోలు.)
వీరయ్య.
బ్రహ్మయ్య.
1. కుటుంబరావు.
(వెంకటాపురం.)
2. బసవపూర్ణయ్య.
(బెంగుళూరు.)
3. జాన్నల గడ్డ వారు:
నాగన్న.
1. సుబ్బయ్య.
(వెదరా పూరం,) (తెనాలి.)
2. అప్పన్నయ్య.
1. కిష్టయ్య.
అల్లుడు.
కోనేరు సుబ్బారావు.
2. బాబయ్య.
(గుండుపాలెం.)
3. రామచంద్రయ్య.
4. కంతటనేనివారు (వనుకూరు.)
రామన్న.
సుబ్బయ్య.
1. నారాయణ మూర్తి.
మాధవ రావు.
2. వెంకట రామయ్య.
(మనుకూరు.)

**కృష్ణా జిల్లా, దివి తాలూకా ఘంటసాల గ్రామంలోనున్న జలధీశ్వరస్వామి వార దేవాలయమునకు ముందున్న విశాల ప్రదేశమున యీ గ్రామస్తులు ఏర్పరచిన పందిరిలో సమారు 2000ల మంది ప్రేక్షకులతో కూడిన తొలి రాజకీయ మహాసభయందలి కావూరి కోదండరామయ్య గారి అధ్యక్షోపన్యాసము**

ఆర్యమహాశయులారా!

మన కృష్ణా మండల సభ జరిగినప్పుటికే మారుమూలనున్న మన దివి తాలూకా పరిస్థితిలుఉ చక్కగ చర్చింపగల తాలూకా సంఘమునొకదానిని ఏర్పరచుకొని తాలూకా సభలు జరుపుకొనుట యుచితమని చాలా మంది ప్రతినిధులు తమ తమ అభిప్రాయములు వెలిబుచ్చిరి. యీ సంవత్సరము మండల సభ మన తాలూకాలో జరిగియున్నందున ఇంకొకప్పుడు తాలూకా సభ జరుపదగుననెడి తలంపుతో అప్పటికి విరమించిరి. ముందుగా సంఘస్థాపన గావించి తరువాత సభ నొనగూర్చవలెననియు రాబోవు సీతాకాలమునకు పిమ్మట యీ పనులు జరుప వీలుగ నుండుననియు తలంచుచుండ ఘంటసాల గ్రామ వాస్తవ్యులు యీ సభ నొనగూర్చి యింత త్వరలో ఏర్పాట్లన్నియు చేయగలిగినందుకు వారెంతో వందనీయులు. మరియు రాజ్యాంగ వ్యవహారములో నవీనమైన మార్పులతోను, రాజకీయ వేత్తలగు ప్రముఖుల భిన్నాభిప్రాయములతో నిండియున్న వివిధ కక్షలతో రాజకీయ వాతావరణమంతయు కారుమబ్బులతో నిండియున్న యిట్టి భయంకరమైన సంధిగ్ధ సమయమున యిట్టి సభలు జరుప సమకట్టుట వీరిని మిగుల ప్రశంసాపాత్రులను చేయుచున్నది. ఈ సభకు శ్రీయుత బొబ్బా పద్మనాభయ్య చౌదరిగారిని అధ్యక్షులుగా నెన్నుకొనిరి. కారణాంతరముచే వారు సభకు రాజాలనందునను వారి యుపన్యాసమును పంపజాలనందునను యీ విషయములు అవ్యవధిగా తెలసి, సభనెటులనైన నెరవేర్చదలచి కార్యోత్సాహులైయున్న ఆహ్వాన సంఘమువారు యీ పనికి నన్ను నియమించిరి. వారి నియమానుసారము నేనందులకు అంగీకరింపవలసి వచ్చినది. నేనొక పల్లెటూరి రైతునే కాని రాజకీయవేత్తనుకాను. నాకున్న చిన్న అనుభవమైనను గ్రంథాలయ విషయమునందున్నదేగాని రాజకీయ విషయములలో లేదు. విశేషానుభజ్ఞులగు గొప్ప రాజకీయవేత్తలు సమర్థించవలసినంతటి గొప్ప సమస్యలు మన యెదుట నున్నవి. ఇట్టి సమయములో ఈ స్థానమందుండుటకు సమ్మతించుట తప్పనిసరియగుట చేతనే కాని సామర్థ్య విశేషము వలన కాదు. గనుక నా యుపన్యాసమునందు లోపములేవైననున్న మన్నింతురుగాక!

1. హిందూ దేశమునకు స్వరాజ్యవాంఛ చాలా కాలము క్రిందటనే యంకురించినది. కాని దాని ఫలప్రాప్తి మాత్రం ఇంతదను కలుగనేలేదు. స్వరాజ్యత్వమును గురించి శ్రీ 'దాదా భాయి నౌరోజి' మొదలగు మహనీయులచే విపులముగా చెప్పబడియున్న విషయమును తిరిగి స్మరణకు తెచ్చికొనిన సభ్యులందరికి విధితము కాగలదు. అందుకొరకు దేశాభిమానులందరూ స్వార్థ త్యాగులై అనేక విధముల పాటుపడసాగిరి. వారిననేక విధముల విసిగింప గల అంతరాయములు వేలుగాచువచ్చి నను వేసారక అటులనే వారి ప్రయత్నములను సాగించుచుండిరి. అట్టి వారి ప్రయత్నములూరకపోవునని కావు, ఫలించి తీరును. ఇట్టి దృఢనిశ్చయమునే దేశ హితైకాభిలాషులందరును

కలిగియున్నారు. మన దేశపు కొరతలను ప్రభుత్వమునకు నివేదించి నివారణ చేయించుటకు పనిబూనుకొనిన (Indian National Congress) ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌వారు అప్పటప్పటికి ఎన్నెన్నో తీర్మానములు గావించుచూ వచ్చిరి. ప్రారంభ విద్య నిర్బంధముగను, ఉచితముగను నేర్పవలెననిరి. (Judicial Executive) జుడిషియల్ ఎగ్జెక్యూటివ్ శాఖలు విడదీయవలెననిరి. ఐ.సి.ఎస్ (I.C.S.) పరీక్షలు హిందూదేశమునందే జరపవలెననిరి. ఇటులనే అనేక తీర్మానములున్నవి. వానిలో ఒకటియును నెరవేర్పబడలేదు. ఆయుధచట్టమును రద్దు పరిపించగోరిరి. కాని నమ్మకములేని దొరకు సుఖములేదని యీ దేశస్తులయందెవరికి నమ్మకము కుదరదనియు యిచ్చుటకు యిష్టముండదు. కాని యీ దేశస్తులకు ఆయుధములనియ్యకపోవుట అనునది వారెందునకని చెప్పినను మనము మాత్రము మేలుకేనని తలచవలెను. అట్టి అవకాశమును మనము కలిగియున్నచో పాశ్చాత్య పశుబలము మీదనే మన దేశజులును ఆధారపడియుండెడివారు. ఇప్పుడున్న ఆత్మబలము మీదనే నిలిచినారు. ఇది చాలావరకు సుకృతమేగదా, దౌర్జన్య రహితమైన యిట్టిపద్ధతికి కారణభూతులైన ప్రభుత్వమువారు మన కృతజ్ఞతకుపాత్రులని చెప్పుటకు సంశయముండదు.

2. మాంటేగ్యు మంత్రి పార్లమెంటులో మొదట హిందూ దేశమునకు బాధ్యతాయుత స్వపరిపాలనమునకై చేసిన యుపన్యాసమునకును పిమ్మట తానేర్పరచిన ప్రణాళికకును విశేష సంబంధములేదనిన్ని, బహు అసంతృప్తికరముగనున్నదని దేశజులను కొనుచుండ వానినములోనుంచుట నేర్పరచిన సూత్రములు మరీ నీరసముగా బయలుదేరినవి. వీటిని గురించి ప్రజలలో చాలా ఆందోళన బయలుదేరినది. పంజాబులో సైనిక శాసనమును ప్రవేశపెట్టి అక్కడి ప్రజలలో కొంతమందిని చంపియు, మరి కొందరిని బాధలు పెట్టియు, కొందరిని నష్టపరచియు చికాకు పరచిన 'డయ్యరు' మొదలగు అధికారుల చర్యలను విమర్శింపుచు తగు విచారణ చేయించి శిక్షింపజేయుటకు ప్రజా ప్రతినిధులెంత మొర లిడినను ప్రభుత్వము వారు పెడచెవిన బెట్టిరి. శ్రీ చక్రవర్తిగారి యొద్ద నుండి సానుభూతి వాక్యములలైన నోచుకొనకపోతిమి గదాయని ప్రజలు చాలా హృదయ వేదనగలవారై అయ్యది సమగ్రముగ లోకమునకు వెల్లడింపసాగిరి. నిరాయుధులగు ప్రజలమీద మర ఫిరంగులనుపయోగించియు బాంబులను విసరియు తన యుద్ధ నైపుణ్యమునగుపరచనందుకు ఆ మహాయోధుడగు సేనానికి ఖడ్గ బహుమానమొసగుటకు ఆ దేశమున కొందరు చేసిన ప్రయత్నములు వినినపుడు స్వాతంత్ర్య సంరక్షణార్థము యుద్ధమునకు దిగిన ఆంగ్ల దేశీయులలో యిటువంటి వారు కూడా కలరా? అని ఆశ్చర్యమునొందవలసివచ్చినది. ఇక ముందైన నిట్టి పనులు జరగకుండుననెడి నమ్మకమును వారి నివేదిక తొలగించుచున్నది.

3. చట్ట నిర్మాణ సభలలో నింతవరకును ప్రజా ప్రతినిధులకు గల అధికారము పలుకుబడిని గురించి విచారింపనక్కరలేదు. వారికి జరిగిన పరాభవములే దానికి తార్కాణము. ప్రశ్నలు వేయుటకు మాత్రము అధికారములుగలదు. ప్రజానుగుణ్యమగు చట్టమునేదేని ప్రవేశపెట్టవలెనన్న అధికారులకిష్టములేకున్న వీలుండదు. అధికారులే చట్టమును చేయదలచినను జరిగితీరవలసినదే కాని అనధికారుల ఆక్షేపణలు వానిని ఆపజాలవు. రౌలత్ చట్టము (Roulat Act) మొదలగు క్రూర శాసనములెన్నియో వారు చేయజాలిరి. వాటిని రద్దు కాకుండ నిలుపకొనగలిగిరి. పంజాబు దురంతములను గూర్చి జవాబు చెప్పవలసిన అగత్యము లేకుండా అప్పటి అధికారులు అనాలోచిత కార్యములెన్నియోనర్చినను వాటినన్నింటిని సర్దుబాటు చేయగలిగిన శాసనమును కూడా వారిదివరకు

చేసికొనియే యుండిరి. ఈ మధ్య నొక శాసనసభ్యుడు పంజాబును గురించిన ప్రశ్నయే తేగా, దానిని వొదులుకొమ్మనిరి. ఇట్టి స్థితిలో యీ విషయమును గురించి ముభావము వహించుటకన్న చేయదగిన మార్గము తోచకున్నది. ఇట్టి స్తితులనన్నింటిని ఆలోచించి దీనికి ప్రతిక్రియగ మన మాచరించతగినదే 'సత్యాగ్రహ వ్రతము' 'స్వాత్వికనిరోధము' దౌర్జన్య రహితమగు సహాయ నిరాకరణము (Non Cooperation) వీనికన్న మంచి మార్గము లేదని మహాత్మగాంధీగారు నిర్ధారణ చేసియున్నారు. అందువలన ప్రజాశక్తిని ప్రభుత్వంవారు గ్రహించునటులజేయుటయే వారి యుద్దేశ్యము.

ప్రస్తుతము శాసన సభల బహిష్కరించవలెననిరి. దీనిలోనభ్యర్తులుగ నుండదలచిన విద్యావంతులు త్యాగమును పరీక్షింప సమయమిదేయని వారి తలంపు. అట్లు జరగనిచో సామాన్య ప్రజలకు రాజకీయ పరిజ్ఞానమును కలుగజేసినచో వారేకీభావము వహించి తమ సమ్మతుల (ఓటు) నీయనిచో అభ్యర్థులు అప్పుడైనను మారితీరెదరు. యీ సహాయ నిరాకరణ తీర్మానమును కలకత్తా కాంగ్రెస్ సభలో చర్చకు గొనిరాబడినపుడు గాంధీగారు చెప్పిరిగదాయని వెంటనే ఆమోదింపబడలేదు. వంగదేశ నాయకులు చాలా వరకు అభ్యంతరములు చెప్పిరి. అప్పుడు గొప్ప రాద్దాంతము జరిగిన పిమ్మట ప్రజలలో ఎక్కువ మంది యొక్క అంగీకారమును పొందిన పిమ్మట మిగిలిన వారును అందుకు సమ్మతించిరి. గనుక యిప్పుడు మనమైనను యీ సహాయ నిరాకరణ పద్ధతి కాంగ్రెస్ సిద్ధాంతముగనుక మన మందరము ఒప్పుకొని తీరవలెననే పట్టుదలకంటే జనులందరికిని తెలియజెప్పవలసిన అంశములన్నింటిని వారికి బోధించి వారికి గల సందేహములన్నింటిని పొగొట్టగలిగినచో వారి మనసులకు వారు ఆలోచించి నిర్ధారణ చేసుకొనిచ్చినచో అందరును యిదే సిద్ధాంతమునకు రాగలరు. ఈ సహాయ నిరాకరణ పద్ధతి వలననే జనుల ఏకాభిప్రాయమునందలి ప్రాముఖ్యతను ప్రభుత్వము వారు గ్రహించగలరు. ఈ తాలూకాలో మొత్తము మీద చూచినన బిరుదములు గల్గినవాటిని వదలము అనువారుగాని, శాసనసభ్యర్థిత్వము కోరియుండి దానిని వదలము అనువారుగాని, పట్టాలను వొదులకొనుటకు యిష్టములేక ఏదోయొక సమాధానమును జెప్పి సరిపుచ్చే వకీళ్లుగానేలేనందున చాలావరకు యీ మధ్యమ వ్యాప్తికి అనుకూలమే అయినను యిట్టి సందర్భములో ఒక మహా నాయకుని వాక్యము (లాలా లజపతిరాయ్) స్ఫురణకు వచ్చుచున్నది. సామాన్యముగా ప్రజలందరికి (Political Training) రాజకీయ పరిజ్ఞానమునందు ప్రావీణ్యత కలుగజేయుట మాత్రమే విద్యాధికులు చేయదగిన మొదటిపని. తర్వాత దేశమునకు ఆవశ్యకములైన విషయములనన్నింటిని వారే నిర్ధారణ చేసికొనగలరు. మనమేదైననొక క్రొత్త సూచననిచ్చినను దానిని విపులముగ చర్చించి ప్రజలందరి అభిప్రాయము తీసుకొనిగాని దానిని సిద్ధాంతీకరింపకూడదు.

4. స్వదేశ పరిశ్రమాభివృద్ధికి, స్వదేశ వస్తు ప్రోత్సాహమును విదేశీ వస్తు బహిష్కరణమును ముఖ్య సాధనములని యిప్పటికి 13 సంవత్సరముల నుండి వట్టి మ్రోతలతో సరిపుచ్చుటయగుచున్నది. యుద్ధము వలన కాటకము వలనను ప్రతి కుటుంబీకునికి కావలసినంత స్వానుభవము కలిగినందున యిప్పటికి నూలు వడుకు బట్టలు నేత పనులు మరల తలయెత్తినవి. నూర్గురు గాంధీ మహాత్ములయుపదేశముల వలన జరుపదగినంత మార్పు కంటెను ఎక్కువ పని ఒక్క తృటిలో దానంతటదియే జరిగినది. ఇపుడు ప్రతి గ్రామము నందు నూలు వడుకు రాట్నములు చేతి మగ్గముల నేతలు విరివిగా అమలునందున్నవి. ఇవి మన చేతిలోని సులభ సాధ్యమైన పనులేగాని యింత దనుక ఆచరణలో లేవు. ఇప్పుడైనను యింతటి నుండి మనము మరువక ఎంత చవుకయైనను సరే యితర దేశపు బట్టలను కొనకుండ జరుపుకొందుమేని మన దేశపు బట్టల కరువు ఎన్నటికిని మరల మన దరికి రాదు. ఇట్లనే ప్రతి విషయమును మన

చేతులలోనుండియును ఆచరణయందుంచబడునంత వరకు అన్యుల కొరకు అపేక్షించుటయును అందువలన మన దేశ దారిద్ర్యము తొలగక పోవుటయును సంభవము నిశ్చయము. గనుక దూరదృష్టి గల ప్రతి మానవుడును తన దేశౌన్నత్యము కొరకు దేశ స్వాతంత్ర్యము కొరకు పాటుబడవలెను. ఇంకను కాలహరణము చేయుచు మీరందరు తరచుగా వార్తాపత్రికలలో అనుదినము చదివెడియంశములనే చెప్పుచూ మిమ్ములను విసిగింపజాలను.

ప్రస్తుతమింకొకటి రెండు విషయములను గురించి మాత్రము చెప్పదలచితిని.

5. మనలో ప్రతి రైతును చెల్లించెడి శిస్తు మీద రూపాయకు అణా వంతున లోకల్ సెస్సు అనే పేరుతో కొంత పన్ను వసూలగుచున్నది. దీనిని ప్రత్యేకించి లెక్కవేసి ఒక ఫండుగా నేర్పరచి దానికి లోకల్ ఫండ్ అనే పేరుతో ఒక శాఖగానుంచి, ఆ సొమ్మును క్రమమైన వినియోగము కొరకు ఒక సంఘము నేర్పరచి దానికి కొన్ని అధికారములీయబడినవి. అట్టి సంఘములే మన 'లోకల్ బోర్డులు'

ఈ లోకల్ బోర్డులలోని సభ్యులందరును రైతుల నుండి ఎన్నుకోనబడినవారుగ నుండి అధ్యక్షుడు సైతం ఎన్నుకొనబడినవారుగనే యున్నచో నవీన పద్ధతులకు సరిపోవు పరిపాలనగ నుండి యుండెడిది. ఇప్పటికింకను అట్టి ఏర్పాట్లేమియు జరగలేదు. అందువలన రైతులకేమి నష్టమనియెదరా? మనవి జేసెదను. ఐదేండ్ల క్రిందట బందరు ఆంధ్ర జాతీయ కళాశాలలో జరిగిన కృష్ణామండల సభలో రైతులకుపయోగించు తీర్మానములలో పశు వైద్యశాలలు చాలా అగత్యములని వెంటనే అట్టివి నెలకొల్పుటయుక్తమని ఒక తీర్మానము ప్రవేశపెట్టబడినది. దానిని నేను బలపరిచనటుల జ్ఞాపకము. దానినే తిరిగి గుడివాడలో సభ జరిగినపుడును, మరల నీయేడు పెద్దకళ్లేపల్లిలో సభ జరిగినపుడును తిరిగి ప్రవేశపెట్టుచునే వచ్చితిని. కాని దాని ఫలితమునింతవరకు మన తాలూకా రైతులు పొందజాలరైరి. గవర్నమెంటు వారు ప్రతి తాలూకాలోను ఒకేసారి అన్ని చోట్లను స్థాపించుటకు వారికి కష్టమనిపించినచో ఏటేట ఒక్కొక్క తాలూకాకు అట్టి వంతను కలుగజేసిన కొన్ని సంవత్సరముల నాటికైనను ప్రతి తాలూకాలోను ఒక వంతునైన ఏర్పడగలవు. తాలూకా బోర్డు పరిపాలన రైతు ప్రతినిధుల చేతులలోనున్నచో వారికి ముఖ్యావశ్యకమైన యిట్టి విషయములను మరువక అధమము తాలూకా కొకటి వంతుననునైను ఏర్పరచుకొనెడివారని తలచవచ్చును. గనుక ముఖ్యముగా ప్రతి తాలూకా బోర్డు వారికి అట్టి ఎన్నికాధికారములే కలిగియుండుట చాలా అగత్యమైన విషయము.

6. మనలో మనకెన్ని జాతి, మత, కులబేధములు, కక్షలున్నను సమిష్టి విషయములు తటస్తించినపుడు పూర్వ కక్షలన్నిటిని విస్మరించి ఐకమత్యమునకు పాటుపడవలెనను హిందూ మహ్మమ్మదీయ నాయకులు సమ్మేళనములకు జేసిన ప్రయత్నములు సఫలీకృతములై యిపుడిరుతెగలవారును కలయికగా పనిచేయుటలేదా? అటులనే అన్ని తరగతులవారును ఎన్ని బేధాభిప్రాయములున్నను వాటినన్నింటిని సమన్వయపరచి ఏదేని యెక మంచి సిద్ధాంతమునకు దిగుట యుక్తము. ప్రస్తుత విద్యా విధానము ఆధునిక దేశీయ పద్ధతులకు అనుగుణ్యమగు రీతిని మార్పునొందింపవలసి యున్నదని చాలామంది దేశ ప్రముఖుల అభిప్రాయములనిచ్చుచున్నారు. గాన అట్టి విధానముల నిర్మించుకొని తదనుగుణ్యముగ విద్య నేర్పించుచున్నచో మన విద్యార్థులే భావి కాలమున దేశోద్ధారకులగు ప్రజలు కాగలరు. అందువలన దేశమునకు మంచి స్థితి నింకను వృద్ధి నొందించినవారమగుదుము. పల్లెటూళ్లయందు రైతులు వృధా కలహములతో కక్షలు వహించి న్యాయస్థానములకెక్కుట తగ్గించుకొని ఏ వేని తగవులు సంభవించినపుడు

పరిష్కరించుకొనుటకు గ్రామములలో న్యాయ ప్రవర్తనములను సన్మార్గులునగు మధ్యవర్తులుగల పంచాయితీ సభలను ఏర్పరచుకొని వాటి ద్వారా తగవులను తీర్చుకొనుటయుక్తము. ఇందువలన మన ద్రవ్యమును కాలమును వ్యర్థపోదు. ఇందుకు మనలను ఎవరును కాదనరు. ఈ పద్ధతి ఎంతయైన ఉపయోగకరమైన విషయము.

సహకార పరపతి సంఘములు ముఖ్యము. ప్రతిచోటను స్థాపించబడవలెను. వాటివలన ఎంతైనా మేలుగలదు. ఇవి అనోన్య సాహాయమును చాలా తోడ్పాటు కాగలవు. సామాన్యులందరికిని ఎన్ని కష్టములైన నివారించగల వీలు వీటికి కలదు. ఇందును గురించి ప్రత్యేకమొక యుపన్యాసమిచ్చినను చాలదు. ఈ సంవత్సరము మన మెట్ట గ్రామములవారికి తొలకరి వానలు లేనందువలన తటస్థించిన దుర్భర క్షామమును గురించి కృష్ణాపత్రిక, ఆంధ్ర పత్రికలయందు నాచే వ్రాయబడిన వ్యాసమెకటి కలదు. దానిలోని కష్టములు మనకున్నవియేగాని వానిని గురించి మాత్రము ఎవరును ఏ మాత్రము శ్రద్ధయును తీసికొనరైరి. అనగా మన మీదనే మనమాధారపడితిమి. అట్టి స్థితిలో క్షామ నివారక సంఘములుగాని పరపతి సంఘములుగాని యున్నచో మన కష్టముల నివారణ కొకింతయైన సాయమిచ్చెడివేగాని అట్టివి లేని లోపము మనకీయేడు తెలిసివచ్చినది. గనుకముందైనను తాలూకా వాసులగు ప్రజలిందుకు ప్రయత్నింతురుగాక. ఒక గానసభయందు శృతి, పాట, తాళము, మృదంగముల సమ్మేళనమెటులనో అటులనే మన శరీరము నందలి ఒక్కొక్క అవయవముతో ఒక్కొక్క విధమగు పని నెరవేర్చినను అన్నిటి సాముదాయకము కలిసిన శరీర పోషణము అను మొత్తపు పని వలెనే, మనలో ఏ యొక్క పనినిగాని దానియందనుభవము అభిమానము గలిగి పనిచేయగలవారు పూనుకొనుట మంచిది. అన్ని తరహాల ఉద్యమములను కలిపి కలగూరగంపవలె జేసి ఎవరుగాని సమర్థింపబూనిన ఏ మాత్రమును కొనసాగదు.

గ్రంథాలయ విద్యాలయములనిన నాకెక్కువ అభిలాష, గనుక అట్టి పనినే చేయబూనుట యుక్తము. మరియెకరికి సహకార సంఘములనిన ఎక్కువ అభిమానము. వారు దానియందే పని బూనదగును. అటులనే ప్రతివారును వారికి అత్యంత ప్రేమగల విషయములోనే ఎక్కువ పనిబూనుకొని గమ్యస్థానమును మరువక అందురును దేశాభ్యుదయమునకు విశేషించి పాటుపటుదురుగాక.

నేనిందుదహరించినవి గాక యింకను వదిలిన యంశములనేకములుండవచ్చును. గనుక చర్చనీయాంశములన్నింటి నేర్పరచుటకొక విషయ నిర్ధారణ సభను సమకూర్చగోరుతూ నా యుపన్యాసమింతటితో ముగించుచున్నాను. లోకాస్సమస్తా స్సుఖినోభవంతు – వందేమాతరమ్

– కావూరి కోదండరామయ్య

# కోదండరామయ్య గారి నోటు పుస్తకంలోని కొన్ని ఆసక్తికర విషయాలు

## కోహినూరు (చరిత్ర)

1. వజ్రము 2. వైడూర్యము 3. గోమేధికము 4. మరకతము 5. మాణిక్యము అనీలము 7. పుష్యరాగము 8. ప్రకాశము 9. మౌక్తికము అను నవరత్నములలో వజ్రము శ్రేష్ఠమైనది. ఒక గురివింద గింజ యెత్తు గల నిర్దుష్టమగు వజ్రము పదివేలరూపాయిల ఖరీదు గలిగియుండును.

సుమారు పది శతాబ్దముల క్రిందట కృష్ణామండలంనందలి 'పరిటాల' గ్రామమునొద్దసేద్యమునకై దున్నిన పొలములో ఒక వజ్రము కాపునకు కనిపించగా దానినతడు మక్కువతో కొంతకాలముంచుకొని పిమ్మట ఆ ప్రాంతపు రాజునకీయగా, కొంతకాలమునకు యెట్టెటులోపోయి గ్వాలియరు మహారాజుకు చేరెను. 1526 సంవత్సరమున మొగలాయి చక్రవర్తి బాబరు ఢిల్లీ చక్రవర్తియగు ఇబ్రహింలోడియు పానిపట్టు వద్ద చేసిన యుద్ధములో, ఇబ్రహింలోడీయును, గ్వాలియరు మహారాజును నిహతులైరి. బాబరు సామ్రాజ్యాధిపత్యము వహించెను. బాబరు కొడుకున హుమాయూన్ వలన పొందిన ఉపకారమునకై గ్వాలియరు సంస్థానంవారు యీ వజ్రమును బహూకరించిరి. ఆయన తన మయూరాసనము యొక్క శిరోభాగమునందమర్చించి ఢిల్లీయందుంచెను.

1739 సంవత్సరమున పారసీకమును పాలించుచున్న నాదర్షా దండెత్తి ఢిల్లి నగరమాక్రమించినపుడు యీ వజ్రమును చూసి తన భాషలో కోహినూర్ (ఏమి కాంతిపుంజము) అని పలికెను.

ఆ పేరే ఇప్పటికిని కలదు. పిమ్మట కొంతకాలమునకు ఆఫ్ఘనులచే అపహరింపబడి కాబూలునందుండెను. మరికొంత కాలమునకు పాంచాలదేశమునేలిన 'రణజిత్‌సింగు' వశమై లాహోరు నగరమునందుండెను. 1850 సంవత్సరమున ఆంగ్లేయులు పంజాబును స్వాధీనము చేసుకొన్నప్పుడు వారికిదక్కినది. దానిని ఇంగ్లాండును పరిపాలించుచుండిన 'విక్టోరియారాణి' గారికి అర్పించిరి. 180 క్యారెట్లు తూనికలగల ఆ వజ్రమును వారు సానబట్టించినందున 0.3 క్యారెట్లుకు బరువు తక్కినది. వన్నె హెచ్చినది. చాలా కాలము బ్రిటిషురాణిగారి కిరీటమునందు పొదిగింపబడినదై అచటనే యుంటుండెను. ఇపుడు బ్రిటిష్‌వారి కోశాగారమున భద్రపరుపబడియుండెను. కాంతియందును కాఠిన్యమునందును విలువయందును దీనికి మించినది లేదు.

వజ్రమున్నచోట, కామితార్థములు వర్షించువచ్చును లేదా పిడుగులు రాలవచ్చును. వజ్రములు కొనేవారు వాటి అచ్చుబాటును బాగా పరిశీలించికొనెదరు.

రాజాధి రాజులకు, కోటీశ్వరులకు మాత్రమే వీలగును.

## శ్రీ తిరుమల యాత్ర

నేను సకుటుంబముగా, తిరుమల యాత్రార్థం ది. 15-4-1910 సం॥ రాత్రి 3 గంటలకు రావివారిపాలెము నుండి బయలుదేరి మరుసటి మధ్యాహ్నం 12 గంటలకు వెల్లటూరు చేరి, భోజనాంతరం సాయంకాలం 3 గంటలకు బయలుదేరి 6 గంటలకు పొన్నపల్లి చేరి అచట సత్రమునందారాత్రి నివసించి మరుసటి ఉదయం 9 గంటలకు ఇంటూరు చేరితిమి. అచట భోజనాలు చేసి ఆ రాత్రికి నిడుబ్రోలు చేరి అచట సత్రములోనుంటిమి. ది. 18-4-1910 నాడు ఉదయం 8-30 గంటలకు మదరాసు ప్యాసెంజరు రైలు ఎక్కివెళ్లుతుండగా, గూడూరు జంక్షనుకు చేరకముందు రైలు ఇంజను చెడినందున మధ్యలో ఏ స్టేషను లేనిచోట రైలు ఆగిపోయింది. బెజవాడకు తంతి యిచ్చి తాడేపల్లి నుండి ఇంజను రప్పించిన మీదట సాయంత్రం 4 గంటలకు గూడూరు చేరితిమి. ఆ రాత్రి అచట సత్రమునందు నివసించి మరుసటి ఉదయం రైలులో బయలుదేరి మధ్యాహ్నం 12 గం॥లకు తిరుపతికి చేరితిమి.

అచట పెండ్యాల సూరయ్యగారి ఇంటియందు బసచేసి, చిల్లర మార్చుకుని మహంతుగారి మేడలు మొదలైనవి చూచి ఆ రాత్రి దిగువ తిరుపతిలో ఉంటిమి. ది. 20-4-1910నాడు ఉదయాత్పూర్వమే బయలుదేరి 11 గంటలకు కొండపైకి ఎక్కివెళ్లి అచట సూరయ్యగారి బసలోనే దిగి, వెంటనే మంగలిమిట్టకు వెళ్లి క్షురకర్మలు తీర్చుకొని పుష్కరిణిలో స్నానము చేసి మొక్కులు ముడుపులతో శ్రీ వేంకటేశ్వర స్వామివారి కోవెలకు వెళ్లి సమర్పించి, శ్రీ స్వామివారిని సేవించి, నమస్కరించి బసకు వెళ్లి ఆ రాత్రి అచటగల సహస్రస్తంభ మంటపము-మహంతు భవనములు, దేవళములోని ఏకాదశి మహోత్సవములు దర్శించితిమి. ఆ రాత్రి చలిగాలి వీచినది. మరుసటి ఉదయం దేవళములో శ్రీ స్వామి పునర్దర్శించి 21వ తేదీ మధ్యాహ్నం శైత్యభారము వల్ల కలిగిన జబ్బుతో, డోలీలో ఎక్కి దిగువ తిరుపతికి చేరితిమి.

అప్పటికి జ్వరము తీవ్రత వల్ల శరీర స్పృహ లేదు. క్రిందటి రోజున ఎగువ తిరుపతిలో ఇతర తీర్థములకు వెళ్లుటకు శరీర అస్వస్థత వల్లనే మానుకొని వచ్చితిమి. 22వ తేదీన సూరయ్యగారి బసలో విశ్రాంతి తీసుకొన్న మీదట జ్వరము నిమ్మళించినది. ఆ ఉదయం స్త్రీలు అలివేలుమంగాపురము వెళ్లి, మూసివాయనములు తీర్చుకొని, కోనేటిలో స్నానము చేసి, అమ్మవారి దర్శనం చేసుకొని, పూజించి నమస్కరించి వచ్చిరి.

ఆ సాయంకాలం బజారుకువెళ్లి కావలసిన పాత్ర సామానులు మొదలైనవి కొంటిమి. 23వ తేదీ ఉదయం తిరుపతి తూర్పు స్టేషనులో తిరిగి రైలు ఎక్కితిమి. శ్రీకాళహస్తి క్షేత్రము చూడగోరి అచట దిగితిమి. సువర్ణముఖి నదిలో స్నానములు చేసి శ్రీ కాళహస్తీశ్వర దర్శనం చేసి ఆ యూరిలో భోజనాలు చేసితిమి. అచట విశ్రమించి 24వ తేదీ ఉదయం రైలులో గూడూరు చేరితిమి. గూడూరు నుండి మధ్యాహ్నం 12 గంటలకు రైలులో బయలుదేరి రాత్రి 7-30 గంటలకు తిరిగి నిడబ్రోలు చేరితిమి. 25వ తేదీ ఉదయం బయలు దేరి 9 గంటలకు ఇంటూరు చేరితిమి. అక్కడ నుండి సాయంత్రం 3 గటలకు బయలుదేరి రాత్రి 9 గంటలకు భట్టిప్రోలు చేరితిమి. ఆ రాత్రి అచట చెరువు దగ్గర రోడ్డు ప్రక్కన బళ్ల మకాములో ఆగి, భోజనాలు చేసి ఆ రాత్రి అచట నిద్రించి, 26వ తేదీ ఉదయం బయలుదేరి 11 గంటలకు పొరిటిగడ్డ మకాం చేసి ఆ సాయంత్రం 2 గంటలకు బయలుదేరి 5 గంటలకు ఇల్లు చేరితిమి.

## పోస్ట్ & టెలిగ్రామ్స్

తపాలశాఖ తాలూకు సర్వాధికారాలను గవర్నమెంటుకు సంక్రమింపజేస్తూ ఒక చట్టము 1837 సంవత్సరంలో ఏర్పడినది. తపాల శాఖ అందరి ఉపయోగానికి వచ్చినది. గవర్నమెంటు వారు మినహా మరెవరూ తపాలు కాగితాలను తీసుకెళ్లకూడదని, నిషేదం ఉండేది. పావు తులం బరువు గల ఉత్తరానికి అర్ధణా రుసుము. దూరాన్ని బట్టి రుసుము పెరుగుతుండేది. 1854 సం॥ ఈ శాఖంతా ఒక డైరెక్టరు జనరలు చేతిలో పెట్టి, తపాలు బిళ్లలు ప్రవేశపెట్టి బరువు ప్రధానంగా, దూరము నిమిత్తము లేకుండానే క్రమమైన రుసుములు నిర్ణయిచినారు.

1871 సం॥ (భంగీ =కావిడిబద్ధ) పార్సెలు రుసుము కూడా, ఉత్తరాలకు వలెనే క్రమ నిర్ణయము చేసి రైళ్లమీద పంపేవారు. (అంతకు పూర్వం కావిడిబద్దకు తగిలించి పంపేవారు)

1877 సం॥ వాల్యు పేయబిలు పద్ధతి ఏర్పడినది.

1878 సం॥ ఇన్స్యూరెన్సు పద్ధతి ఏర్పడినది.

1880 సం॥ మని ఆర్డరు పద్ధతి ఏర్పడినది

1885 సం॥ సేవింగ్సు బ్యాంకి పద్ధతి ఏర్పడినది.

## Extension of Krishna East Bank Canal Scheme (1936)

Total Ayacut Proposed - One Lakh Acres

| | | |
|---|---|---|
| Divi island | - | 42000 |
| Main Land upto Mopidevi (Kharif) | - | 46000 |
| **Total Ayacut** | **-** | **88000** |

| | | |
|---|---|---|
| Estimate for Construction of Puligadda Aqueduct | - | Rs. 836430 |
| Estimated cost of the East Bank Canal Upto Mopidevi | - | Rs. 2077890 |
| **Total Estimate** | **-** | **Rs. 2914320** |

The difference between the estimation and the actuals is about 20 per cent less



పెద్ద కుమారుడు
సోమశేఖర ప్రసాద్
కోడలు దుర్గాంబ

చిన్న కుమారుడు
దేవకీనందన ప్రసాద్
కోడలు సుభద్ర






భార్య సీతారావమ్మతో



కోదండరామయ్య ఇంటివాకిట్లో సోమశేఖర ప్రసాద్, దుర్గాంబ



దేవకీనందన ప్రసాద్, మనుమలు రమేష్,
కృష్ణమూర్తి, యజ్ఞనారాయణ



సమాధుల వద్ద మనుమడు రమేష్ కుమార్తెలు,
మనుమరాళ్లు